
సంపుటి 53 సంచిక 132 **అక్టోబర్** 2020

***పూని ఏదైనా ఒక మేలు చేసి జనులకు చూపవోయి***



**జయజయ ప్రియభారత జనయిత్రి**

# విషయ సూచిక


**సంపాదకీయం – విజయ మాధవి గొల్లపూడి**..........1

సెక్రెటరీ రిపోర్ట్ – **అపర్ణ సుసర్ల**..... ..........2


## శీర్షికలు


శ్రీమద్భగవద్గీత - పెయ్యేటి రంగారావు..........4

గీతార్చన –పెయ్యేటి శ్రీదేవి.......... ..........8

క రోనా -షామీరు జానకీదేవి ..........11

కార్తీకమాసం విశిష్టత – లలిత రాంబొట్ల..........13

గుర్తుకొస్తున్నాయి –వంశీ రామరాజు..........15

అలారం- పెయ్యేటి రంగారావు ..........20

తెలుగుతల్లి నుతి – మీగడ రామలింగస్వామి........,..........24

దీపావళి-నేదునూరి అనురాధ..........25

మాస్క్ లూ రిస్కు లూ-చిట్టెన్ రాజు వంగూరి..........27

తెలుగు సాహిత్యంలో వెలుగు-మల్లికార్జునరావు రాచకొండ..........30

సంగీతనాదామృతం-పద్మ మల్లెల..........33

నానీలు – ఎస్.ఆర్.ఎస్ కొల్లూరి..........35

నా నీ స్వచ్ఛవిశ్వం- ఎస్.ఆర్.ఎస్ కొల్లూరి ..........37

వానప్రస్థం-సుబ్బారావు జడా..........40

మహిమ-డి.కామేశ్వరి..........49

బాలవాహిని..........73

Telugu Association Inc.
PO Box -1382, Parramatta, NSW 2124
ABN : 56 303 933 034
www.sydneytelugu.org
పూని ఏదైనా ఒక మేలు చేసి జనులకు చూపవోయి!

email: vahini@sydneytelugu.org

| ఎడిటర్ | అసోసియేట్ ఎడిటర్ | వెబ్ అడ్మిన్ |
|---|---|---|
| విజయ మాధవి గొల్లపూడి | సాయి లక్ష్మీనారాయణ గొల్లపూడి | అపర్ణ సుసర్ల |

# సంపాదకీయం

తెలుగువాహిని పాఠకులందరికీ శుభాభివందనాలు.గత నెల సిడ్నీ తెలుగుఅసోసియేషన్ వార్షిక సమావేశం లో నూతన కార్యనిర్వాహక వర్గం ఏకాగ్రీవంగా ఎన్నుకోబడింది. తెలుగు అసోసియేషన్ అధ్యక్షునిగా బాధ్యతలు చేపట్టిన శ్రీ మధు బైరెడ్డిగారికి, కార్యదర్శిగా శ్రీమతి అపర్ణ సుసర్ల గారికి మరియు కార్యనిర్వాహక సభ్యులందరికీ శుభాకాంక్షలు.

నవంబర్ ఒకటవ తేదీ భావకవి శ్రీ దేవులపల్లి కృష్ణశాస్త్రిగారి జయంతి సందర్భంగా ఈ మాసం వాహినిపై ఆయన ముఖచిత్రం అందిస్తున్నాము. శ్రీ వంశీరామరాజు గారు ప్రపంచంలోని పలు గాయకులతో 12గంటలపాటు దేవులపల్లి వారి పాటలతో కార్యక్రమాన్ని నిర్వహించబోవటం ముదావహం.

పెద్దా,చిన్నా అందరూ దివ్వెల వెలుగులతో ఆనందోత్సాహాలతో జరుపుకునే పండుగ దీపావళి ఈ నెల 14వ తేదీ న రాబోతోంది. ఈ దీపావళి వేడుకలను తెలుగుఅసోసియేషన్ అంతర్జాలంలో నిర్వహించనున్నారు. మీరంతా తప్పక హాజరు కాగలరని ఆశిస్తున్నాము.

ఇపుడిపుడే ప్రపంచంలో కొన్ని దేశాలు కరోనా అనిశ్చిత పరిస్థితి నుంచి బయటపడటానికి ప్రయత్నిస్తున్నాయి. ఉద్యోగ నిర్వహణకై కార్యాలయంలో తిరిగి పనిచేయడానికి తగు జాగ్రత్తలు, సూచనలు ఇస్తున్నారు అధికారులు.

ఎటువంటి పరిస్థితి ఎదురైనా మానసిక ఆరోగ్యంద్వారా కొంతవరకు అధిగమించవచ్చును. భావోద్వేగాల నియంత్రణ, సమతుల్య ఆహారం, వ్యాయామం, మానవ సత్సంబంధాలు, విషయ విజ్ఞాన సముపార్జన అనే కనపడని ఆస్తులనుకూడా ప్రతివారు నిక్షిప్తం చేసుకుంటే జీవితం సార్థకమవుతుంది. వచ్చే వర్షాన్ని ఆపలేము. కానీ గొడుగు ఉపయోగించి ఇబ్బంది కలగకుండా ముందుకు సాగడము చేతిలోని పని.

కనివిని ఎరుగని కరోనా కాలం ప్రపంచంలో ప్రతి ఒక్కరి జీవితంలో కొత్త పాఠాలు నేర్పింది. కరోనా ఉధృతిని ఆపలేకపోయినా తగు జాగ్రత్తలు, అప్రమత్తతతోఉంటూ కాలాన్ని వెళ్ళదీసాము. కొన్ని చేదు అనుభవాలు కూడా రుచి చూసాము. కొన్ని ముఖ్యమైన పనులు తాత్కాలికంగా నిలిపివేయడం, కొత్త పనులు, పద్ధతులు, వ్యాపకాలు అలవరచుకోవడం చేసారు. టెక్నాలజీ ఇంత బాగా వాడుకోవచ్చని కరోనా కాలంలో తెలిసింది. ఉద్యోగ బాధ్యతలు ఇంట, బయట నిర్వహించే వెసులుబాటు కలిగింది. పరస్పర అంగీకారంతో ఇంట్లోను, కార్యాలయంలో ఉద్యోగం చేయడానికి అవకాశం ఇస్తున్నారు కొంతమేర. సాంఘిక మాధ్యమాలలో ఎన్నో ఉపయుక్తమైన చర్చలు, పుస్తకాలు పంచుకోవడము తో సమయం తెలియకుండానే ముందుకు సాగిపోయింది మనకు.తెలుగువాహిని పాఠకులకు, ప్రకటనదారులకు రచయితలకు, వ్యాసాలు, కవితలు అందిస్తున్న ప్రతి ఒక్కరికీ దీపావళి పండుగ ప్రత్యేక శుభాకాంక్షలు తెలుపుకుంటూ ప్రస్తుతానికి ఈ సంచిక చదవడానికి తగు సమయం కేటాయించగలరని భావిస్తూ

**మీ శ్రేయోభిలాషి**

**విజయ గొల్లపూడి**

**0438293687**

**vahini@sydneytelugu.org**

## ఎక్జిక్యుటివ్ కమిటీ


ప్రెసిడెంట్: శ్రీ మధు బైరెడ్డి
0425 209 397


వైస్ ప్రెసిడెంట్: మోహన్ పరస్సు
0419 219 526


సెక్రెటరీ: : అపర్ణ సుసర్ల
0424 558 371


ట్రెసరర్: హరిబాబు కొల్లూరి
0425 291 032


కమిటీ మెంబర్: వీర్రాజు గున్నం
0431 714 501


కమిటీ మెంబర్: కామేశ్వరి ఉడత
0424 937 166


కమిటీ మెంబర్: ప్రసూన కంభంమెట్టు
0405 445 662

## సబ్ కమిటీలు


వాణి కన్వీనర్ : : శ్రీ మధు బైరెడ్డి
0430 002 130


వాహిని ఎడిటర్:
విజయ గొల్లపూడి 0438 293 687

తెలుగు స్కూల్ కోఆర్డినేటర్
భారతి పరస్సు 0431 257 480


వనితా మండలి కోఆర్డినేటర్
శోభ వెన్నలకంటి - 8901 3636


వెబ్ అడ్మిన్ : అపర్ణ సుసర్ల
0424 558 371


సిడ్నీ తెలుగు సీనియర్స్ కోఆర్డినేటర్
రవి సీతంరాజు

## UIA మెంబర్


శ్రీని పిల్లమఱ్ఱి
0452 025 666

## ఫైనాన్షియల్ అడ్వైసరి కమిటీ (FAC)


మూర్తి పోతుకూచి


శ్రీనాధ్ ఖండవల్లి


సుందరం రాచకొండ


ఆడిటర్
మధు వెన్నెలకంటి


పబ్లిక్ ఆఫీసర్
రవి సీతంరాజు

# SECRETARY REPORT

Dear Members,

Greetings from Secretary's desk!

COVID-19 has turned our world upside down and impacted us all in different ways, but we are still united, still connected, and guided by an Action Plan that focuses our work and prepares us for a stronger future. Our association and sub-committees have quickly adapted to the times, with committee members and volunteers finding new ways to respond to this pandemic through virtual/face to face connections, action, and service.

Our association's 2020 Annual General Body Meeting took place on Sat 10 Oct 2020 at Dundas Community Centre, 21 Sturt Street, Telopea NSW 2117. The new executive committee (EC) for 2020-21 is formed unanimously. Visit our website to meet your EC 2020-21 members.

Firstly, I thank Mr. Satheesh Varada Raju (outgoing President), Mrs. Vani Saradhi Motamarri (outgoing Secretary) and Mr. Murthy Voleti (outgoing Treasurer) for their valuable services to the association during 2019-20. The EC is thankful for their useful guidance and continuous support in the background. Mr. Satheesh Varadha Raju and Mrs. Vani Saradhi Motamarri have spearheaded the Australia & New Zealand Telugu Cultural festival and successfully completed the event.

The EC has been working closely with sub-committees and the summary of activities are shared below:

- The Web Committee has released a new self-serving website. The website has fresh look and feel. EC and sub-committees thank Mr. Venkat Tallapragada for the design and development of the new website. I encourage all our members to visit https://www.sydneytelugu.org/

- STA thanks Mr. Saradhi Motamarri (Outgoing Telugu Vani Convenor) for his valuable proactive services to Telugu Vani driven by his passion to Telugu language. EC team is working with the broadcasters to appoint Telugu Vani Convenor.

- STA thanks Mr. Malik Rachakonda (Outgoing Telugu Badi Convenor) for his valuable services to Telugu Badi driven by his passion to take our Telugu cultural heritage into the greater community and always having a finger on the pulse of local NSW community groups. EC is working with Telugu Badi Co-Ordinator and teachers to appoint Telugu Badi Convenor. EC would like to thank Mrs. Bharati Parasu and the teachers for ensuring smooth operations of Telugu Badi weekly activities.

- EC is working closely with Public Officer Dr. Ravi Seethamraju and seeking his advice and guidance on governance and compliance changes.

The EC have added 3 new members to our Life Member pool. EC welcomes the life members

Mrs. Swaraj Byreddy
Ms. Vallabhaneni Krishna Kumari
Ms. Sailaja Kambhammettu

The EC is working on our annual flagship event of the association, Deepavali Celebrations on Saturday 21-Nov-2020, 6PM onwards as an online event. The event will be showcasing local talent and participation from our STA members
Check out the event details on Radio, Web and Social Media. Please save the date 21 Nov 2020 in your calendar.
Executive Committee invites you all to be part of this Deepavali Sambaralu.

Best Regards,
Aparna Susarla
Secretary Sydney Telugu Association

**Vahini**

**వాహినికి మీ రచనలు పంపడానికి, సూచనలు, స్పందనలు తెలుపడానికి మీరు పంపవలసిన మా చిరునామా - vahini@sydneytelugu.org**

Newsletter of Telugu Association Inc., Sydney published in

*Telugu*,

The second largest language spoken in India

Please visit sydneytelugu.org and subscribe to Vahini monthly magazine to receive by e-mail.

❖❖❖❖❖

**విజ్ఞప్తి**

మీ శీర్షికలు, వాణిజ్య ప్రకటనలు వాహిని పత్రికలో ప్రచురించడానికి, విజయ మాధవి గొల్లపూడి vahini@sydneytelugu.org ద్వారా సంప్రదించగలరు. మీ ప్రచురణలు ప్రతి నెల 25వ తారీఖు లోపల పంపవలసినదిగా విజ్ఞప్తి. మీ రచనలతో పాటు ధ్రువీకరణ పత్రము, వాహినిలో ప్రచురించుటకు అంగీకార పత్రము జతపరచగలరు.

Disclaimer: It may be that this magazine uses some freely available content and material from web purely for informative purposes.

❖❖❖❖❖

భాష్యం: శ్రీ పెయ్యేటి రంగారావు, హైద్రాబాద్



**అథ ద్వితీయోధ్యాయః - సాంఖ్యయోగః**

**(రెండవ అధ్యాయము - సాంఖ్యయోగము)**

**6.**

**న చైతద్విద్మః కతరన్నో గరీయో యద్వా జయేమ యది వా నో జయేయుః |**

**యానేవ హత్వా న జిజీవిషామః తే౽వస్థితాః ప్రముఖే ధార్తరాష్ట్రాః || 6 ||**

**ఏతత్ చ = ఇదియును**

**న, విద్మః = ఎఱుగము**

**నః = మనకు (యుద్ధం చెయ్యడం, చెయ్యకపోవడం అనే)**

**కతరత్ = రెండింటిలో ఏది**

**గరీయః = శ్రేష్ఠము**

**యత్, వా = మఱియు (దీనిని గూడ ఎఱుగము)**

జయేమ = వారిని మనము జయిస్తామా

యది, వా = లేక

నః = మనల్ని

జయేయుః = వారు జయిస్తారా

యాన్ హత్వా = ఎవరిని చంపి (మేము)

న, జిజీవిషామః = జీవించుటకు ఇష్టపడమో

తే ఏవ = వారే

ధార్టరాష్ట్రాః = ధార్తరాష్ట్రులు

ప్రముఖే = (మన) ఎదురుగా

అవస్థితాః = నిలచియున్నారు.

ఈ యుద్ధం చెయ్యడం శ్రేష్ఠమా, చెయ్యకుండా వుండడం శ్రేష్ఠమా అన్నది తెలియదు. యుద్ధంలో మనం వారిని జయిస్తామా, లేక వారు మనలను జయిస్తారా అన్నది కూడా తెలియదు. మనకు ఆత్మీయులైన ధార్తరాష్ట్రులే మనతో యుద్ధం చెయ్యడానికి నిలబడి వున్నారు. వాళ్ళను చంపి జీవించడానికి నేను ఇష్టపడను.

ఇక్కడ అర్జునునికి మనం జయిస్తామా, లేక వారు జయిస్తారా అన్నది తెలియదు కదా అన్న సందేహం అవివేకం వల్లనే కలిగింది. ఎందుకంటే జయాపజయములు దైవాధీనములు అని కదా సూక్తి? జయాపజయాలు దైవం అధీనంలో వుంటాయి అని దాని అర్థం. కాని ఆ దైవమే పాండవుల తరఫున నిలచి యున్నప్పుడు ఇంక అపజయం కలగడానికి ఆస్కారమే లేదు కదా?

7.

కార్పణ్యదోషోపహతస్వభావః పృఛ్ఛామి త్వాం ధర్మసమ్మూఢచేతాః |

యచ్ఛ్రేయః స్యాన్నిశ్చితం బ్రూహి తన్మే శిష్యస్తేఽహం శాధి మాం త్వాం ప్రపన్నమ్ ||7||

కార్పణ్యదోషోపహతస్వభావః = పిరికితనమనెడి దోషమునకు లోనైన స్వభావము కలిగిన వాడనై

ధర్మసమ్మూఢచేతాః = ధర్మవిషయమున మూఢచిత్తుడనై

త్వామ్ = నిన్ను

పృఛ్ఛామి = అడుగుచున్నాను.

యత్ = ఏ (ఏ సాధన)

నిశ్చితమ్ = నిశ్చయముగా

శ్రేయః, స్యాత్ = మేలు అగునో

తత్ = దానిని

మే = నాకు

బ్రూహి = తెలుపుము.

అహమ్ = (ఎందుకనగా) నేను

తే = నీకు

శిష్యః = శిష్యుడను

త్వామ్ = నిన్ను

ప్రపన్నమ్ = శరణు పొందిన వాడను

మామ్ = (కనుక) నన్ను (నాకు)

శాధి = ఉపదేశింపుము.

పిరికితనానికి లోనయి నేను నా స్వభావాన్ని కోల్పోయాను. ధర్మాధర్మముల విచక్షణకు దూరమై నా కర్తవ్యాన్ని నిర్ణయించుకోలేక పోతున్నాను. హే కృష్ణా! నాకు నిజంగా ఏది మంచిదో దానిని తెలియజేయవలసినది. ఎందుకంటే నేను నీకు శిష్యుడిని, నీ శరణు కోరిన వాడిని. కనుక నాకు ఉపదేశించ వలసినది.

కృపణుడు అంటే లోభి, కుత్సితుడు. ఇక్కడ ఆత్మజ్ఞానము లేనివాడు అని అర్థం తీసుకోవాలి. నేను యుద్ధం చెయ్యను అని తన నిశ్చయాన్ని తెలిపినప్పటికీ అర్జునునికి తనకు కలిగిన సంశయం తీరలేదు. తను తీసుకున్న నిర్ణయం సరైనది కాదేమోనన్న శంక పీడిస్తోంది. బంధుప్రీతికి లోబడి ధర్మాధర్మ విచక్షణను కోల్పోయానేమో అని భయపడ్డాడు. ఇంక అటువంటి సమయంలో ఏమి చెయ్యాలి? గురువుని ఆశ్రయిస్తే దిశానిర్దేశం లభిస్తుంది. అందుకే అర్జునుడు తన గురువైన శ్రీకృష్ణపరమాత్మను శరణు కోరి తనకు కర్తవ్యాన్ని బోధించవలసిందిగా ప్రాధేయపడ్డాడు. అర్జునుడు తనకు తానుగా నిర్ణయాలు తీసుకుంటున్నంత వరకు శ్రీకృష్ణుడు మౌనంగా వుండిపోయాడు. ఎప్పుడైతే అర్జునుడు తన నిర్ణయం సరికాదని తెలుసుకుని శ్రీకృష్ణుని శరణు జొచ్చాడో, అప్పుడే ఆయన అర్జునునికి బ్రహ్మజ్ఞానాన్ని ఉపదేశించడానికి పూనుకొన్నాడు.

8.

న హి ప్రపశ్యామి మమాపనుద్యాత్ యచ్ఛోకముచ్ఛోషణమింద్రియాణామ్ |
అవాప్య భూమావసపత్నమృద్ధం రాజ్యం సురాణామపి చాధిపత్యమ్ ॥ 8 ॥

హి = ఏలనన
భూమా = భూమి యందు
అసపత్నమ్ = నిష్కంటకమైన
ఋద్ధమ్ = ధనధాన్య సంపన్నమైన
రాజ్యమ్ చ = రాజ్యమును
సురాణామ్ = దేవతల యొక్క
ఆధిపత్యమ్ = ఆధిపత్యమును
అవాప్య, అపి = పొందియు
యత్ = ఏదైతే
మమ = నాయొక్క
ఇంద్రియాణామ్ = ఇంద్రియముల యొక్క (ఇంద్రియములను)
ఉచ్ఛోషణమ్ = శుష్కింపజేయునట్టి
శోకమ్ = శోకమును
అపనుద్యాత్ = దూరము చేయగలదో
(తత్) = దానిని (ఆ ఉపాయమును)
న, పశ్యామి = చూడకున్నాను.

ఈ శోకము నా ఇంద్రియాలని దహించి వేస్తోంది. సిరిసంపదలతో కూడిన తిరుగు లేని రాజ్యాధికారం లభించినా, ఆఖరికి ఇంద్రపదవి ప్రాప్తించినా దహించి వేస్తున్న ఈ శోకం చల్లారే ఉపాయం కనపడటల్లేదు.

బాహ్యప్రపంచంలో లభించే ఎన్ని సంపదలు గాని, అధికారాలు గాని, సుఖాలు గాని మానసిక అశాంతిని తొలగించలేవు. ఆత్మజ్ఞానం పొందడానికే జీవుడు తపించాలి. అప్పుడే నిజమైన సంతోషం కలుగుతుంది.

9.

సంజయ ఉవాచ:

ఏవముక్త్వా హృషీకేశం గుడాకేశః పరన్తప |
న యోత్స్య ఇతి గోవిన్ద ముక్త్వా తూష్ణీం బభూవ హ ॥ 9 ॥

సంజయ ఉవాచ = సంజయుడు చెప్పెను.

పరన్తపః = శత్రువులను తపింపజేయునట్టి

గుడాకేశః = అర్జునుడు (అలసత్వమును జయించిన వాడు)

హృషీకేశం = శ్రీకృష్ణునితో (సర్వేంద్రియ ప్రవర్తకుడు)

ఏవమ్ = ఈ ప్రకారముగా

ఉక్త్వా = చెప్పి,

నయోత్స్యే = యుద్ధము చేయను

ఇతి = అని

గోవిందమ్ = (ఆ ) గోవిందునితో (వేదరూపమగు వాణిని తెలిసుకొనువాడు)

ఉక్త్వా = చెప్పి

తూష్ణీంబభూవహా = ఊరకుండెను.

సంజయుడు చెప్పెను - ఈ విధముగా అర్జునుడు శ్రీకృష్ణునితో చెప్పి, 'నేను యుద్ధము చేయను' అని పలికి ఊరకుండెను.

10.

తమువాచ హృషీకేశః ప్రహసన్నివ భారత |

సేనయోరుభయోర్మధ్యే విషీదంతమిదం వచః || 10 ||

భారత = ఓ భరతాన్వయ సంభూతుడవగు ధృతరాష్ట్రా!

హృషీకేశః -= మాయకు ప్రభువగు, మాయాతీతుడగు శ్రీకృష్ణపరమాత్మ

ఉభయోః = రెండయిన

సేనయోః = సేనల యొక్క

మధ్యే = మధ్యయందు

తం = ఆ

విషీదంతం = దుఃఖించుచున్న అర్జునుని గూర్చి

ప్రహసన్నివ = మందహాసము జేయుచు

ఇదం = ఈ చెప్పబోవు వాక్యమును

ఉవాచ = పలికెను.

భరతవంశోద్భవుడగు ఓ ధృతరాష్ట్రా! ఉభయసేనల మధ్యయందు శోకమోహములచే వ్యాకులుడైన యర్జునుని గూర్చి శ్రీకృష్ణపరమాత్మ మందహాసము చేయుచు యిట్లు పలికెను.

ప్రహసన్నివ - అనుచితాచరణప్రకాశనముచే లజ్జను పుట్టించువాడు వలె అని యర్థము. భగవత్కృపాపాత్రుడు అర్జునుడు గావున నిట గౌణమైన ప్రహసనమే గ్రాహ్యమని దెల్పుటకు 'ఇవ' అను శబ్దము ప్రయోగింపబడెను.

'ఓహో! నీవు పండితుడవనుకొంటిని. నీ పాండిత్యమింతటిదా?' అని పరిహసించువాని వలె ముందు చెప్పబోవు వాక్యమును పలికెను. ఈ మందహాసానికి అర్థం అర్జునుని వేళాకోళం చెయ్యడం కాదు. ఎప్పుడైతే శ్రీకృష్ణుడు చిరునవ్వు నవ్వాడో, అప్పుడు అర్జునునికి తన ఆలోచనలు సరైన మార్గంలో వెళ్ళటల్లేదు, కనుకనే పరమాత్మ మందహాసం చేసాడు అని అర్థమయింది.

'ప్రహసన్నివ' - 'మదాజ్ఞా వశవర్తివగు నీ విషయమై నేను ప్రసన్నుడనైతిని.' అని ప్రకటించువాని వలె శ్రీకృష్ణుడు మందహాసము చేసినాడు. 'అర్జునా! పిరికితనానికి లోనై నీవు విచక్షణను కోల్పోయినానన్నావు. నన్ను గురువుగా నమ్మి ఆత్మసమర్పణ చేసికొని నీకు ఉచితానుచితాల గురించి తెలియజేయమన్నావు. నీయెడల నేను పూర్తిగా ప్రసన్నమైనాను. అందుకే ఇప్పుడు నీకు బ్రహ్మజ్ఞానాన్ని ఉపదేశింప బోతున్నాను.' అని తెలియజేయడానికి శ్రీకృష్ణుడు మందహాసం చేసినాడు.

ఓం నమో భగవతే వాసుదేవాయ!

# గీతార్చన

శ్రీమతి పెయ్యేటి శ్రీదేవి,హైద్రాబాద్

'నేరుతునో లేదో ప్రభూ, నీ పాటలు పాడ.........

ఇది చల్లని వేళైనా.....ఇది వెన్నెల రేయైనా......

నిదుర రాదు కనులకు.....శాంతి లేదు మనసుకు......

మదిలో వేదన ఏదో మరలి రాధకూ...ఊ...ఊ...ఊ...



ఓ కృష్ణశాస్త్రి గీతమా!

నా మనసునే దోచుకున్న అందమైన గీతమా!

'బాపు' బొమ్మలాగ వుండే శృంగారగీతమా!

ఎస్. రాజేశ్వర్రావు సంగీతముంటేనే దానికందమా!

తేనెలూరు తెలుగు కవితకు జీవమిచ్చిన ఓ కవీంద్రమా!

నీదు పాటలే సాటి లేని విరహగీతికలు!

మగువల మనసులను రంజింప జేసిన కృష్ణశాస్త్రీయమా!

ప్రియుడి రాకకై ఎదురు చూసే చిన్నదాని మనసునెరిగి

అందమైన విరహగీతులల్లిన కృష్ణశాస్త్రిచంద్రమా!

'కోటిమందిలో వున్నా నిన్నే సూటిగ కన్నులు చూస్తాయి

కోరినవాని చేరగ రమ్మని గుండెలు తొందర చేస్తాయి

అంటూ అందముగా ఆ ప్రేయసీ ప్రియుల మీద

ప్రణయగీతులల్లిన ఓ కవిరాజమా!

నీకు సాటి ఎవరులేరయ్యా, ఓ కృష్ణమహరాజా!



'ముందు తెలిసెనా ప్రభూ, ఈ మందిరమిటులుండేనా?


మందమతిని, నీవు వచ్చు మధురక్షణమేదో..కాస్త..

అంటూ ఇలా ఎదురు చూస్తూనే పాడుకుంటున్నా.....

కానీ.....ఇంకనూ రాలేదయ్యా నా ప్రభువు!

నా మనసులోని వేదనని

ఇంత సూటిగా ఎలా తెలుసుకున్నావయ్యా, కవిరాజా!




ఆ...... వచ్చినట్టుండాడు నా రాజు!

ఈ గాలి సవ్వడిలో నా రాజు పిలుపు వినబడకుండె

'సడి సేయకో గాలి, సడి సేయబోకే

బడలి ఒడిలో రాజు పవ్వళించేనే.....

అని ఎంత చెప్పినా వినక

సడి సేయుచూనే వుందయ్యా...... ఈ అల్లరి గాలి!

మరల ఓసారి చెప్పవూ

'ఓ గాలీ, సడి సేయబోకే' అని.....?

'పగలైతే దొరవేరా, రాతిరి నా రాజువురా

అంటూ ఇలా ఎన్నో గులాబుల వంటి

విరహగీతికలల్లి, ఎవరికీ అర్థం కాని

అగాథం వంటి మగువల మనసుల్ని

ఎలా తెలుసుకోగలిగావయ్యా ఓ మహాకవీ!



కాని..................కాని..........

కవికుంజరమా!

'కరుణశ్రీ' 'పుష్పవిలాపం' లా

మగవారు కఠిన పాషాణ హృదయులై,

ధనదాహం తీరక, ఇంకా ఇంకా కట్నకానుకలు

తెమ్మని వేధిస్తూ, మగువల మనసులను

సూదుల వంటి మాటలతో గుండెల్లో గుచ్చి

లావు దారాలతో గొంతుకురి బిగిస్తున్నారయ్యా!

ఇది చాలా చాలా తప్పని 'శ్రీశ్రీ' తో

'విప్లవశంఖం' పూరించమని చెప్పు.

'మానూ మాకును కాను, రాయీ రప్పను కానే కాను.....'అని రాసారే,

అదే, మన(సు) కవి లేరూ........?

ఆ ఆత్రేయ గారితో కూడా చెప్పు

అందరి మనసులూ సరి చేయమని.

'జయ జయ జయ ప్రియభారత

జనయిత్రీ, దివ్యధాత్రీ.....అని

నువ్వు రాసిన దేశభక్తి గేయం అంటే

ఏమిటో కూడా తెలుసుకోలేని

స్థితిలో ఉన్నారయా నేటి జనం!

దేశభక్తి కన్నా 'ఛానళ్ళ'లో వచ్చే

స్టార్ల మీద భక్తి ఎక్కువై పోయింది నేటి కలియుగంలో!

నువ్వున్న కవుల యుగం 'స్వర్ణయుగం'!

ఏదీ....ఏదీ....ఎక్కడ....ఎక్కడ....?

ఓ కవికులతిలకమా!

ఆ స్వర్ణయుగపు మధురానుభూతులతో

నీకివే నా భక్తిపూర్వక

నమస్సుమాంజలులు!



తెలుగుతల్లి కెనడా వారి కవితలపోటీలలో బహుమతి పొందిన కవిత.

❖❖❖❖❖

# క 'రోనా'

శ్రీమతి పామీరు జానకీ దేవి, హైద్రాబాద్

ఈ రోజు మనసంతా అదోలా ఉంది రమణికి... ఈ కరోనా ఎప్పుడు అంతమవుతుందో తెలియటం లేదు... ఎవ్వరినీ కలుసుకోకూడదు... ఆఖరికి ప్రక్క ఫ్లాట్ లో వాళ్ళు కూడా బయటికి రావటం లేదు... తను ఎన్ని సార్లు బాల్కనీలోకి వెళ్ళినా ఎవరూ కనిపించటం లేదు... ఎంతసేపు వంట ఇల్లు లేకపోతే టి వి... పిల్లల ఆన్ లైన్ క్లాసుల కారణంగా టి వి కి కేబుల్ కనెక్షన్ కూడా లేదు... ఇంటర్ నెట్ ద్వారా అప్పుడప్పుడు, ఏదో యూ ట్యూబ్ లో కార్యక్రమాలు చూడటం లేదా నెట్ ఫ్లిక్స్ లో సినిమాలు చూడటం... అంతే... తనకు ఎంతో క్లోజ్ గా ఉండే స్నేహితులు కూడా అంతగా మాట్లాడటం లేదు... అందరు తనలాగే ఉన్నారా?.. ఏమో?.. ఇద్దరు పిల్లలకు ఆన్ లైన్ క్లాసులు... చెరొక లాప్ టాప్ తో బిజీ... పెద్దమ్మాయి ఇంటర్ కదాని ఆమెకు లాప్ టాప్ కొన్నారు... కానీ చిన్నది 6వ తరగతి, ఇప్పుడే దానికి లాప్ టాప్ ఎందుకు అని కొనలేదు... ఇప్పుడు అవసరార్థం తన లాప్ టాప్ ఇచ్చింది... తనకు ప్రస్తుతం ఆ ఆనందం కూడా లేదు... పిల్లలు అలా వారి ఆన్ లైన్ క్లాసులతో బిజీగా ఉన్నారు...

ఇక శ్రీవారు ఎలా ఉన్నారా అని ఆయన గదిలోకి వెళ్ళింది... శ్రీధర్ తన ఆఫీసు జూమ్ మీటింగ్ లో నిమగ్నమై వున్నారు... ఒక ప్రముఖ కంపెనిలో మంచి పొజిషన్ లో ఉన్న శ్రీధర్ చాలా అంకిత భావంతో పని చేస్తాడు... అందరూ తనలాగే పని చేయాలనుకుంటాడు... కానీ తన క్రింద పని చేసేవాళ్ళు అలా ఉండరు... రోజు ఏదో ఒక సమస్య... దానిని సరి చేయటం... చాలా టీడియస్ గా ఉంటుంది ఆయన ఉద్యోగం...

అతనిని అలా చూస్తే ఏమీ చెప్పుకోవాలనిపించదు... మరి తన బాధలు ఎవరికి చెప్పుకోవాలి?.. ఒక రోబో లాగా అయిపోతోంది తను... తనేమిటో కూడా మరచిపోతోంది ఒక్కోసారి... చక్కగా ఇంజనీరింగ్ చదివి ఏమీ చేయకుండా ఇలా ఉండటం తనకు నచ్చటం లేదు... కానీ సగటు ఇల్లాలిగా తన భాధ్యతల నుంచి తప్పించుకోలేకపోతోంది...

ఆమె మనసు ఒక్కసారిగా గతంలోకి వెళ్ళిపోయింది... తనను అమ్మ, నాన్న, అమ్మమ్మలు ఎంత గారాబంగానో పెంచారు... దేనికీ లోటు రానివ్వలేదు... తను ఏది కావాలంటే అది... ఆఖరికి చదువు కూడా... క్రొత్తగా ఇంజనీరింగ్ కాలేజీలో అడుగు పెట్టిన రోజు ఏమనుకుంది, తన లక్ష్యాన్ని గుర్తుకు తెచ్చుకుంది... తను ఇంజనీరింగ్ చదువు పూర్తి చేసి మోక్షగుండం విశ్వేశ్వరయ్యగారి లాగా దేశానికి ఏదైనా చేయాలని అనుకుంది... తనను కష్టపడి పెంచిన తల్లిదండ్రులను చూసుకోవాలని అనుకునేది... క్యాంపస్ లో ఉద్యోగం, పెళ్ళి, రెండు ఒకేసారి జరిగాయి... శ్రీధర్ తనకు చాలా బాగా నచ్చాడు... అతని మాటతీరు తనను ఆకట్టుకున్నాయి... ఆ సమయంలో తనను ఎంత బాగా అనునయించాడో శ్రీధర్... పెళ్ళి కారణంగా వచ్చిన ఉద్యోగాన్ని వదులుకుంది...

పాపం ప్రస్తుత పరిస్థితులలో శ్రీధర్ అశక్తుడైపోయాడు... మాట్లాడటానికి కూడా సమయం కేటాయించలేక పోతున్నాడు... ఈ మధ్యనే ఇంకొక విషయం చెప్పాడు... ఈ వర్క్ ఫ్రమ్ హోమ్ ఇలాగే కొనసాగిస్తారట... ఈ లాక్ డౌన్ సమయంలో వాళ్ళ కంపెనిలో ప్రొడక్షన్ వైజ్, పర్ఫార్మెన్స్ వైజ్, చాలా బాగా ఉందని ఈ నిర్ణయం తీసుకున్నారట... అన్ని కంపెనీలు అదే పద్ధతులు అవలంబిస్తున్నారట... ఇకపై ఆఫీసులకు వెళ్ళటాలు ఉండవేమో... వాళ్ళకు కూడా అద్దె, కరెంట్ బిల్లులు అదా... కొన్ని రకాల పెర్క్స్ కూడా నెమ్మది నెమ్మదిగా తీసివేస్తారేమో... ఇకపై ప్రతి ఇల్లు ఒక సాఫ్ట్ వేర్ కంపెని అవుతుందా?..

పాపం ఇంట్లో వాళ్ళు ముగ్గురు వారం రోజులలో కంప్యూటర్ల ముందు కూర్చుని, శని, ఆదివారాలు రాగానే మంచాలకు అంటుకుపోతున్నారు...

అలా కొనసాగుతున్న పరిస్థితులలో శ్రీధర్, ఈ మధ్య తన ఆఫీసు చికాకంతా, రమణి మీద చూపిస్తున్నాడు... చీటికి మాటికి ఏదోకటి అంటూనే వున్నాడు...

ఇది తట్టుకోలేక భర్తతో శాంతంగా చెప్పింది రమణి... "నీ మూడ్ మంచిగా ఉంటేనే మాట్లాడు... లేకపోతే వద్దు... అసలే నేను కూడా ఇంటి పనితో విసిగిపోయి ఒక రకమైన పిచ్చిలో ఉన్నాను... పిల్లల ముందు మనకు గొడవలొద్దు"... దాదాపుగా ఏడుస్తున్నట్లుగానే చెప్పింది...

అర్థం చేసుకున్న శ్రీధర్ ఏమీ చేయలేక, మౌనంగా వుండిపోయాడు... ఒక చిన్న పలకరింపుగా కూడా భార్యని అనునయించలేని తన నిస్సహాయతకు మౌనంగా రోదిస్తూ తన రూమ్ లోకి వెళ్ళిపోయాడు...

కరోనా మనకు మిగిల్చింది 'రోనా' యేనా అని మనసులో అనుకున్నారిద్దరు ఎవరికివారే...

❖❖❖❖❖



# కార్తీక మాసం విశిష్టత

శ్రీమతి. లలిత రాంభట్ల, హైదరబాద్



మన భారతీయ సంస్కృతిలో ఈ కార్తీక మాసం వచ్చింది అంటే! ఆ నెల రోజులు మనకందరకు పండుగ దినములె! అందులోనూ ఈ కార్తీక మాసం ఈశ్వర ఆరాధనకు చాలా ముఖ్యమైనది. దేశం నలుమూలలా ఉన్న వివిధ ఆలయాలలో రుద్రాభిషేకాలు, రుద్ర పూజలు జరుపుతారు.

స్కాంద పురాణమున ఈ 'కార్తీకమాస' ప్రాముఖ్యతను చెప్పబడింది. ఈ మాసంలో సోమవారాలు, చవితి, షష్టి, ఏకాదశి, ద్వాదశి, పౌర్ణమి అత్యంత పుణ్యప్రదమైనవి. పవిత్ర పుణ్య నది స్నానమాచరించి ఉపవాస దీక్షలు చేస్తూ మహాన్యాస పూర్వక మహా రుద్రాభిషేకములు, లక్ష బిల్వార్చనలు, లక్ష కుంకుమార్చనలు, లలిత, విష్ణు సహస్రనామ పారాయణలు ప్రతి నిత్యము ఉభయ సంధ్యలలో దీపారాధన చేసేవారికి విశేష పుణ్యఫలం లభిస్తుందని అలా ఈ కార్తీక మాస 30 రోజులు ఆచరించిన వారికి అనంత కోటి పుణ్యఫలం లభిస్తుందని చెప్పబడింది.

కొందరు నిష్ఠాపరులు ఈ కార్తీకమాసమంత పుణ్యనదీ స్నానమాచరిస్తూ ప్రతిరోజు హరిహరాదులను పూజిస్తూ పగలు అపక్వాహారం అంటే వండని ఆహారం పాలు, పండ్లు స్వీకరించి సాయంత్రం భక్తితో కార్తీక దీపారాధనలు పూజలు చేసి నివేదించిన అన్నాన్ని రాత్రి భుజిస్తూ ఉంటారు ఇలా ఈ **'కార్తీక నక్తవ్రతాన్ని'** ఆచరిస్తారు

ఈ కార్తీకమాసము అత్యంత విశేషమైనది **"ఉత్థానైకాదశి"** అంటే శ్రీ మహావిష్ణువు పాలకడలిలో ఆది శేషుని పాన్పుపైన ఆషాఢ శుద్ధ ఏకాదశినాడు యోగనిద్రను ప్రారంభించి తిరిగి కార్తీక శుద్ధ ఏకాదశి నాడు కనులు విప్పి యోగ నిద్ర నుంచి మేల్కొన్న రోజునే **"ఉత్థాన ఏకాదశి"** అని పేరు. ఆ మరుసటి రోజు ద్వాదశినాడు ముప్పది ముగ్గురు దేవతలలో శ్రీమహాలక్ష్మి సమేతుడై తులసీధాత్రి వనమందు ఉంటాడని చెప్తారు.

ఈ ద్వాదశిని **“క్షీరాబ్ధి ద్వాదశి”** అంటారు అంటే పూర్వం కృతయుగంలో దేవదానవులు పాలసముద్ర మధనము చేసిన రోజు కనుక **“చిల్కు ద్వాదశి”** అని కూడా పేరు. కాబట్టి స్త్రీలు ఈ రోజు వారి సౌభాగ్య సంపదల కోసం తులసి ధాత్రి వనమందు (తులసి కోట) విశేష దీపారాధనలు చేసి షోడశోపచారములతో తులసిధాత్రి శ్రీలక్ష్మీనారాయణులను పూజిస్తారు. ఆ రోజు దేశం నలుమూలలా గల ఆలయాలలోని **“శ్రీలక్ష్మీనారాయణ మూర్తులను”** మిరుమిట్లుగొలిపే విద్యుత్ దీపకాంతితో బాణాసంచాలతో సమీప నదీ జలాలలో **“తెప్పోత్సవం”** నిర్వహిస్తూ ఉంటారు. ఇక కార్తీక పౌర్ణమి నాడు వరి గడ్డిని వెంటిగా చుట్టి దానిని రెండు స్తంభములకు కట్టి ఆ వెంటిని మూడువర్ల కాగడాలతో వెలిగిస్తూ వాటి క్రింది పార్వతిపరమేశ్వరుల ప్రతిమలను పల్లకిలో ఉంచి మూడు సార్లు త్రిప్పి **“జ్వాలాతోరణ”** వేడుకను నిర్వహిస్తారు. అలా హరిహరాదులకు ప్రత్యేక ఉత్సవ వేడుకలు నిర్వహిస్తూ ఉంటారు.

ఈ మాసంలో **“నాగుల చవితి”** రోజున పుట్టలో పాలు పోయటం కార్తీక పౌర్ణమికి కార్తీక చలివిళ్లనోము నోస్తూవుంటారు.

ఇక మన భారతీయ సంస్కృతిలో ఈ దీపారాధన అనేది ప్రధానాంశం. దీపారాధన పూజామందిరంలోను, దేవాలయములలో, గృహ ప్రాంగణములలో తులసి కోట నందు మారేడు, రావి, ఉసిరికాయ వృక్షాల వద్ద, పుణ్య నదీ తీరముల నందు వెలిగిస్తే అత్యంత పుణ్యప్రదమని పురాణాలు వర్ణించి చెబుతున్నాయి. ఈ మాసమందు సోదరి చేతి వంట **“భగినీ హస్త భోజనం”** చేసి యధాశక్తి వారికి కానుకలు సమర్పించటం. ఈ మాసంలో దీపాన్ని దానంగా ఇస్తారు, దీని వల్ల వారికి ఎనలేని కీర్తి సౌభాగ్యాలు కలుగుతాయని భావిస్తారు. ఈ మాసాంతం వరకు ప్రతి ఇంట ముంగిట దీపం వెలుగుతూ ఉంటుంది.

స్త్రీలు నదులలో కోనేటిలో దీపాలు వదులుతారు, ఈ మాసవారాలలో సోమవారానికి ప్రత్యేకత ఉంది. సోమవారానికి చంద్రుడు అధిపతి, దేవతలలో ప్రథముడైన అగ్ని నక్షత్రాలలో మొదటిదైన కృత్తికకు అధిపతిగా ఉండట, చంద్రుడు పూర్ణుడై ఈ నక్షత్రం మీద ఉండటం చేత మాసంలోని సోమవారాలకు విశిష్టత కలిగినది. చంద్రుని వారమైన ఈ సోమవారం శివునికి ఎంతో ప్రీతికరమైనది భానోదయం ముందు లేచి స్నానాది కార్యాక్రమాలు ముగించుకుని, మొదటగా దీపారాధన చేయాలి, తరువాత శివుడికి రుద్రాభిషేకం చేయించి శివవ్రత నియమాలను పాటించవలెను. ఈ కార్తీక సోమవారాలలో వనభోజనం చేయుటవల్ల శుభప్రదమని ప్రతీతి. ఈ సోమవారాలలో శివుడిని అర్చించి అనంతరం అన్నదానము నిర్వహించి అతిథి సత్కారాల తరువాత దీక్ష వహించిన వ్యక్తి భుజించవలెను. ఈ నియమాలను పాటించడం వల్ల శివానుగ్రహం కలిగి సర్వపాపములు నశించును అని పురాణ వచనం.

కార్తీక శుద్ధ షష్ఠి **“సుబ్రహ్మణ్య షష్ఠి”** నాడు, సుబ్రహ్మణ్య పూజ నిష్ఠతో చేస్తారు, మన దక్షిణ దేశంలో పళనిక్షేత్రమున సుబ్రహ్మణ్య పూజలు అధికంగా జరుగుతాయి.

❖❖❖❖❖



**తెలుగు వాహిని పాఠకులందరికీ దీపావళి శుభాకాంక్షలు**

# దేవులపల్లివారితో నా అనుబంధం

గుర్తుకొస్తున్నాయి

- **కళాబ్రహ్మ, సేవామహాత్మ, శిరోమణి డా॥ వంశీ రామరాజు**, హైదరాబాదు



దేవులపల్లి కృష్ణశాస్త్రి గారు మరియు ఈమని శంకరశాస్త్రి గారు

పద్మభూషణ్ మరియు సాహిత్య అకాడమి పురస్కారగ్రహీత, కళాప్రపూర్ణ దేవులపల్లి కృష్ణశాస్త్రిగారితో నా పరిచయం గురించి మీకు తెలియజేసేముందు వారి గురించిన కొన్ని విశేషాలు ప్రస్తావిస్తాను. వారు తూర్పు గోదావరి జిల్లా పిఠాపురం దగ్గరలోని రావువారిపాలెం అనే గ్రామంలో ఒక పండిత కుటుంబంలో 1897, నవంబరు 1న జన్మించారు. భావకవిగా, ఆంధ్రాషెల్లీగా ప్రసిద్ధులైన దేవులపల్లి వేంకటకృష్ణశాస్త్రిగారు బి.ఎన్. రెడ్డిగారి ప్రోత్సాహంతో 1951లో 'మల్లీశ్వరి'తో చిత్రరంగంలో అడుగుపెట్టారు. సినిమాపాటకు కావ్యగౌరవం కలిగించారు. సుమారుగా 170 సినీగీతాలు రచించారు. 1929లో విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్‌గారితో వారికి పరిచయం ఏర్పడిరది. సాహితీసంబంధాలు ఏర్పడ్డాయి. 1957లో ఆకాశవాణిలో చేరి తెలుగు సాహిత్య ప్రయోక్తగా అనేక గేయాలు, నాటికలు, ప్రసంగాలు అందించారు. కొందరు కవుల్లాగా ఈయన తన చుట్టూ గిరిగీసుకుని కూర్చోలేదు. బ్రహ్మసమాజం వీరిని అమితంగా ఆకర్షించింది. రఘుపతి వెంకటరత్నం నాయుడుగారు వీరికి రాజకీయ గురువు. ఆంధ్రప్రదేశ్‌లోని ఊరూ వాడా తిరిగి తన కోకిలగానాన్ని వినిపించిన ఈ కవితాదురంధరుడు చరమాంకంలో మూగపోయాడు. అయితే ఆయన కవిత్వం మాత్రం తుదివరకూ మూతపడలేదు. గొంతు క్యాన్సర్‌వల్ల 1964లో ఆయన స్వరపేటిక తొలగించారు. అయితేనేం 'మూగవోయిన నా గళమున నిదురవోయిన సెలయేటి రొదలు కలక' అంటారొకచోట. చంద్రుడికి నూలుపోగులా ఆంధ్రవిశ్వవిద్యాలయం ఆయన్ను కళాప్రపూర్ణ బిరుదుతో సత్కరించింది. 1975లో కృష్ణశాస్త్రిగారికి కవితా స్వర్ణోత్సవం జరిగింది. 1976లో కేంద్రప్రభుత్వం పద్మభూషణ్ బిరుదు ప్రదానం చేసింది. 1978లో సాహిత్య అకాడమి అవార్డు వరించింది.

ఆయన 'కృష్ణపక్షం' పెద్ద గాలిదుమారాన్ని తట్టుకుని నిలబడింది. 'అందాల మేఘమాలా' అనే 'మల్లీశ్వరి'లోని పాట, 'జయజయజయ ప్రియభారత జనయిత్రీ' అనే దేశభక్తి గీతం ఇంటింటా మోగుతూనే ఉంటాయి. 1964లో తాత్కాలికంగా మూగవోయిన ఆయన గొంతు 24.2.1980లో శాశ్వతంగా మూగవోయింది. 'ఈ తరం కవులు అందరూ ఒక ఎత్తు, కృష్ణశాస్త్రిగారొక ఎత్తు. వారిలో కృష్ణశాస్త్రిగారే కొంచెం ఎత్తు' అన్న కొలమానం వీరి ఔన్నత్యానికి నార్ల సాక్షిసంతకం. 'తెలుగుదేశపు నిలువుటద్దం బద్దలైంది. షెల్లీ మళ్ళీ మరణించాడు. వసంతం వాడిపోయింది' అన్న శ్రీశ్రీ స్మృత్యంజలి తెలుగు సాహిత్య చరిత్రలో కృష్ణశాస్త్రిగారి నిలువెత్తు సంతకం. 'మనకు ఒకటే తాజ్‌మహల్ ఉంది. మనకు ఒక్కడే కృష్ణశాస్త్రి ఉన్నాడు.'

కృష్ణశాస్త్రిగారిమీద 11మంది పరిశోధనలు చేశారు. డా॥ ఎస్. నిర్మలాదేవి, బి.కె. హనుమంతరావు, ఎస్. సీతారామయ్య, కె. శ్రీదేవి, డి.కామేశ్వర్రావు, శుభశ్రీ, పి. కౌసల్యాదేవి, వి.వి.ఎం. హైమవతి, సి. రమాదేవి, ఎం. వీరయ్య, ఆదిమూర్తి వివిధ విశ్వవిద్యాలయాలనుంచి పరిశోధన చేశారు.

**దేవులపల్లివారితో నా అనుబంధం**



మొట్టమొదటిసారిగా వారిని మా పెళ్ళైన కొత్త రోజుల్లో అంటే 1975లో నేను, నా సతీమణి తెన్నేటి సుధ మద్రాసులో వారింటికి వెళ్ళాము. ఆ విధంగా పరిచయమైన వారితో నా సాంగత్యం 1978 వరకు కొనసాగుతూనే ఉంది. అంటే 4 సంవత్సరాలు వారి ఆత్మీయతను పంచుకోగలిగిన అదృష్టం నాకు కలిగింది. వారిని కలిసినప్పుడు 1975లో వారికి జరిగిన స్వర్ణోత్సవ సత్కార సంచికను నాకు ఇస్తూ మా ఆవిడ పేరు రాసి, తన సంతకం చేసి ఇచ్చారు. నా పేరు రాయలేదు. "అదేమిటండీ" అన్నాను. "నీకిస్తే పుస్తకం ఎవరికైనా ఇస్తావు. అందుకే ఆమె పేరు రాశాను. ఈ పుస్తకం జాగ్రత్తగా దాచి ఉంచు. మీ ఆయనకు ఇవ్వకు" అన్నారు.

అలా పరిచయం ఏర్పడిన నాకు ఎలాగైనా వారిని సత్కరించాలన్న కోరిక చాలా కలిగింది. కానీ ఆయన ఆరోగ్యపరిస్థితి అంతగా సహకరించేలా లేదు. చాలాసార్లు అడిగి చూశాను. తన మాటలు కాగితంమీద రాసేవారు. 1978లో నేను చాలా పట్టుపట్టాను. వంశీ కార్యదర్శి సాయిభాస్కర్‌కి ఆ పని ఒప్పచెప్పాను. అతను తరచుగా మద్రాసు వెళ్తుండేవాడు. చమత్కారభాషణం చేసేవాడు. అతని బావమరది వల్లూరిగారు వంశీ కార్యక్రమాలకు సహకరించేవాడు. ఏదైతే ఏమైంది, ఏమనుకున్నారో గానీ కృష్ణశాస్త్రిగారు హైదరాబాదు రావడానికి అంగీకరించారు.

వారితోపాటు ఒక వైద్యుణ్ని కూడా వెంట తీసుకుని వచ్చారు. వారితో వారి శ్రీమతి రాజహంసగారు కూడా హైదరాబాదు వచ్చారు. నేను వారితో కనకాభిషేకంగానీ, స్వర్ణకంకణం గానీ ప్రదానం చేసి ఘనంగా సత్కారం చేయాలనుకుంటున్నాను. 1972లో స్థాపించిన వంశీసంస్థకు ఇది చారిత్రాత్మకం.

"మీరు ఇక్కడికి రావడం, సత్కారం అంగీకరించడం మా అదృష్టం" అన్నాను.

వారు పేపరుమీద ఇట్లా రాశారు. "నాకు స్వర్ణకంకణాలు, కనకాభిషేకాలు వంటి ఆర్భాటాలు వద్దు. కానీ..." అని రాసి నావైపు చూశారు. ఆయన మంచి చమత్కారి. "భయపడ్డావా?" అన్నారు.

"లేదు" అన్నాను.

ఒక నిమిషం ఆలోచించారు. 'రాయప్రోలు సుబ్బారావు, నాయని సుబ్బారావు, నార్ల వెంకటేశ్వరరావు, డా॥ సి. నారాయణరెడ్డి వీళ్ళు నా సన్మాన కార్యక్రమంలో తప్పకుండా ఉండాలి' అని రాశారు.

'ఓస్ ఇంతేనా!' అని మనసులో అనుకున్నాను. నిజానికి 'ఏ దేశమేగినా ఎందు కాలిడినా, ఏ పీఠమెక్కినా ఎవ్వరెదురైనా పొగడరా నీ తల్లి భూమి భారతిని, నిలుపరా నీ జాతి నిండుగౌరవము' అంటూ జాతిని మేల్కొల్పిన రాయప్రోలువారిని నేను ఎప్పుడూ కలవలేదు. చాలా కష్టపడి వెస్ట్ మారేడ్‌పల్లిలో ఉన్న వారింటికి వెళ్ళాను. నన్ను పరిచయం చేసుకోగానే "అవును నీ పేరు విన్నాను. సన్మానాలు చేస్తూ ఉంటావు కదా!" అన్నారు.

ఫరవాలేదు, నాకు గుర్తింపు ఉంది అనుకున్నాను. నేను విషయం చెప్పాను.

"అతనికిప్పుడు సన్మానం ఎందుకు? ఆరోగ్యం బాగాలేనప్పుడు పడి పడి ఇక్కడికి రావడమెందుకు? నేను సన్మానానికి రాను" అన్నారు.

నా గొంతులో పచ్చివెలక్కాయ పడింది. "మీరు వస్తేగానీ ఆయన సన్మానానికి అంగీకరించనన్నారు. వారికి సత్కారం చేయకపోతే వారి అభిమానులుగా మేము ఎంతో కోల్పోతాము. అదీగాక వారికి మిమ్మల్ని కలుసుకోవాలనీ, చూడాలనీ ఉన్నట్లుంది" అన్నాను.

"అట్లా అనుకుంటే మా ఇంటికి రావచ్చు కదా!" అన్నారు.

ఈ విధంగా జరిగిన సంభాషణ తరవాత వారింటికి తరచు వెళ్ళి ఆయన్ను ఒప్పించే ప్రయత్నం చేశాను.

"నువ్వు మొండిఘటంలా ఉన్నావే" అని అంటూ రావడానికి ఒప్పుకున్నారు. అలాగే డా॥ సి. నారాయణరెడ్డిగారిని, నార్ల వెంకటేశ్వరరావుగారినీ కలిశాను. వారిద్దరూ నాకు ఆప్తులు, వారు ఇద్దరూ సత్కార కార్యక్రమానికి రావడానికి అంగీకరించారు. నాయని సుబ్బారావుగారింటికి వెళ్ళి ఆయన్ను కలిశాను. వారెంతో సంతోషించారు కానీ ఆయన అనారోగ్యంగా ఉన్నారు. రాలేనని అశక్తత వ్యక్తం చేశారు. నాకు కృష్ణశాస్త్రిగారు పెద్దపరీక్షే పెట్టారు.

"మొత్తానికి నువ్వే గెలిచావు" అన్నారు కృష్ణశాస్త్రిగారు.

19.2.1978 ఒక అద్భుతమైన సాహితీ మహోత్సవం... రవీంద్రభారతి కిక్కిరిసిపోయింది. ముఖ్యంగా దేవులపల్లివారిని, రాయప్రోలువారిని చూడడానికి అభిమానులు విపరీతంగా విచ్చేశారు. వంశీ సంస్థ స్థాపించిన తరవాత మొట్టమొదటి విశిష్ట సాహితీసత్కారం శ్రీ దేవులపల్లివారిది. ఆ వేదికమీద దేవులపల్లివారు రాసిన ప్రసంగం హేమలతగారు చదువుతుంటే అందరి కళ్ళు చెమర్చినై. "మరల నేను హైదరాబాదు వస్తానో రానో. మిమ్మల్నందరినీ చూడాలన్పించింది. అనారోగ్యంగా ఉన్నా డాక్టరును తోడిచ్చి ఎంతో ప్రేమగా నాకు ఏ ఇబ్బంది లేకుండా నన్ను ఆహ్వానించడమే కాకుండా జాగ్రత్తగా చూసుకున్నారు" అంటూ ఆనందించడమే నాకిప్పటికీ కళ్ళకు కట్టినట్లుంటుంది. ఆయన ప్రసంగ పాఠం వంశీ సంస్థ ఒక పుస్తకంగా ప్రచురించింది. ఆ విషయాలు మీతో మరోసారి పంచుకుంటాను.



**జ్ఞాపకచిహ్నాలు**

వరంగల్‌లో డా॥ దాసరి నారాయణరావు, జయచిత్ర, మరియు ఇప్పటి వరంగల్ మేయర్ గుండా ప్రకాశరావు, స్వర్గీయ వెంకట్రావు పాల్గొన్న ఒక వంశీ కార్యక్రమంలో దేవులపల్లి కృష్ణశాస్త్రిగారి పేర కాకతీయ విశ్వవిద్యాలయంలో ఎం.ఎ. తెలుగులో అత్యధిక మార్కులు వచ్చిన విద్యార్థికి దేవులపల్లి-వంశీ స్వర్ణపతకం నెలకొల్పాము. ప్రతి సంవత్సరం స్నాతకోత్సవంలో దేవులపల్లి-వంశీ స్వర్ణపతకాన్ని బహూకరించడం జరుగుతున్నది. అంతేగాకుండా ఇప్పుడు 123వ జయంతి కార్యక్రమాన్ని 2020లో వంశీ సంస్థ ఉదయం 11 గంటల నుంచి రాత్రి 11 గంటలవరకు నిర్విరామంగా 58 మంది గాయనీ గాయకులు దేవులపల్లివారి 100 గీతాలను భారతదేశం, అమెరికా, యునైటెడ్ కింగ్‌డమ్, సింగపూర్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, హాంగ్‌కాంగ్, స్వీడన్, సౌత్ ఆఫ్రికా దేశాలనుంచి పాల్గొంటున్నారు. ఈ కార్యక్రమాన్ని మొట్టమొదటి ప్రపంచ సంగీత సాహిత్య సమ్మేళనంగా తీర్చిదిద్దుతున్నాము. సద్గురు ఘంటసాల ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ట్రస్ట్ (ఇండియా), వంశీ ఇంటర్నేషనల్ (ఇండియా), శ్రీ సాంస్కృతిక కళాసారథి (సింగపూర్), తానా (అమెరికా), శ్రీ వేగేశ్న ఫౌండేషన్ (ఇండియా), యునైటెడ్ కింగ్‌డమ్ తెలుగు అసోసియేషన్ (లండన్), తెలుగు మల్లి, మెల్‌బోర్న్ ఆస్ట్రేలియా, సి.పి. బ్రౌన్ తెలుగు సమాఖ్య, యునైటెడ్ కింగ్‌డమ్, న్యూజిలాండ్ తెలుగు అసోసియేషన్, తెలుగు వాహిని (తెలుగు అసోసియేషన్ సిడ్నీ), హాంగ్‌కాంగ్ తెలుగు సమాఖ్య, వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా సహకరిస్తున్న ఈ సమ్మేళనాన్ని వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ మరియు తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో నమోదు కావడం ఒక విశేషం.



ప్రతి సంవత్సరం ఇదే విధంగా అంతర్జాలంలో ఈ మహోత్సవాలను నిర్వహించాలని వంశీ సంస్థ నిర్ణయించింది. దేవులపల్లివారి మనుమరాలు రేవతి అడితం పోర్ట్‌లాండ్, అమెరికా జ్యోతి ప్రకాశం చేసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించడం ఒక అపూర్వ సన్నివేశం.

ఏమైనా మహాకవీ! మిమ్మల్ని స్మరించే భాగ్యం ఈ విధంగా కలిగినందుకు ఆనందంగా ఉంది. 1978లో సతీమణి రాజహంసగారితో మా ఇంటికి వచ్చి మా ఆతిథ్యం స్వీకరించిన రోజు మేమెన్నటికీ మరువలేము. మమ్మల్ని ఆశీర్వదించిన ఆ రోజు మా జీవితంలో మరువలేము. మీకిదే మా నివాళి.

ఈ సందర్భంగా ప్రముఖ సినీగేయ రచయిత, కవి, **శ్రీ భువనచంద్రగారికి** 'దేవులపల్లి-వంశీ జాతీయ పురస్కార' ప్రదానోత్సవం కూడా జరగబోవటం ఒక విశేషం.

❖❖❖❖❖




సిడ్నీ తెలుగు అసోసియేషన్ నూతన కార్యనిర్వాహక వర్గం: 2020-2021

# అలారం!

శ్రీ పెయ్యేటి రంగారావు, హైద్రాబాద్




పాపం! స్వరాజ్యలక్ష్మికి రోజూ తిప్పలే! జీవితమంటేనే విరక్తి వచ్చేసేటంతటి దైనందిన తిప్పలు!

రోజూ ఆలోచిస్తూ వుంటుంది.

"జ్ఞాపకశక్తిని పెంపొందించుకోవడం ఎలా?"

ఒకసారి ఇలా ఆలోచిస్తూనే పుస్తకాల దుకాణంలోనికి అడుగు పెట్టింది. అక్కడ పరమాత్ముని దివ్యమంగళస్వరూపంలా ఒక పుస్తకం ఆమె కంటపడింది. వెంటనే ఏమీ ఆలోచించకుండా ఆ పుస్తకాన్ని ప్యాక్ చేయించి కవుంటర్ దగ్గరకు వెళ్ళింది, సొమ్ము చెల్లించడానికి. దుకాణదారుడు ధర చెబుతే ఆమెకు కళ్ళు తిరిగాయి. ఆ పుస్తకం ఖరీదు ఐదువందల అరవై రూపాయలట! రోజూ తాను పడుతున్న బాధ ముందు ఈ సొమ్మొక లెక్కా అని విరక్తిగా నవ్వుకుని, తెగింపుతో, వెంటనే పాలవాడికివ్వాల్సిన సొమ్ములోంచి ఆ ఐదువందల అరవై రూపాయలూ తీసి దుకాణదారుడి చేతిలో పోసేసి ఆ పుస్తకాన్ని స్వంతం చేసేసుకుంది.

అక్కడనుంచి బస్ స్టాండ్ దగ్గరకు వచ్చేసరికి తనెక్కవలసిన సిటీబస్ ఇంకా రాలేదు. అక్కడ వున్న సిమెంటుసోఫాలో కూలబడి, చేతిసంచిలోంచి నీళ్ళసీసా తీసుకుని రెండు చుక్కలు గొంతులో ఒంపుకుని తిరిగి సీసా సంచిలో పెట్టుకుంది. ఇంతలో బస్సు వచ్చింది. హడావిడిగా పరిగెట్టుకుంటూ వెళ్ళి బస్సెక్కేసింది. ఆడువారికి అని కేటాయించిన సీట్లో ఒక మగమహారాజు దర్జాగా కూర్చుని వున్నాడు. అతడిని ఏమీ అనలేక అలాగే నిల్చుని ప్రయాణం చేసి తన గమ్యం రాగానే దిగింది. అక్కడినుంచి అరకిలోమీటరు నడుచుకుంటూ తన ఇంటికి చేరుకుంది. వెళ్ళగానే స్నానాలగదిలోకి వెళ్ళి, ముఖమూ, కాళ్ళూ కడుగుకుని, వంటింట్లోకి వెళ్ళి కాస్త కాఫీ వెచ్చబెట్టుకుని కప్పులో పోసుకుని హాలులోకి వచ్చి టీపాయ్ మీద కప్పు పెట్టి టివి రిమోట్ తో ఆన్ చేసి తనకిష్టమైన 'వంటలు-వడ్డింపులు' కార్యక్రమం చూస్తూ కాఫీ కప్పు చేతిలోకి తీసుకుని ఒక చుక్క చప్పరించింది. 'అబ్బ!' ప్రాణం లేచివచ్చింది.' రెండో చుక్క చప్పరించేలోపు, 'ఇప్పుడో చిన్న బ్రేక్' అంటూ ప్రకటనలు మొదలయ్యాయి!

'హు!  ఈ టి.వి. వాళ్లకి మనం ఎప్పుడు టి.వి.ఆన్ చేసామో వెంటనే తెలుస్తుందేమో!  మనం టి.వి. ఆన్ చెయ్యగానే కార్యక్రమం ఆపేసి ప్రకటనలు మొదలెడతారు!' అని విసుక్కుంది.

టి.వి.లో వస్తున్న ఒక ప్రకటన!  '

మీరు తరచుగా మతిమరపుతో బాధపడుతున్నారా?  బెండకాయల భైరవయ్య గారి "జ్ఞాపకశక్తిని పెంపొందించుకోవడం ఎలా?" అన్న పుస్తకాన్ని వెంటనే కొనండి.  అందులోని చిట్కాలు పాటిస్తే మీకు మతిమరుపు అన్నదే వుండదు!'

స్వరాజ్యలక్ష్మి కంగారుగా కాఫీకప్పు టీపాయ్ మీద వదిలేసి తన చేతిసంచీ తీసి చూసుకుంది.  అందులో తను ఇందాక కొన్న "జ్ఞాపకశక్తిని పెంపొందించడం ఎలా?" అన్న పుస్తకం లేదు!  వంటింట్లోకి వెళ్ళి చూసింది.  లేదు!  స్నానాలగదిలోకి వెళ్ళి చూసింది.  భగవంతుడా!  లేదు!!

ఏమయింది?  ఎక్కడ మర్చిపోయింది?  షాపులో పుస్తకం ప్యాక్ చేసి ఇస్తే చేతిసంచితో పాటు పుస్తకం కూడా పట్టుకుంది.  తరువాత బస్ స్టాండ్ కి వచ్చింది.  అప్పుడు పుస్తకం పక్కన పెట్టి సంచీలోంచి మంచినీళ్ళు తీసుకుని తాగింది.  ఇంతలో బస్సు వచ్చింది.  పరిగెత్తుకుంటూ వెళ్ళి బస్సు ఎక్కింది.  అంటే పుస్తకం బస్ స్టాండ్ లో మర్చిపోయింది!  మళ్ళీ సిటీబస్సెక్కి ఇరవై కిలోమీటర్లు ప్రయాణం చేసి బస్ స్టాండ్ దగ్గరకెళ్ళి చూడడమా?  ఇంటికి రావడానికి గంట పట్టింది.  ఇప్పుడు మళ్ళీ అక్కడకు వెళ్ళాలంటే గంట, గంటన్నర పట్టవచ్చు.  ఐనా సరే అనుకుని అక్కడికి వెళ్తే మాత్రం ఇప్పుడా పుస్తకం అక్కడెందుకుంటుంది?  ఖర్మ, ఖర్మ!  తనకి జ్ఞాపకశక్తి పెంపొందించుకునే యోగం లేదన్నమాట!  అందుకే ఆ పుస్తకం కొన్న అరగంటలోనే పోగొట్టుకుంది!

అసలింతకీ స్వరాజ్యలక్ష్మికి జ్ఞాపకశక్తిని పెంపొందించుకోవలసిన అగత్యం ఎందుకు కలిగింది?

ఆవిడ గారి ఒక్కరోజు దినచర్య పరికిద్దాం.

ఆరోజు..............

స్వరాజ్యలక్ష్మి లేవగానే దంతధావనం చేసుకోవడానికి స్నానాలగదిలోకి వెళ్ళింది.  దంతధావనం పూర్తి అయి మొహం మీద నీళ్ళు చల్లుకుంటూంటే కుళాయి ఆగిపోయింది.  హడావిడిగా పెరట్లోకి వెళ్ళి మోటరు ఆన్ చేసింది.  తరువాత కాస్త కాఫీ కలుపుకుని తాగుతూ టి.వి.లో భక్తి ఛానెల్ చూడసాగింది.  ఇంతలో పాల పేకెట్టు వచ్చింది.  అది తీసికెళ్ళి గిన్నెలో పాలువంపి, స్టౌ వెలిగించి గిన్నె స్టౌ మీద పెట్టింది.  ఇంతలో పేపరు వచ్చింది.  హాలులోకి వచ్చి పేపరు తిరగెయ్యసాగింది.

'హు!  చదవడానికి కొత్తవార్తలు ఏముంటాయి?  అన్నీ అత్యాచారాలు, గొలుసులు తెంపుకుపోవడాలు, హత్యలు, రాజకీయనాయకులు ఒకరి మీద మరొకరు దుమ్మెత్తిపోసుకోవడాలు........'

చిరాగ్గా పేపరు టీపాయ్ మీద పడేసి స్నానానికి వెళ్ళింది. తీరా చూస్తే ఇందాక తెరిచిన కుళాయి తను కట్టలేదు. నీళ్ళు రాకపోయేసరికి కుళాయి అలాగే వదిలి హడావిడిగా వెళ్ళి మోటారు ఆన్ చేసింది. కుళాయిలోంచి ధారాళంగా నీళ్ళు పారిపోతున్నాయి. నెత్తిమీద ఒక మొట్టికాయ వేసుకుని కుళాయి కట్టేసి, స్నానం ముగించి బైటికి వచ్చేసరికి, హాలంతా ఒకటే పొగ! అప్పుడు గుర్తుకు వచ్చింది. పొయ్యిమీద పాలు పెట్టి మరిచిపోయానని. హడావిడిగా వెళ్ళి స్టౌ కట్టేసి, గిన్నె సింక్‌లో పడేసి, ఎగ్జాస్ట్ ఫేన్ ఆన్ చేసింది. బయట వానపడుతున్న చప్పుడు అవుతూంటే ఇదేమిటి, వాన రావటల్లేదు కదా అనుకుంటూ పెరట్లోకి వెళ్ళి చూస్తే ఓవర్ హెడ ట్యాంక్ నిండిపోయి నీళ్ళు ధారాళంగా పెరటినిండా వచ్చేసాయి. మళ్ళీ నెత్తి మొత్తుకుని మోటర్ ఆఫ్ చేసింది.

ఇటువంటి సంఘటనలు ఆమె జీవితంలో వారానికి ఒకసారన్నా జరుగుతూ వుంటాయి. అందుకే చిత్తశుద్ధితో జ్ఞాపకశక్తి పెంపొందించుకోవడానికి ఆ పుస్తకం కొంది. కాని తనకి జ్ఞాపకశక్తి ఇంకా పెరిగేలోపునే ఆ పుస్తకం పోగొట్టుకుంది.

దిగాలుగా కూర్చుని మూగగా మనసు రోదిస్తూండగా పక్కింటి సంతానలక్ష్మి వచ్చింది. "ఏమిటే లక్ష్మీ! సామ్రాజ్యాన్ని పోగొట్టుకున్న మహారాణిలా అలా కూర్చున్నావేమిటి లక్ష్మీ?" అని అడిగింది.

"అవునే, సామ్రాజ్యాలే పోగొట్టుకుంటున్నాను లక్ష్మీ! ఛీఛీ, నాకు బతుకంటేనే విరక్తి కలుగుతోందే లక్ష్మీ!" అంది స్వరాజ్యలక్ష్మి విచారంగా.

సంతానలక్ష్మి ఓదార్పుగా "లక్ష్మీ, లక్ష్మీ! అలా దిగాలుపడకు లక్ష్మీ! అసలు ఏంజరిగిందే లక్ష్మీ?" అని అడిగింది.

(అబ్బ! ఈ కథ రాయడానికి చికాకొచ్చేస్తోంది. లక్ష్ములిద్దరూ ఒకరినొకరు లక్ష్మీ, లక్ష్మీ అని పిలుచుకుంటూంటే, ఏ లక్ష్మి ఏమందో జ్ఞాపకముండక నాకు కూడా మతిమరుపు వచ్చేస్తోంది.)

స్వరాజ్యలక్ష్మి అంది, "లక్ష్మీ! నా బాధ ఏం చెప్పనే? నాకు మతిమరుపు బాగా ఎక్కువైపోయిందే." అంటూ పూసగుచ్చినట్లు అన్ని విషయాలూ చెప్పి, చివరకి, "అంతే కాదు, లక్ష్మీ! ఇవాళ బజార్లో 'జ్ఞాపకశక్తి పెంపొందించుకోవడం ఎలా?" అన్న పుస్తకం బోలెడు డబ్బు తగలేసి కొన్నానే లక్ష్మీ! ఆ పుస్తకం కూడా బస్ స్టాండులో మర్చిపోయాను లక్ష్మీ!" అంది.

సం.లక్ష్మి అంది, "లక్ష్మీ! నేనొక్కటి చెప్పనా? అది మతిమరుపు కాదు లక్ష్మీ! నీ జ్ఞాపకశక్తి అమోఘంగానే వుంది లక్ష్మీ! లేకపోతే ఎప్పుడన్నా నాకు చేబదులుగా ఇచ్చిన పదీ పరకా మర్చిపోతున్నావా? వడేసి పుచ్చుకోటల్లేదూ? అదుగో, అలా చూడకు, ఉదాహరణకు చెప్పాను. నువ్వు శుభ్రంగా వున్నావు లక్ష్మీ! ఇలా మర్చిపోవడం అన్నది అందరికీ జరుగుతూనే వుంటుంది. ఎందుకంటే మోటరు ఆన్ చేసి ట్యాంక్ నిండేదాకా అక్కడే నుంచోము కదా లక్ష్మీ? అలాగే పాలు స్టౌ మీద పెట్టి, ఇంతలో ఇంకో పని చేసుకుంటాము. కుళాయిలోంచి నీళ్ళు రాకపోతుంటే దాన్ని కట్టాలన్న ధ్యాస ఎవరికీ వుండదు లక్ష్మీ! అలా తెరిచి వుంచేస్తాము. అందుకని, ఇదుగో లక్ష్మీ............"

"అబ్బ, చెప్పవే లక్ష్మీ! నాన్చక."

"తొందరపడకు లక్ష్మీ, చెబుతున్నానుగా. నువ్వు మోటరు ఆన్ చేసావనుకో, అది సుమారు ఇరవై నిముషాల తర్వాత ఆఫ్ చేయాలి. అందుకని ఒక అలారం గడియారం కొనుక్కో. ఏడింటికి మోటర్ ఆన్ చేసావనుకో. అలారం ఏడూ ఇరవైకి సెట్ చేసుకో. ఇంక నీకు బెంగవుండదు లక్ష్మీ. ఈ లోపున కూరలే తరుక్కుంటావో, పేపరే చదువుకుంటావో నీ ఇష్టం. అలారం

ఏడూ ఇరవైకి మోగగానే వెళ్ళి మోటర్ ఆఫ్ చేసెయ్యి లక్ష్మీ. అలాగే పాలు స్టౌ మీద ఆరు ఇరవై నిమిషాలకి పెట్టావనుకో. అలారం ఆరు నలభయికి సెట్ చేసుకో. ఇంక గొడవుండదు."

"నువ్వు చెప్పిన ఈ సలహా చాలా బాగుంది లక్ష్మీ. చాలా చాలా థ్యాంక్స్. ఇవాళే అలారం గడియారం చిన్నది కొంటాను."

"సరే, ఉంటా లక్ష్మీ." అంటూ సం.లక్ష్మి, స్వ.లక్ష్మి నించి సెలవు తీసుకుంది.

వెంటనే స్వ.లక్ష్మి బజారుకి వెళ్ళి చక్కటి, ముద్దొచ్చే చిన్న అలారం గడియారం, నీలంరంగులో వున్నది కొనుక్కుని, ఎక్కడా పెట్టి మర్చిపోకుండా, జాగ్రత్తగా ఇంటికి తీసుకువచ్చింది.

ఆ మర్నాడు..........

మోటరు ఏడింటికి ఆన్ చేసి పాలు కాచడానికి వంటింట్లోకి వెళ్తూ, అలారం గడియారం కూడా తీసికెళ్ళి, ఏడూ ఇరవైకి అలారం మోగేలా సెట్ చేసుకుని వంటింట్లో పెట్టుకుంది. మళ్ళీ పాలు మరిగేసమయానికి అలారం పెట్టుకోడానికి మరొక గడియారం లేదే? స్వ.లక్ష్మి కి చికాకేసింది. 'హు! ఈ లక్ష్మి ఎప్పుడూ ఇలాంటి పనికిమాలిన సలహాలే ఇస్తుంది.' అని విసుక్కుని పాలు మరిగేదాకా వంటింట్లోనే వుందామని నిశ్చయించుకుని ఈలోపుగా బెండకాయలు తరగసాగింది. ఇంతలో బైటినుంచి అరుపు వినిపించింధి.

"ఆకు కూరలోయ్! ఆకు కూరలు!"

'హు, అతడొకడు, స్కూటరు మీద అరుచుకుంటూ వస్తాడు. మనం వెళ్ళేలోపు సందుచివరికి వెళిపోతాడు.' అని చికాకుపడుతూ హడావిడిగా బుట్ట తీసుకుని బైటికి పరిగెట్టింది. అతడు కొత్తిమీర కట్ట ఇరవై రూపాయలకి ససేమిరా తగ్గనంటూంటే బేరమాడి, బేరమాడి, పదిహేను రూపాయలకి కొంది, అలాగే కాస్త తోటకూర, కాస్త కరివేపాకు మళ్ళీ బేరమాడి, బేరమాడి, బేరమాడి కొంది. అవి తీసుకుని వంటింట్లోకి వచ్చేసరికి షరా మామూలే! పాలగిన్నె బొగ్గులా మాడిపోయివుంది. కోపంగా స్టౌ కట్టేసి, ఆ గిన్నె సింక్ లోకి విసిరేసింది. ఇంతలో బైట మళ్ళీ హోరున వర్షం కురుస్తున్న చప్పుడు వస్తూంటే పరిగెత్తుకుంటూ వెళ్ళి మోటరు ఆఫ్ చేసింది.

స్వరాజ్యలక్ష్మికి చాలా కోపం వచ్చింది. 'హు! నూటనలభయి రూపాయలు తగలేసి కొన్నాను. ఈ గడియారం అలారం కొట్టకుండా నిద్దరోతోందా అని గడియారాన్ని చేతిలోకి తీసుకుని మళ్ళీ ఐదు నిముషాల తర్వాతకి అలారం సెట్ చేసి మోగుతుందా, మోగదా అని దీక్షగా చూడసాగింది.

ఒక నిముషం గడిచింది! రెండు నిమిషాలు గడిచాయి!..............

లక్ష్మిలో సస్పెన్స్ పెరిగిపోతోంది.

మూడు నిముషాలు గడిచాయి..........! నాలుగు నిముషాలు గడిచాయి.............

లక్ష్మిలో భరించలేని ఉత్కంఠ! అలారం గడియారం కేసి అలాగే చూస్తోంది.............

ఐదు నిముషాలు భారంగా గడిచాయి.....................

లక్ష్మి ఊపిరి బిగబట్టుకుని చెవులు రిక్కించుకుని వినసాగింది!

అది ఎలక్ట్రానిక్ గడియారం................

సిగ్గుగా, మొహమాటంగా, వినపడీ వినపడనట్లుగా 'కుయ్! కుయ్! కుయ్!' అని కూస్తోంది.

లక్ష్మి విరక్తిగా "నీ పిచ్చికూతలు మండా!' అని తిట్టుకుని అలారం ఆపేసింది.

❖❖❖❖❖

## తెలుగుతల్లి నుతి

సీ॥ పాలమీగడ కన్న పాయసాన్నము కన్న
తీయనైనది మన తెలుగుభాష
పంచదారల కన్న పనసతొనల కన్న
తీయనైనది మన తెలుగుభాష
జుంటితేనెల కన్న జున్నుముక్కల కన్న
తీయనైనది మన తెలుగుభాష
తీయమామిడి కన్న తీపులన్నిటి కన్న
తీయనైనది మన తెలుగుభాష

గీ॥ తెలుగుభాషలో పుట్టుటే దివ్యవరము
తెలుగు తల్లిని యెదలోన తలచుకొంచు
పూజ్యభావమ్ము తనువెల్ల పులకరింప
అంజలింతమురండి, ఓ ఆంధ్రులార!

డా. మీగడ రామలింగస్వామి, వైజాగ్

❖❖❖❖❖

# దీపావళి

శ్రీమతి అనూరాధ నేదునూరి, హైద్రాబాద్



భారతీయ సంస్కృతికి ప్రతిబింబంగా వెలుగొందేవి భారతీయ పండుగలు.వాటిలో ఆనందోత్సాహాలతో జాతి, కుల,మత వర్గ విభేదాలను విస్మరించి సమైక్యంగా జరుపుకునే పండగే దీపావళి. దీపావళి పండగను అన్ని ప్రాంతాల ,రాష్ట్రాల, దేశాలలోని వాళ్ళు జరుపుకుంటారు, దివ్య దీప్తుల దీపావళి జగతిని జాగృతం చేసే దివ్య దీపావళి.

దీపావళి పండుగను ప్రతి ఏటా ఆశ్వయుజ మాస అమావాస్య రోజు జరుపుకుంటారు.ఈ పండుగకు ముందు రోజు ఆశ్వయుజ బహుళ చతుర్దశి దీన్ని నరక చతుర్దశి గా జరుపుకుంటారు.దీపావళి రోజు కొందరు వ్రతాలు ,కేదారనోములు ,లక్ష్మిపూజ నిర్వహిస్తారు. ఇంకా కొన్ని ప్రాంతాల వాళ్ళు బొమ్మల కొలువు, దొంతులు పెట్టి నవరాత్రులు పూజిస్తారు.

కొత్త వస్తువులు,బంగారు నగలు,ఇండ్లు,స్థలాలు కొంటారు.

వ్యాపారస్తులు కొత్త జమా ఖర్చుల పుస్తకాలను తెరుస్తారు.


అసలు విషయానికి వస్తే దీపావళి జరుపుకునే ముఖ్య ఉద్దేశం ఏమిటి అంటే

ఆరోజు సత్యభామ కృష్ణుడు రథం తోల గా నరకాసురుడి తో యుద్ధం చేసి వాడిని వధించి ప్రజలకు రాక్షసుల బారినుండి విముక్తి కలిగిస్తుంది ఆ ఆనందంలో ఊరంతా దీపాలు వెలిగించి ఆనందోత్సాహాలతో పండగ చేసుకుంటారు.

పురాణ ఇతిహాసాల్లో

రామాయణంలో కూడా దీపావళికి ఒక కారణం ఉంది అది ఏమిటి అనగా ఆ శ్రీ రాముడు లంకలో రావణాసురుని వధించి సీతా సమేతంగా అయోధ్యకి చేరగా అయోధ్య ప్రజలు ఆ ఆనందాన్ని దీపావళి గా ఊరంతా దీపాలు వెలిగించి పండగ చేసుకున్నారు.

లక్ష్మి పూజ చేయడానికి కూడా పురాణాల లో ఒక కథ ఉంది.



పూర్వం దుర్వాస మహాముని ఒకమారు దేవేంద్రుని ఆతిధ్యానికి సంతసించి మహిమాన్విత మయిన ఒక హారాన్ని బహుకరించారు ,ఇంద్రుడు దానిని తిరస్కార భావం తో తన వద్ద ఉన్న ఐరావతం మెడలో వేసాడు ఆ ఐరావతం ఆ హారాన్ని కాలితో తొక్కేస్తుంది అదిచూచి ఆ మహర్షి ఇంద్రుడిని శపిస్తాడు తత్ఫలితంగా ఇంద్రుడు రాజ్యాన్ని కోల్పోయి  దిక్కు తోచక ఏమీ పలుపోక ఆ శ్రీ హరిని వేడుకుంటాడు.

ఈ పరిస్థితి గ్రహించి ఆ మహావిష్ణువు  దేవేంద్రున్ని ఒక జ్యోతి వెలిగించి  దానిని శ్రీ మహాలక్ష్మి గా తలచి పూజించమంటాడు.

అలా పూజించి దేవేంద్రుడు శ్రీ మహాలక్ష్మి అనుగ్రహం తో తిరిగి త్రిలోకాది పత్యాన్ని పొందాడు అని పురాణాలు చెపుతున్నాయి అందుకే దీపావళి రోజు లక్ష్మిపూజ జరుపుకుంటాము.

దీపావళి రోజు ఆ ఆనందంలో బాణా సంచా కాలుస్తాము ఇందులో ముక్యోద్దేశం ఆశ్వయుజమాసం  కు ముందు వర్షఋతువు ఆ వర్షాల కారణంగా క్రిమి కీటకాలు  చేరతాయి బాణా సంచా పొగకి అవన్నీ నశిస్తాయి.

||  దీపం జ్యోతి పరబ్రహ్మ దీపం సర్వ తమోపహం  దీపేన సాధ్యతే సర్వత్ సంధ్యా దీప నమోస్తుతే||



❖❖❖❖❖

## అమెరి 'కులాసా' కథ

### మాస్క్ లూ- రిస్క్ లూ కథ

---వంగూరి చిట్టెన్ రాజు, హ్యూస్టన్, టెక్సస్



మా చిన్నప్పుడు తెలిసో తెలియకో నేనూ, మా తమ్ముడూ ఒకేలా ఉండేవాళ్ళం...అంటే మొహాలు కాదు. వెనకాల నుంచి చూస్తే అనమాట. ఆ మాట కొస్తే మాది 'అచ్చు గుద్దినట్టు" బాపతు కుటుంబం కాదు. అనగా కొన్ని కుటుంబాల్లో కన్న తండ్రిని కానీ, తల్లిని కానీ చూసి  వాళ్ళ తొమ్మిదో సంతానం దాకా చూస్తే అందరూ క్సీరాక్స్ కాపీల్లా ఉంటారు. ఒకే ముక్కు పొడుగు, మూతి వంకర, స్క్వేర్ మొహం, లేదా త్రికోణాకారం మొహం వగైరాలలో ఏదో ఒకటి చూసి ఫలానా వాళ్ళబ్బాయి అనో, అమ్మాయి అనో చూడగానే ఠక్కున చెప్పెయ్య వచ్చును. మరి మాది వెనకబడిన వ్యవహారమో ఏమిటో తెలియదు కానీ, మా అన్నదమ్ములం, అప్పచెల్లెళ్ళం అందరం నలుపూ, తెలుపూ, ఆ రెండింటికీ మధ్య రంగులతో మా అమ్మకీ, బాబయ్య గారికీ..ఆ మాటకొస్తే బంగారం లా ఉండే మా బామ్మ గారికీ, దానికి ఆపోజిట్ గా ఉండే మా తాత గారికీ సమన్యాయం చేశాం. అందులో భాగంగానే ముందు నుంచి చూస్తే మా తమ్ముడు త్రికోణం మొహంతో మా అమ్మ పోలిక, నేనేమో చతుర్భుజాకారం తో మా బాబయ్య గారి పోలికా అయినా, వీపు వేపు నుంచి చూస్తే ఇద్దరం ఒక్క లాగే ఉండేవాళ్ళం.

ఇది ఎలా తెలిసిందీ అంటే....మా చిన్నప్పుడు ఒక సారి ఎవరిదో బంధువుల ఇంటికి అందరం పెళ్ళికి వెళ్ళాం. ఎవరి హడావుడిలో వాళ్ళు ఉండగా, నేను అమాయకంగా నుంచుని పెళ్ళి తంతు చూస్తూ ఉంటే ఢభీమని వీపు మీద ఎవరో చరిచారు. నేను హడిలి పోయి, వెనక్కి తిరగగానే ఒకాయన "ఏరా, ఆంజీ బావున్నావా? పెద్ద వాడివి అయిపోతున్నావు, హా" అని ఏదో అనబోతూ ఉంటే నాకు జరిగిన డేమీజీ అర్థం అయింది. "సార్..నేను రాజాని. మా తమ్ముడు ఆంజి అక్కడెక్కడో గాడి పొయ్యి దగ్గర ఉన్నాడు" అనగానే పాపం ఆయన కొంచెం చిన్నబుచ్చుకుని, "అయ్యో,. నువ్వట్రా....ఆంజి అనుకున్నాను' అనేసి అర్జంటుగా అక్కడి నుంచి నిష్క్రమించాడు. నేను వీపు గోక్కునీ, అది అందక అక్కడి సరుగుడి రాటని మా పొలాల్లో దున్నపోతులు చింత చెట్లకి రాసుకున్నట్టు బరుక్కున్నా సరిగ్గా గోక్కో లేక ఆ దెబ్బ నుంచి కోలుకునే సమయానికి ఆ పెళ్ళీ, పెటాకులూ అయి పోయి సాయంత్రం రిసెప్షన్ సమయం వచ్చేసింది. ఆ రోజుల్లో పెళ్ళిళ్ళలో మధ్యాహ్నం భోజనం సమయం లో అయితే నేల మీద కుట్టిన విస్తరాకులు వేస్తే.....సాయంత్రం రిసెప్షన్ అనగానే కాస్త దర్జా ఎక్కువ కాబట్టి తెల్ల దుప్పట్లు వేసిన బల్లల మీద అరిటాకుల్లో విందు

భోజనం పెట్టేవారు...ఇంకా దర్జా ఎక్కువ అయితే సంగీత కచేరీ కూడా ఉండేది...సినిమా పాటలు పాడితే అలగాజనం కింద లెక్క...ఇప్పుడు దానికి ఆపోజిట్...అనుకుంటాను.

నేను ఆ రిసెప్షన్ కి బల్లలు వెయ్యడం లో ఓ చెయ్యి వెయ్యబోతుంటే ...వెనకాల నుంచి.. అప్పు చేసి పప్పు కూడూ లో ఆర్. నాగేశ్వర రావు బాపతు అదే దెబ్బ...అదే మాట......"ఏరా, ఆంజీ ఎలా ఉన్నావ్? ఒరేయ్..పొద్దున్న నువ్వు అనుకుని రాజా గాడిని ఇలాగే వీపు బద్దలు కొట్టాను రా.పాపం, ఏమనుకున్నాడో, ఏమిటో?" మరి ఏమనుకున్నానో చెప్పాలి కదా."సార్. మీరు పొద్దున్న కొట్టినదీ నన్నే. ఇప్పుడు కొట్టినదీ నన్నే..నేను రాజాని. ఆ వెధవ ఆంజి గాడి వీపు ఇంకా ఎక్కడో వంటింట్లో గాడి పొయ్యి దగ్గరే తగలడ్డాడు" అని ఏడుపు మొహం పెట్టాను. పాపం, ఆయన ఈ సారి కూడా సరిగ్గా పొద్దుటి లాగానే అదే వెర్రి మొహం పెట్టి" సారీ...వాట్ కెన్ ఐ డూ...యు లుక్ ఎలైక్" అని భాష మార్చి ఇంగ్లీషు లో వాపోయి, వంటింటి కేసి పారిపోయాడు. ఆ సాయంత్రం అయినా మా తమ్ముడు దెబ్బలు తిన్నాడో లేదో ఈ సాయంత్రం దాకా నాకు తెలియదు.

ఇప్పుడు అదంతా ఎందుకు జ్ఞాపకం వచ్చింది అంటే...

నిన్నగాక మొన్న నేను క్వీన్ విక్టోరియా గారి ఆజ్ఞానుసారం వారానికి సరిపడా వంటింట్లో కావలసిన సరుకులు కొనడానికి హెచ్.ఈ.బీ అనే పెద్ద పచారీ కొట్టు కి వెళ్లాను. యధాప్రకారం నా జేబులో ఆవిడ చెప్పిన రెండు పట్టికలు ఉన్నాయి. ఒకటి "ఇవి కొన్నావంటే చంపేస్తాను". రెండోది "ఇవి కొనకపోతే చంపేస్తాను నిన్నగాక మొన్న నేను క్వీన్ విక్టోరియా గారి ఆజ్ఞానుసారం వారానికి సరిపడా వంటింట్లో కావలసిన సరుకులు కొనడానికి హెచ్.ఈ.బీ అనే పెద్ద పచారీ కొట్టు కి వెళ్లాను. యధాప్రకారం నా జేబులో ఆవిడ చెప్పిన రెండు పట్టికలు ఉన్నాయి. ఒకటి "ఇవి కొన్నావంటే చంపేస్తాను". రెండోది "ఇవి కొనకపోతే చంపేస్తాను." ఈ రెండూ అక్కడ ఉండే 'పాల నడవ'....అదే లెండి....పాలూ, మజ్జిగా వగిరాలు ఉండే "Aisle" అనమాట...అందులో కూరల బండి తోసుకుంటూ వెళ్తూ ఉండగా ఎర్ర చొక్కా వేసుకుని సదరు హెచ్.ఈ.బీ లో పనిచేసే ఒకానొక అందమైన అమ్మాయి నన్ను చూడగానే 'గుడ్ మోర్నింగ్" అని పలకరించింది. మామూలు పరిస్థితులలో అయితే అలాంటి చక్కని చుక్క ఆప్యాయంగా పలకరించినప్పుడు అష్టవంకరలూ తిరిగిపోయి వాటేసుకునే దాకా ఓవర్ ఏక్షన్ చేద్దును కానీ ఇవాళ నాకు ఒళ్ళు మండిపోయింది. ఎందుకంటే...ఆ పిల్ల నన్ను చూసి కూసిన పూర్తి కూత "గుడ్ మోర్నింగ్, మేడమ్".

అనగా ఈ సారి ఇన్నేళ్ళ తరవాత వెనక నుంచి కాకుండా, ఏకంగా ముందు నుంచే తిరుగు లేని దెబ్బ తిన్నాను అన మాట..అదీ చిన్నప్పటిలా వీపు మీద దెబ్బ కాదు. నా హృదయం మీద కొట్టిన ఆడ దెబ్బ!...మరుక్షణమే నాకు దానికి కారణం అర్థం అయిపోయింది. ఈ నాటి ఫేషన్ ని అనుకరిస్తూ నేను సైతం మోకాళ్ళ కి పై దాకా తొడలు కనపడే పొట్టి లాగూ, ఆడా, మగా వేసుకునే లూజు, లూజుగా...కాలర్ కత్తిరించేసి మెడ కనపడే 'టీ చొక్కా' వేసుకున్నప్పటికీ, ఈ వెధవ కరోనా ఖర్మమా అని తగిలించుకున్న 'మూతి గోచీ" నా కొంప ముంచింది. దాని వలన నేను అమ్మాయిగా మారిపోయాను అని గమనించి వెనువెంటనే నా డేమేజ్ కంట్రోల్ ప్రణాళిక ప్రకారం ఆ మాస్క్ తీసి అవతల పారేసి, నా సొగసైన మీసాలు మెలేశాను. పాపం, ఆ చిన్నది ఏం చెయ్యాలో తెలియక ఓ వెర్రి నవ్వు పారేసి, యాదాలాపంగా సారీ సర్ అనేసి, ఎందుకైనా మంచిదని కాబోలు, తన మూతి ముసుగు కూడా పక్కకి తొలగించి ఎర్రటి పెదాల రంగు ప్రదర్శించి 'పాల నడవ' నుంచి 'ఫేషన్ సామాగ్రి నడవ' కి పారిపోయింది. అంటే ఫేషన్ 'aisle' అనమాట!.

ఇలాంటి అవకతవకలు నాకే కాదు, మీకు కూడా జరిగే ఉంటాయి కాబట్టి అందరినీ ఆ ఇబ్బంది నుంచి కాపాడడానికి..అనగా ఈ మాస్క్ ధారణతో ఎవరు, ఆడో, ఎవరు మగో తెలుసుకోడానికి ఏకంకా ట్రంప్ గారితో పంచుకునే ఒక గొప్ప ఆలోచన వచ్చింది. అనగా...అమెరికాలో ఆడవాళ్ళు అందరూ వంగపండు రంగు...అనగా పింక్ రంగు మాస్క్ లూ, మగాళ్ళందరూ నీలం రంగు మాస్క్ లూ ధరించి కరోనా నుంచి కాపాడుకుంటే, నాకు జరిగిన ఘోరమైన అవమానాల లాంటివి నిరోధించవచ్చును కదా!. ఇక అటూ, ఇటూ తేల్చుకోలేని వారు సగం పింకూ, సగం నీలమూ ధరిస్తే సరి పోతుంది. ట్రంప్ గారు ముందు మాస్క్ వేసుకోడం మానేసినా ఇప్పుడు మాస్క్ మంత్రం జపిస్తున్నాడూ కదా!.

నిజానికి ఇదే అవిడియా ఆంధ్రా లోనూ, హైద్రాబాడ్ లోనూ కూడా పాటించవచ్చును కానీ, అక్కడ నా సిద్ధాంతాన్ని వక్రీకరించి, అక్కడ ఆగా, మగాలకి బదులు పార్టీ రంగులకి అనుగుణం గా పసుపు, నీలం, పింక్, కొండొకచో కొడవలి గుర్తుతో ఎర్ర రంగు మాస్క్ లు, లేదా కాంగ్రెస్  రంగుల మాస్క్ లు ధరిస్తారేమో అని నా అనుమానం. ఏదైనా ఊరేగింపు లో ఒక వేపు నుంచి లక్షలాది మంది పసుపు మాస్క్ లూ, రెండో వేపు నుంచి నీలం మాస్క్ లూ ధరించి వస్తున్నారు అనుకుందాం. ఆ ప్రవాహాలు తల్చుకుంటేనే ఒళ్ళు గగుర్పొడుస్తోంది కదా!  ఇప్పుడు అమెరికాలో కూడా ఎన్నికల సీజన్ కాబట్టి ఇక్కడ కూడా  ట్రంప్ వాళ్ళు ఎర్ర రంగూ, బైడెన్ పార్టీ వారు నీలం రంగూ మాస్క్ లు వేసుకుని తిరుగుతారేమో చూడాలి.


ఏది ఏమయినా, ఏ రంగు మాస్క్ వేసుకున్నా... ఊపిరి ఆడి చావదు. అది ఒక రకం రిస్క్...కోక పోతే కరోనా రిస్క్....ఇదెక్కడి గొడవరా బాబోయ్!

❖❖❖❖❖



# తెలుగు సాహిత్యంలో వెలుగు సి.పి. బ్రౌన్

శ్రీ రాచకొండ మల్లికార్జునరావు , సిడ్నీ



CP బ్రౌన్ మహాసేయుడు తెలుగు వారందరికి ప్రాతఃస్మరణీయుడు.

ఈయన నవంబర్ 10, 1798 నా కల్కత్తా లో జన్మించారు. East India Company లో మద్రాసు province లో ప్రభుత్వ ఉద్యోగిగా పనిచేసాడు. అప్పటి, అంటే 1820 లో మద్రాసు గవర్నర్ ప్రతి ప్రభుత్వ ఉద్యోగి ఒక ప్రాంతీయ భాష నేర్చుకోవాలని ఆదేశించాడు. మన అదృష్టం కొలది బ్రౌన్ తెలుగు ఎంచుకున్నాడు. వెలగపూడి కోదండరామ పంతులు గారి వద్ద తెలుగు అభ్యసించాడు.

ఆయన కడప, మచలీపట్నం, రాజమండ్రి, గుంటూరు మొదలైన పట్నాలలో అనేక హోదాల్లో పనిచేసాడు.

ఆయన 1835 లో London వెళ్ళి అక్కడ 1837 వరకు ఉన్నాడు.

East India House Library, London లో భారత్ కి సంబంధించిన ప్రాచీన గ్రంధాల తాళపత్రాలు (manuscripts on palm leaves) అనేకం ఉన్నాయి. 1835 Mr. H.H. విల్సన్ అనే ఆయన బ్రౌన్ ని దక్షిణ భారత ప్రాచీన గ్రంధాల లిఖిత ప్రతుల జాబితాను (catalogue) తయారు చేయ్యమని నిర్దేశించాడు. తర్వాత, మన అదృష్టం కొలదీ, వాటిలో చాలా గ్రంథాలు భారత్ కి తిరిగి వచ్చినట్టుగా ప్రతీతి.

1837 లో Madras తిరిగి వచ్చి East India Company కి Persian భాషా translator గా పని చేసాడు. అప్పుడే Madras College Board లో సభ్యుడుగా కూడా చేరాడు.

మళ్ళా 1854 లో ఆరోగ్యాం బాగోక London వెళ్ళాడు. అక్కడ London University లో తెలుగు professor గా కొంత కాలం పనిచేసాడు.

బ్రౌన్ తెలుగు భాషపై ఎక్కువ మక్కువ చూపినా ఆయన బహు భాషా కోవిదుడు (polyglot). తెలుగు, ఇంగ్లీష్ తో పాటు గ్రీక్, లాటిన్, పర్షియన్ మరియు సంస్కృతంలో కూడా ప్రావీణ్యుడు.

ఆయన తెలుగు భాషకి మూడు విధాలుగా సేవను అందించాడు:

1. తన సొంత గ్రంధ రచనలతో
2. పురాతన గ్రంధ సంరక్షణతో
3. గ్రంధ ముద్రణలతో

ఆయన తన సొంత ఖర్చులతో వీటన్నిటినే కాక కడప, మచిలీపట్నంలలో ఉచిత పాఠశాలలను స్థాపించాడు.

1824 లో బ్రౌన్ దృష్టి వేమన పద్యాలపై బడింది. ఆ సమయంలో తిప్పభట్ల వెంకట శివ శాస్త్రి, వాత్యమ్ అద్వైత బ్రహ్మ శాస్త్రి గార్లనుండి తెలుగు వ్యాకరణ ఛందస్సులు నేర్చుకున్నాడు. తెలుగు భాషతో పాటు తెలుగు గ్రంధాలను అధ్యయనం చెయ్యడం కొనసాగించాడు. ఆ సమయం నుండి దుర్లభమైన అనేక తెలుగు గ్రంధాల, కావ్యాల తాళపాత్ర మూలాలను సేకరించి వాటికి కాగితాలపై ప్రతులు తీయించాడు. ఈ కృషిలో ఆయన రాత మూలాలు లేని, అంటే కేవలం వినికిడిలో మాత్రం లభ్యమయ్యే అకాలపు వ్యాసాలు, కావ్యాలు, కథలు, పద్యాలు మొ. వాటికి రాత ప్రతులను తయారు చేయించాడు.

తెలుగు ఛందస్సు, కావ్యపరిచ్ఛేదము (prosody) పై బ్రౌన్ పరిశోధన ప్రసిద్ధమైనది. దానిపై వారి పరిశోధనావ్యాసాన్ని (thesis) Asiatic Journal లో ముద్రించారు. ఆయన "భారత సాంప్రదాయాలపై ఆధార పడకుండా భాషకి ఒక స్వతంత్రమైన, స్పష్టమైన ప్రతిపత్తి ఉండాలి" అని వాదించాడు.

ఆయన రచించిన గ్రంధాలు:

- బ్రౌణ్య నిఘంటు (మూడు పుటలు) 1852-54.
- A Grammar of the Telugu Language. 1857.
- ఆంధ్ర గీర్వాణ చందము (Prosody of Telugu and Sanskrit) 1827.
- వేమన శతకము (Collection of 693 poems by Vemana) 1829.
- వేమన శతకము (Second collection of 1164 poems by Vemana) 1839.
- లోకం చేత వ్రాయబడిన శుభ వర్తమానము (Translation of bible stories in Telugu)
- రాజుల యుద్ధములు (Translated into English by Charles Philip Brown 1853.

ఇప్పుడు బ్రౌన్ పరిశోధనల విశిష్టత, వారి రచనల ఆమోదం గురించి తెలుసుకుందాం.

**భాషా కోవిదులు**

వీరు మహాభారతం పై చేసిన పరిశోధన వివరాలు "Andhra Mahabharatamu" Critically Edited for the first time. అనే గ్రంధంలో వివరంగా ఉన్నాయి.

ఈ గ్రంధానికి సంపాదకీయంలో Prof. లక్ష్మీ రంజనం మరియు Prof. దివాకర్ల వేంకటావధాని గార్లు పని చేయగా, సలహాదారుల బృందంలో సర్వశ్రీ రాళ్ళపల్లి అనంతకృష్ణ శర్మ, వెంపరాల సూర్యనారాయణ శాస్త్రి మరియు దీపాల పిచ్చయ్య శాస్త్రి గార్లు ఉన్నారు. వీరంతా బ్రౌన్ గారి పరిశోధనకి ఎంత విలువ నిచ్చారో చూస్తే, దాని ద్వారా బ్రౌన్ పరిశోధనల ప్రాముఖ్యత మనకి కొంతైనా తెలుస్తుంది.

ఆ గ్రంధంలో "C. P. Brown's Activity" అనే ఖండంలో (section) చాలా వివరాలు ఇచ్చారు. వాటిలో గమనించదగ్గ విషయం ఏమిటంటే, ఆనాడు దొరికిన మహా భారతము ప్రతులలో కనబడ్డ వైవిధ్యాలను సమన్వయించడం. అప్పటికి అందుబాటులోఉన్న 10 మహా భారత ప్రతులను సేకరించి నట్లు తెలుస్తోంది. వాటిని రావు బ్రహ్మాజీ పంతులు, వేమూరి సుబ్బా రావు, మాజేటి సర్వేశలింగం మొదలైన వారినుండి పొందినట్లు తెలుస్తుంది.

వైవిధ్యాల విమర్శకు/నిర్ణయాలకు వ్యాస భారతంతో పోల్చి చూడదానికి పండితులను నియమించాడు. ఆ పండితులు తుది నిర్ణయం "దొర" గారికే వదిలేవారట. ఇది బ్రౌన్ దొరగారికి సంస్కృతం పై ఉన్న పట్టుని తెలియ జేస్తుంది. వారు చేసిన నిర్ణయాలకు "తీర్పు" అని పిలిచేవారట. ఆయన సుదీర్ఘకాలం District Judge గా పనిచేశాడు. ఇది గమనార్హం.


**పురాతన పండితులు**


ఆలూరి ఏకామ్ర జోశ్యులు అనే పండితులు 1853 లో తమ గ్రంధంలో బ్రౌన్ ప్రచురించిన మహా భారత పరిశోధనను శ్లాఘించారు. అంటే, ప్రాచీన కాలం నుండే పండిత వర్గంలో వీరి తెలుగు భాషకు అందించిన సేవ అమూల్యంగా భావించబడుతోంది అని తెలుస్తుంది.

**సామాన్య ప్రజలు**

ఇక పోతే అక్షర లక్షలు చేసే వేమన పద్యాలు బ్రౌన్ గారి శ్రమ వల్ల మనకి దక్కాయి. లేకుంటే అనోటా అనోటా వినికిడిలో మాత్రం ఉన్న ఆ పద్య రత్నాలు మారుతున్న కాలంలో కలిసిపోయేవి.

ఈ నాటికీ ఆయన రచనలు మనకు ప్రామాణ్యకాలు. నా మటుకు నేను వారి నిఘంటువును తరచూ చూస్తాను. అలాగే వారి వ్యాకరణ గ్రంథం "Grammar of the Telugu Language" ని కూడా తరచూ ఉపయోగిస్తాను.




❖❖❖❖❖

# సంగీత నాదామృతం

డా. పద్మ మల్లెల, సిడ్నీ.



Rama Darshan painting on the wall at Thiruvarur where Thyagaraja was born.

## స్వరజతి

గత సంచికలో సంగీత రచనలలో అభ్యాస గానంలో గీతం అనే రచన గురించి తెలుసుకున్నాం కదా! ఇప్పుడు దాని తరువాత అంశమైన జతిస్వరం అనే అంశం గురిం చి తెలుసుకుందాం. జతిస్వరం ప్రధానంగా నాట్యానికి సంబంధించినది అయినప్పటికీ సంగీతంలో కూడా తెలుసుకొన వలసిన అంశం. దీనినే స్వరపల్లవి అని కూడా అంటా రు. దీనిలో మృదంగ జతుల ఆధారంగా స్వరాల కూర్పు ఉంటుంది. దీనిలో సాహిత్యం ఉండదు. తంజావూరు క్వాట్రెట్ లోని పొన్నయ్య, చిన్నయ్య, వడివేలు మరియు శివానందం మొదలయిన వారు రచించిన కొన్ని జతిస్వరాలలో సగం స్వరంగాను సగం జతులగాను ఉన్నాయి. వీటిలోన ఇంకొక రకం 'శబ్ద పల్లవి' అనే రచనలో పల్లవి, అను పల్లవి జతులు గాను చరణాలు జతులు స్వరాలు కలిసి ఉంటాయి. స్వాతి తిరుణాలు గారు ఒక రాగమా లిక జతిస్వరంకూడా రచించారు.

సంగీత రచనలలో తరువాత క్రమంలో వచ్చేది స్వరజతి. అభ్యాస గాన క్రమంలో గీతాలకు తరువాత వర్ణాలకు ముందు నేర్చుకొనే సంగీత రచనలు ఈ స్వరజతులు. వీటిలో పల్లవి, అను పల్లవి మరియు చరణాలను విభాగాలుంటాయి. పల్లవి సాహిత్యం మాత్రమే పాడి చరణాలు స్వరం సాహిత్యం పాడటం లేక వాయించటం జరుగుతుంది. ఈ పేర్కొన్న రెండు రచనలు మధ్యమకాలంలోనే సాగుతాయి. అయితే శ్యామశాస్త్రుల వారి స్వర జతులు దీనికి భిన్నంగా ఉంటాయి. అంతేకాక అవి అభ్యాస గానం కాకుండా చాలా పరి ణితి చెందిన వారు మాత్రమే ప్రదర్శించ గలిగిన క్లిష్టమైన రచనలు. అవి భైరవి మరియు యదుకుల కాంభోజ రాగాలలోని కామాక్షి స్వరజతులు మరియు తోడి రాగం లోని రావే హిమగిరికుమారి అనే అత్యద్భుతమైన రచనలు. వీటిలో ముందు రెండు క్లిష్టమైన మిశ్రచాపు తాళంలో ఉన్నాయి. ఇక బిలహరి రాగం లోని రారావేణు గోపబాలా అనే స్వరజతి బహుళ ప్రాచుర్యం పొందిన రచనగా చెప్పుకోవచ్చు. చిన్ని కృష్ణ దాసు రచించిన సాంబశివా యనవే మరియు ఆనంద భైరవి రాగంలోశోభనాద్రి రచిం చిన రావేమే మగు వా మొదలైనవి కొన్ని బాగా తెలిసిన స్వరజతులు. ఇక స్వరజతి రచ యితలలో ముఖ్యమైనవారు స్వాతితిరునాళ్, తంజావూర్ క్వాట్రెట్ మొదలయిన వారు.

ఈ రచనల లోని సాహిత్యం సాధారణంగా శృంగార పరంగా లేక ఇష్ట దేవతా ప్రార్ధనగా ఉంటుంది. దీని తరువాత వచ్చే అభ్యాస గానం లో వచ్చే అతిముఖ్యమైన సంగీత రచన లు వర్ణాలు. వీటి గురించి కొంచం విస్తారంగా తెలుసుకోవాలి కనుక వచ్చే సంచికలో తెలుసు కుందాం.

ఇక ఎప్పుడూ మనం చర్చించు కుంటున్న కీర్తనల పరంపరలో త్యాగరాజస్వామివారు రచించిన నారాయణి రాగంలోని రామానీవే గాని నన్ను అనే కీర్తన గురించి తెలుసు కుందాం. ముందుగా కీర్తన సాహిత్యం

పల్లవి:

రామా నీవేగాని నన్ను రక్షించు వారెవరే

అను పల్లవి:

సోమసూర్య లోచన సుందర వదన శ్రీ ||రామా నీవే||

చరణం:

నాగ శయనా ముని యాగపాలన భక్త

భాగధేయ పావన త్యాగరాజ వినుత. || రామానీవే||

ముందుగా ఈ నారాయణి రాగం 28 వ మేళకర్త అయిన హరికాంభోజి రాగ జన్యం.

ఇది ఒక అపురూపమయిన రాగం ఎక్కువగా రచనలు లేనటువంటి రాగం. తరువాత ఈకీర్తన ప్రశ్నార్ధకంతో కూడిన ఒక చక్కని భక్తిపూరితమయిన రచన. సూర్య చంద్రులు తన రెండు కళ్ళుగా కల చక్కని అందమయిన ముఖముకల రామా! నీవు కాక నన్ను రక్షించే వారెవరు అనే ప్రశ్నార్ధకం చక్కని కవితా సొబగుగా కనపడుతుంది.

ఇక చరణంచూస్తే రాముడు విష్ణు స్వరూపమనే భావన నాగశయనా అనే పదంలో కనపడుతుంది. ముని యాగపాలనా అనే పదంలో రామాయణంలోని విశ్వామిత్రుడి యాగరక్షణ ఘట్టం కనపడుతుంది. తరువాత భక్త భాగధేయ పావన అనటంలో ఆయనను మనసారా భక్తితో మునులు పూజించిన విధంగా పూజిస్తే ఆదుకొనటానికి రాముడు తప్ప వేరే ఎవరు అని స్వామి వారు వేడుకొనే ఈ కీర్తన పెద్ద సంగీత రచన కాకపోయిన ప్పటికి ఒక కచేరీలో గణేశ స్తుతి తరువాత పాడి కొంచంగా స్వరకల్పనతో చక్కగా రంజిల్లుతుంది. అయితే నారాయణి వంటి అరుదైన రాగం లో స్వర కల్పన ఎంతో సాధన కలిగినపరిణితి చెందిన సంగీతజ్ఞులకు మాత్రమే సాధ్యపడే విషయం. కనుక ఈ సంచికలో ఈ కీర్తన అందరూ ఆస్వాదిస్తారని ఆశిస్తూ ఇప్పటికి సెలవు.

కర్ణాటక గాత్ర విద్వాంసురాలు శ్రీమతి పంతుల రమ ఆలపించిన కీర్తన ఈ లింకు ద్వారా విని ఆనందించండి.

https://www.youtube.com/watch?v=ElKqmh2k808

❖❖❖❖❖

# తెలుగు సాహిత్యంలో నానీలు

**డాక్టర్ ఎస్.ఆర్.ఎస్.కొల్లూరి, అమలాపురం**

**నానీ - ప్రక్రియ పరిచయం:**

ఆధునిక కవిత్వం రూప వైవిధ్యంతో బహుముఖాలుగా విస్తరించింది. వచనకవిత,మినీ కవిత, హైకు, గజల్, నాని అనేవి ఆధునిక కవితా రూపాలుగా వ్యాప్తిలోకి వచ్చాయి.ఈ నేపథ్యంలో శక్తివంతంగా భావాన్ని వ్యక్తీకరించే అద్భుత న్యూక్లియర్ ఎనర్జీ సృష్టి జరిగింది అదే నాని.

పూర్వ విమర్శకుల్లో చాలామంది చెప్పిన అభిప్రాయాలు ఈ'నాని' ని సమర్థించేవిగానే ఉన్నాయి. 'రమణీయార్థ ప్రతిపాదక శబ్దమ్ కావ్యం',' వాక్యం రసాత్మకం కావ్యం', 'అల్పాక్షరాల్లో అనల్పార్థ రచన' మొదలైనవి ఇందుకు ఉదాహరణలు.

మహాకవి శ్రీశ్రీ 'నిన్నటి మహాకావ్యం 18 పర్వాలైతే, నేటి మహాకావ్యం 18 పుటలు' అన్నారు. 'ఎన్ని గజాలు రాశాడన్నది కాదు ఎన్ని నిజాలు చెప్పాడన్నది ముఖ్యం' అన్నారు ఆరుద్ర.

ఇది యంత్రయుగం. సంపాదనాధ్యేయంలో, విలాసాల బిజీలో తీరికలేకుండా ప్రజలు పరుగుపెడుతున్నకాలం. అలాంటి అనేక మందికి పెద్దపెద్ద కావ్యాలుచదివే తీరిక, ఆసక్తిలేదు. ఈ దృష్టితో చూసినా ఈ నానీ కవితాప్రక్రియ చారిత్రక అవసరం అనిపిస్తుంది.కవిత్వం చదివే పాఠకుల సంఖ్య తగ్గుతున్న రోజుల్లో, కొత్త పాఠకులను పెంచుకోవడానికి ఈ నాని ఎంతో ఉపకరిస్తుంది.

1997 సంవత్సరంలో తెలుగు కవిత్వంలో ప్రవేశించిన ప్రక్రియ నాని. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత కాలాన్ని నిద్రపోనివ్వని నానీలబ్రహ్మ డాక్టర్ ఎన్.గోపి గారు నానీలు అంటే 'నావి నీవి వెరసి మనవి' అంటూ, ఈ నానీలను సృష్టించారు.డాక్టర్ ఎన్.గోపి గారి దృక్పథంలో ఆలోచనా ధోరణిలో తీవ్రమైన మార్పే ఈ నాని ఆవిర్భవించడానికి ముఖ్య కారణం.

నానీ ప్రక్రియ నిర్మాణం గురించి డాక్టర్ ఎన్.గోపి గారు 'నాని' అంటే చిన్న పిల్లవాడిని కదా అర్థం. అలాగే ఈ చిట్టి పద్యాలు కూడా.

**నానీ - లక్షణాలు:**

4 పాదాలు నియమం.

20 నుండి 25 అక్షరాల విస్తీర్ణం గల చక్రం. అంటే ఇరవై అక్షరాలకు తగ్గవు, 25 అక్షరాలకు మించవు.

శీర్షిక ఉండదు.

నిర్మాణం దృష్ట్యా వీటిలో ఒక పద్ధతిని గమనించవచ్చు. వీటిలో మూడొంతులకు పైగా నానీల్లో రెండేసి పాదాలకో భావాంశాన్ని గుర్తించవచ్చు. మొదటి రెండు పాదాల్లో ఒక భావాశం, చివరి రెండు పాదాల్లో మరో భావాంశం ఉంటాయి.మొదటి దానికి రెండోది సమర్థకంగా ఉంటుంది.

**కుండ ముక్కలైందా**

**కుమిలిపోకు**

**మట్టి మరో రూపం కోసం**

**సిద్ధమౌతోంది**

దీనిలో మొదటి భావాంశానికి రెండో భావాశం సమర్థకంగా ఉంది.

అలాగే నాలుగు పాదాల్లో ఒకే భావాంశమున్న నానీలు ఉన్నాయి. వీటిని సగం చదివితే అది పూర్తి కాదు. రెండో సగం చదివితేనే అర్థం అవుతుంది. అంటే నిర్మాణపరంగా రెండు వాక్యాలుగా కనిపించినప్పటికీ భావం దృష్ట్యా రెంటిని కలిపితేనే అది సంపూర్ణమవుతుంది.

**జీవితఖైదు అంటే**
**జీవితాన్ని**
**కాలానికి**
**వేలడదీయడమే**

దీనిలోని రెండు వాక్యాల్లో మొదటి దానికి రెండోది కొనసాగింపుగా ఉంటుంది.

వేమన పద్యాల్లో ఛందస్సును మినహాయించి చూసినా ఆయన ఏర్పరుచుకున్న ఒక నిర్మాణపథకం మనకు ఇందులో కనబడుతుంది.

నానీల్లో సామాజికం, తాత్వికం, వ్యంగ్యం,మొదలైనవన్నీ కనబడతాయి. నానీల ఆవిర్భావానికి ఒక ఉద్వేగభరితమైన నిరంతర సంవేదన మూలం. మానవ ప్రకృతిలోని విభిన్న ప్రవృత్తులను ఆకళింపు చేసుకోవాలని చేసిన ప్రయత్నం. జీవితాన్ని అనుభవాల సంపుటిగా భావించి, అది దుఃఖించడం కోసమే కాదని, దానిని జయించడం కోసం కూడానని తలచి చేసిన ప్రయాణం.. అంతస్సీమల్లోకి వెళ్లి అనుభూతుల్లో తడిసివచ్చి సామాజికకీరణం చెందిన సన్నివేశం...మనిషి మీద అపారమైన ప్రేమతో నిత్య సత్యాన్వేషణ పరత్వంతో, ఉపదేశ కంఠంతో కాక, అనురాగ స్పర్శతో చెప్పాలనే తాపత్రయం ఇవన్నీ నానీల్లోకనిపిస్తాయి. అని ఈ ప్రక్రియ కు కొనసాగింపుగా గోపి గారి వ్యాఖ్యానం అభినందనీయం.

'కవిత్వం కాలానికి అనుగుణంగా తనకు కావలసిన రూపాన్ని తానే ఎంచుకుంటుంది. కవి దానికి సాధనం అవుతాడు.ఆధునిక కవితా రూపాలలో అత్యాధునిక రూపం నానీలు. ఇది విశిష్ట కవితారూపం ఎందుకయిందంటే, ఇది నియమనిబంధనలు లేనిదికాదు.దిగుమతి చేసుకున్నది కాదు. భావకవిత్వం, అనుభూతి కవిత్వంలాగా కేవలం అంతర్ముఖత్వం లక్షణం కలదికాదు. అస్పష్టతను ఆదరించేది అంతకంటే కాదు. సామాజికత, సమకాలీనత అనే గుణాలు ప్రధానంగా గల రూపం. అందరూ ఆస్వాదించగలిగేది కూడ'అన్న ద్వా.నా.శాస్త్రి గారు నానీల గురించి చెప్పిన అభిప్రాయం అక్షరసత్యం. అందుకే డాక్టర్ ఎన్.గోపి గారి కలం నుండి జాలువారిన ఈ నానీలు అనేక మంది యువ రచయితలతో పాటు లబ్ద ప్రతిష్టులైన కవులను కూడా ఆకర్షించింది, అనుసరించారు. అశేషమైన సాహిత్య ప్రియులందరూ అందుకున్నారు. వామనావతార రూపంగా ప్రారంభమైన 'నాని' కవితా ప్రక్రియ త్రివిక్రమ అవతారంగా తెలుగు కవిత్వ లోకమంతా విస్తరించింది.

❖❖❖❖❖

# నా నీ స్వచ్ఛవిశ్వం

డాక్టర్ ఎస్.ఆర్.ఎస్ కొల్లూరి, అమలాపురం



జాతిపిత మాట
దేశపిత బాట
గుప్పెడు ఆరోగ్యం
గంపెడు ఆనందం.

ఈగలమోత
దోమలు రోత
అనారోగ్యపు వాత
108 కూత.

హలో.. !హలో ..!
రేడియేషన్లకు
పిచ్చుక
'ఆధార్' ఎగిరిపోయింది.

శుభ్రత
పాస్వర్డ్ కే
ఆరోగ్యమనే
మెయిల్ ఓపెన్ అవుతుంది.

చీపురు చేత దోస్తి
చెత్తాచెదారం నాస్తి
శుభ్రత జాస్తి
స్వచ్ఛమైన బస్తి.

నాటి సమర నాదం
వందేమాతరం
నేటి సంక్షేమవేదం
స్వచ్ఛభారతం.

కాలుష్యాసురిడివా?
గాలి నీరు
నేల నింగి నిప్పు
రూపాన్ని మార్చేస్తున్నావ్!

అంత మౌనమేంటి?
గాలి కాలుష్యమౌతుందనా!
శభాష్!
స్వచ్ఛ సైనికుడివే!

చెత్తా చెదారం
ఆయుధాలు లేని
ఫ్యాక్షనిస్ట్ లు!
అందరూ క్షతగాత్రులే!

ఆడ,మగ
కులం,మతం
గోత్రనామాలతో పనేంటి?
ఇది స్వచ్ఛత యజ్ఞం.

వృక్ష రాజం
త్యాగమూర్తి!
అంత్య కాలంలోనూ
అవయవ దానం.

ఆరోగ్యం కోసమే
అన్వేషణ!
స్వచ్ఛతే యోగ
శుభ్రతే ధ్యానం.

నా ఆరోప్రాణం
స్వచ్ఛతే !
నా పంచప్రాణాల్ని
నిలుపుతున్నందుకు.

వరుసగా
మొక్కలు నాటాను
ప్రకృతికి
తోరణం కట్టాను.

ప్రకృతి మాత
పరిమళశభరితమైన
పచ్చని సంతకం
వసంతం.

ప్రకృతి
పాపాయి ఒకటే
నవ్విస్తే నవ్వుతుంది!
ఓడిస్తే ఏడిపిస్తుంది!

❖❖❖❖❖


WESTMEAD
DOCTORS
GENERAL PRACTICE
Telugu and
Hindi speaking
Female GPs
Male GPs
ALLIED HEALTH
Psychologist
Physiotherapist
Podiatrist
Dietitian
SPECIALISTS
Paediatricians
Adult Physician
Geriatrician
Cardiologist
Shop 6, Coles Complex
29-33 Darcy Road
WESTMEAD
PH: 9687 4000
WESTMEADDOCTORS.COM.AU
Open 7 days
ONSITE PATHOLOGY
BULK BILLING AVAILABLE

# వానప్రస్థం

డా. జడా సుబ్బారావు, నూజివీడు

ఆటోలో నుంచి కిందికి దిగాడు బిక్షపతి.

చల్లగాలి ఒంటికి తగిలి ప్రాణం తెప్పరిల్లింది.

ఇంటివైపు చూశాడు. ఆకులు రాలిన చెట్టులా బోడిగా కనిపించింది. వాకిట్లో పిచ్చిమొక్కలు మొలిచాయి.

ఇంటిచూరుకింద చెత్తంతా పోగుపడి వుంది. అరటినారుగుతో కట్టిన దడి అక్కడక్కడా పడిపోయివుంది.

ఇంటిని అలా చూసేసరికి ప్రాణం నీరసంగా అయిపోయింది.

"ఏరా బిక్షపతీ! ఇప్పుడేనా రావడం? వంట్లో బాగుందా?" అంటూ తెలిసిన వాళ్లు వచ్చి పలకరిస్తుంటే పోగొట్టుకున్న వస్తువేదో మళ్లీ దొరికినంత ఆనందం వేసింది. ఊరివాళ్ల పలకరింపుతో ఒళ్లంతా పులకరించింది.

ఎన్నాళ్లయిందో ఆ వరసలతో కూడిన పిలుపులు విని. తలూపుతూ 'బాగున్నా'నన్నట్లుగా సమాధానమిస్తున్నాడు.

భార్యసాయంతో అడుగులో అడుగువేసుకుంటూ వాకిట్లోకి నడిచాడు.

నెలరోజుల కిందట జరిగిన సంగతి గుర్తొచ్చింది బిక్షపతికి.

**********************

మిషన్ కుట్టి వచ్చే ఆదాయంతో అటూఇటుగానో అవసరాలు తీరి తమకింత ముద్ద దొరికేది. అది తప్ప వేరే పనీలేదు, ఆదాయమూ లేదు. వాకిట్లో భార్యనాటిన గింజలు మొక్కలుగానో, తీగలుగానో పాకి కూరగాయలకు ఖర్చులేకుండా పొద్దుపోయింది.

జాకెట్లు, చిన్నపిల్లల గౌన్లు కుట్టి వచ్చినదానితో ఒక్కగానొక్క కొడుకుని చదివించాడు. అప్పుడప్పుడు కట్టే ఫీజులు, పండగలకో పబ్బాలకో కుట్టించే బట్టల ఖర్చు తప్ప కొడుకు రామ్మూర్తి కష్టపడి చదువుకుని, తన చదువుకు తగ్గ చిన్న ఉద్యోగం చేసుకుంటూ ఎవరిమీదా ఆధారపడకుండా బతుకుతున్నాడు. పల్లెటూళ్లో సొంత ఇల్లు, కొంచెం ఖాళీస్థలం, రెక్కల కష్టం తప్ప ఇంకేమీ మిగల్లేదు.

బతుకుబండిని అలాగే నెట్టుకొస్తున్న బిక్షపతి ఒకరోజు మిషన్ కుడుతూనే కిందపడిపోయాడు. పంపుదగ్గర బట్టలుతుకు తున్న భార్య రమణమ్మ పరుగు పరుగున వచ్చి భర్తను పైకి లేవదీసి పట్టుకుంది. కానీ ఏమి చేయాలో అర్థంకాలేదు. పెద్దగా ఏడ్చుకుంటూ అందర్నీ పిలిచింది.

నిమిషాల్లో కంగారుగా ఊరువాళ్లందరూ చేరుకున్నారు.

ఊరిలో వున్న ఆర్.ఎం.పి డాక్టర్ దగ్గరకు తీసుకెళ్లారు. నోరు పక్కకిపోవడం, కాలూచెయ్యీ మెలికలు తిరిగినట్లుగా అనిపించడంతో, ఏదో ఉపశమనం కోసం ఇంజెక్షన్ చేసి పెద్దాసుపత్రికి తీసుకెళ్లమని చెప్పాడు డాక్టర్.

రమణమ్మకేమీ పాలుపోలేదు. కొడుకేదో చిన్న ఉద్యోగం చేసుకుంటూ ఊరికి కొంచెందూరంలో ఉంటున్నాడు. వాడికి కబురుచేసి వాడొచ్చేదాకా ఆగితే ఈయన సంగతెలా వుంటుందో? ఆలోచనలలు పరిపరివిధాలుగా పోతున్నాయి రమణమ్మకి. కొడుకు చేసేది చిన్న ఉద్యోగం, వచ్చే జీతంకూడా అంతంతమాత్రం. దానికితోడు ఇద్దరు చిన్నపిల్లలు. వాళ్లకొచ్చే రోగాలు. రొప్పులు, పెళ్లిళ్లు పేరంటాలు... వీటితోనే సతమతమవుతున్న కొడుకుతో తండ్రి విషయం చెప్తే ఏమంటాడో! ఆలోచనలతో అలాగే వుండిపోయిన రమణమ్మను కుదుపుతూ "అట్టాగే వుండిపోతే ఎలా? పెద్దాసుపత్రికి తీసుకెళ్లమని చెప్పాడు కదా డాక్టరు.

వినబడలేదా…” అడిగింది లక్ష్మమ్మ.

రమణమ్మకి వినబడినా అలాగే వుండిపోయింది.

కాసేపటి తర్వాత “అదే ఆలోచిస్తున్నాను.. ఏమీ తోచట్లేదు…” అంది

“నీకు తెలిసేదాకా కూచుంటే ప్రాణం నిలబడిద్దా…” అంటూ అందర్నీ కేకేసి వాళ్లదగ్గర ఎంతుంటే అంత తీసుకుని ఇద్దరు పెద్ద మనుషుల్ని తోడిచ్చి పెద్దాసుపత్రికి తీసుకుళ్ళేలా ఏర్పాటుచేసింది.

************************

“చూడమ్మా… ఈయనకు పక్షవాతం వచ్చింది. వంకర తిరిగిన నోరు మామూలుగా వచ్చి మాట రావడానికి కొంతకాలం పడుతుంది. కాలు కొద్దిరోజుల్లో మామూలుగా అయిపోతుందిగానీ చేతివంకర సరికావడానికి కూడా కొద్దిరోజులు పడుతుంది. చెయ్యి సరిగా అవడానికి రోజువిడిచి రోజు ఫిజియోథెరపీ చేయించాలి. మీ ఊళ్లో ఎవరైనా తెలిసిన డాక్టర్ వుంటే వారితో చేయించుకోవచ్చు. మంచి ఆహారం తినగలిగింది పెట్టండి. కొన్నాళ్లకు పూర్తిగా కోలుకుంటాడు” అని డాక్టర్ చెప్తున్న మాటలు వింటూ కూలబడి పోయింది. రమణమ్మ. ఆమెని ఎలా ఓదార్చాలో వెంటొచ్చిన పెద్దమనుషులకు అర్థంకాలేదు. తిండిలేదు, సరిగా నిద్రలేదు, దానికి తోడు ఇంటి మనిషి మంచానపడేసరికి రమణమ్మకి కాలూచెయీ ఆడట్లేదు.

ఆయనవంక దీనంగా చూస్తూ శోకదేవతలా అలాగే కూర్చుండిపోయింది.

******************************

“ఏమయింది..” అంటూ పరుగుపరుగున వచ్చిన కొడుకుని వాటేసుకుని జరిగిందంతా ఏడుస్తూ చెప్పింది.

తల్లి చెప్పింది విని కంగారుపడ్డాడు రామ్మూర్తి. కళ్లముందు వైద్యఖర్చులు కనిపించి కాళ్లల్లో వణుకు మొదలయింది. తండ్రిని ఒడ్డున పడేయాలంటే తాను రోడ్డున పడాల్సిందే!

ఓదార్చుతూ ఒక్కమాట కూడా పలకకుండా నించున్న కొడుకుని చూసి రమణమ్మ గుండె జారిపోయింది.

బిక్షపతి వంక చూశాడూ రామ్మూర్తి.

ఐసీయూలో కంటిచూపు నోటిమాట లేకుండా అచేతనంగా పడున్న తండ్రిని చూసి బాధపడ్డాడు. ఒక్కగానొక్క కొడుకైన తనను పెంచడానికి ఆయనెంత కష్టపడ్డాడో గుర్తొచ్చింది. మిషన్ కుట్టడంద్వారా వచ్చిన ఆ కొద్ది ఆదాయంతోనే తన అవసరాలు తీర్చడానికి ఎన్ని అవస్థలు పడ్డాడో గుర్తొచ్చింది. అప్రయత్నంగా రెండు కన్నీటిబొట్లు చెంపల్ని తడిమాయి. తల్లికి కనిపించకుండా తుడుచుకుని బయటికి నడిచాడు.

ఆత్మీయతలకంటే ఆర్థికసంబంధాలు బలమైనవి. పాపం పుణ్యం సుఖం దుఃఖం ఏమీ ఆలోచించుకోనివ్వవు. నోటిమాట తండ్రికి పడిపోయిందో తనకు పడిపోయిందో అర్థంకాలేదు. తిండి తినకుండా ఒక్కపెట్టున ఏడుస్తున్న అమ్మకు కనీసం నాలుగు ఓదార్పు మాటలు కూడా చెప్పలేని నిస్సహాయస్థితిలో ఉండడం ఎంత బాధాకరమో అనుభవంలోకి వచ్చింది. అసలే పేదరికం, దానికి తోడు అనారోగ్యాలు ఒకదాని తర్వాత ఒకటిగా దాడిచేస్తే మధ్యతరగతి బతుకులు ఎంత శిధిలమవుతాయో తల్చుకుంటుంటే ఒళ్లు జలదరించసాగింది.

తండ్రి బాగవడం సంగతి పక్కనపెడితే ఆ సంగతి విన్న భార్య ఆలోచనలు ఎలా వుంటాయో అని ఆలోచిస్తున్నాడు రామ్మూర్తి. ‘అప్పులు చేయకుండా బతకాలంటుంది, బతుకంతా అప్పులేనా’ అని గొణుగుతుంటుంది. వినడానికి ఆ మాట బాగుంటుంది.

కానీ ఆచరణలో ఎంత కష్టమో అనుభవించే వాళ్లకు మాత్రమే తెలుసు. కుబేరులే బ్యాంకుల్లో అప్పులు తీసుకుని వ్యాపారం చేసుకుంటున్నప్పుడు, కూటికి గతిలేని కుటుంబం నుండి వచ్చిన తను అప్పులు లేకుండా సంసారాన్ని ఎలా నెట్టుకు రాగలడు?

సంబంధం లేకుండా ఆలోచనలు సాగిపోతున్నాయి. తండ్రిని డిశ్చార్జ్ చేసి ఇంటికి తీసుకెళ్తే భార్య ఏమంటుందో? అలా కుదరని పక్షంలో ఊరికి పంపిస్తే అమ్మ చేసుకోగలదా? ఉన్న చిన్న ఉద్యోగం వదిలేసి తనెళ్లి ఆ పల్లెటూళ్ళో ఉండలేడు. వచ్చే జీతంలో కోతపడి వస్తే ఆ పరిస్థితి ఇంకా దారుణంగా వుంటుంది. ఉన్న అప్పులకు తోడు మళ్లీ కొత్త అప్పులంటే భార్య ఊరుకోద

బయట కూర్చున్నాడన్న మాటేగానీ ఆలోచనలు బుర్రను ఛిన్నాభిన్నం చేస్తున్నాయి.

చేయడానికేమీ తోచక అయోమయంగా దిక్కులు చూడసాగాడు.

****************************

ఆటో దిగి ఇంట్లోకి తీసుకొస్తున్న భర్తవంకా, అడుగులు పడీపడనట్లుగా వేస్తూ చిన్నపిల్లాడిలా తడబడుతూ నడుస్తున్న మామగారి వంకా, చీరచెంగు చుట్టూ కప్పుకుని శోకమూర్తిలా నడుస్తున్న అత్తగారివంకా చూస్తూ మర్యాద చేయాలో వద్దో అనే సందిగ్ధంలో బక్కెట్టుతో నీళ్ళుతెచ్చి కాళ్లు కడుక్కోమని చెప్పింది.

"నాన్నకు బాగోలేదు కదా... కొన్నిరోజులుంటాడని... తీసుకొచ్చాను" కాళ్లు కడుక్కుంటూ అన్నాడు రామ్మూర్తి.

"తెలుస్తూనే ఉంది" చెంబు బక్కెట్లో వేసి వెనక్కి తిరిగింది.

నిశ్చలంగా వున్న నీళ్లల్లో చలనం మొదలయింది.

"ఏమీ తోచట్లేదు అన్నాడు గానీ, ఇక్కడికి తీసుకొస్తాను' అని మాట మాత్రం చెప్పని భర్తమీద పీకలదాకా కోపం వచ్చింది. ఆ కోపంలో అనారోగ్యంతో వున్న తండ్రి కొడుకింటికి కాకుండా ఎక్కడికెళ్తాడనే ఇంగితం మర్చిపోయింది. తన తండ్రికి గుండాపరేషన్ చేయించినప్పుడు దగ్గరుండి మరీ కావలసినవన్నీ అమర్చి ఆయన కోలుకున్నాకే ఇంటికి పంపించిన లక్ష్మి తన భర్త తండ్రి విషయంలో అలా ఆలోచించలేకపోయింది. పుట్టింటి మమకారాన్ని ప్రదర్శించడంలో పునీతమైన కళ్లు అత్తింటివారి అనారోగ్యాన్ని చూడడంలోని విశాలదృష్టిని కోల్పోయాయి.

మూడురోజుల్లో నయమవుతుందని చెప్పాడనుకుంటా డాక్టరు..." అంది లక్ష్మి. తనలో తనే అనుకున్నా ఆ మాటలు అందరికీ వినిపించాయి. కోడలి ఆంతర్యం అర్థమై కొయ్యబారిపోయింది రమణమ్మ. బిక్షపతికి పనిచేసే నరాలు కూడా బిగుసుకు పోతున్నట్లుగా అనిపించింది.

కొత్తగా మాట్లాడడం నేర్చుకుంటున్న చిన్నపిల్లల్లాగా తనకి కావలసినవి చెప్తున్నాడు బిక్షపతి. అర్థం అయీఅవనట్లుగా వుంటున్న మాటలను విని మొదట్లో చిరాకుపడింది లక్ష్మి. అత్తగారు ఏమనుకుంటుందో అని మొదట్లో బెరుగ్గానూ, భయంభయం గానూ వున్నా, రోజులు గడుస్తున్న కొద్దీ మాట్లాడే మాటల్ని, అంతులేని చిరాకుని బహిరంగంగానే వ్యక్తపర్చసాగింది.

తల్లిదండ్రుల్ని ఇంటికెళ్లమని చెప్పలేడు, భార్యని సర్దుకుపొమ్మని చెప్పే ధైర్యంలేదు. భార్య మాటలు వింటూ మనసులోనే బాధపడుతూ మౌనంగా వుంటున్న కొడుకుని చూసి ఆశ్చర్యపడింది రమణమ్మ. భార్యను కసురుకోమనో, తిట్టమనో, కొట్టమనో ఆమె ఉద్దేశ్యం కాదు. కానీ రోగంతో వున్నవాడిని ఇటువంటి మాటలతో ఇంకాస్త బాధపెడితే అనారోగ్యం తగ్గకపోగా మరింత పెరుగుతుందనే ఆందోళన ఎక్కువయింది రమణమ్మలో. భారం భగవంతుడి మీద వేసి రోజులు గడపసాగింది.

********************************

చిరాకులతోనో పరాకులతోనో మూడురోజులనుకున్నది వారంరోజులైంది.

రామ్మూర్తి పొద్దున టిఫిన్ చేసి ఆఫీసుకెళ్తే సాయంత్రందాకా ఇంటికి రాడు. కొడుకు ఇంటిదగ్గరుంటే ఆ మాటా ఈ మాటా చెప్తూ వుండేవాడు. కొంచెం పొద్దుపోయేది. బిక్షపతికి మాట స్పష్టంగా రాకపోయినా అర్థంచేసుకునేటట్లుగా ఉందిప్పుడు. కొడుకు ఆఫీసుకెళ్లాక భార్యతోనే మాట్లాడేవాడు. భార్యాభర్తలిద్దరూ గదిలో కూర్చుని మాట్లాడుకుంటుంటే నచ్చని లక్ష్మి గ్లాసులు కిందకి పడేసో, వస్తువులు కావాలని గోడకేసి కొట్టో నిరసన తెలియజేసేది.

అడిగితే గొడవలు తప్ప మనశ్శాంతి కరువని అర్థమయింది రమణమ్మకి. ఉన్న ఆరోగ్యానికి తోడు ఓర్పులేని గొడవల వల్ల మరింత కుంగిపోతారని అర్థమైన మౌనంగా ఉండిపోయింది. 'ఏ పని చెప్పమంటావో చెప్పు' అని కోడలు వెనకాలే తిరగసాగింది.

బిక్షపతికి పిచ్చెక్కినట్లవుతోంది. మాట్లాడే మనిషిలేడు. ఏదో తాహతుకొద్దీ కొడుకు భోజనం పెడ్తున్నాడు. తినాలని వున్నా తినలేకపోతున్నాడు. దిగులుతో గుండె బరువెక్కసాగింది. దానికితోడు చేయి సరిగా రావడానికి రోజుమార్చి రోజు ఫిజియోథెరపీ చేయించడానికి వెయ్యిరూపాయలదాకా ఖర్చవుతోంది. ఇప్పటిదాకా అలా చేయించడానికి చాలా ఖర్చయింది. నరాలన్నీ ఒక్కచోటకి చేరినట్లుగా బిగిసిపోయింది చెయ్యి. అదికూడా స్వాధీనంలోకి వస్తే ఇంటికెళ్లి మిషనుకుట్టి ఎంతో కొంత కొడుక్కి పంపించాలి. తనవల్ల ఇప్పటికే చాలా ఖర్చయింది. 'మీ అనారోగ్యం మా చావుకొచ్చింది. డబ్బులు కూర్చలేక ఆయనా, వండివార్చలేక నేనూ చచ్చిపోతున్నాం. మీరు కోలుకునేసరికి మేము మూలపడేటట్లున్నాం" అన్న కోడలి మాటలు గుర్తొచ్చాయి.

కళ్లల్లో నీళ్ళు సుడులు తిరిగాయి. మనసులో ఎంత ప్రేమున్నా ఆర్థికంగా లోటువుంటే ఆ ప్రేమ అగాధంగానే వుంటుంది. కోడలన్న మాటల్లో కూడా నిజం లేకపోలేదు. అందరికీ ఒక కూరా, తనకు ఒక పథ్యం కూరా... ఇలా రోజుకు రెండుపూటలా వంటతో సతమతమవుతుంది కోడలు. భార్య సహాయం చేసినా ఆమెకు నచ్చదు. మళ్లీ అదే పని తిరిగిచేసుకుంటుంది.

ఇంటి విషయాలన్నీ ఆలోచిస్తూ కూర్చుంటే వచ్చిన ఈ కాస్త ఆరోగ్యం కూడా నిలవదని బాధపడ్డాడు బిక్షపతి. ఏమిచేయాలో తెలియదు. ఇంటికెళ్తే పోషణ ఎలాగో అర్థంకావట్లేదు. అయినా తప్పదు. 'ఇప్పటివరకు అయిన ఖర్చులు చాలు, ఇంటికెళ్తే ఏదో ఒకటి తిని బతకొచ్చు' అనుకుని ఆ విషయం సాయంత్రం ఆఫీసునుంచి వచ్చిన కొడుకుతో చెప్పాడు బిక్షపతి.

ఇష్టంలేకపోయినా తండ్రిని ఇంటికి పంపించడానికి ఒప్పుకున్నాడు రామ్మూర్తి. గుండెలమీద భారం దిగినట్లుగా సొంతోషించింది లక్ష్మి.

కొడుకు వస్తానని చెప్తున్నా వద్దని వారించి భార్యాభర్తలిద్దరూ ఊరికి వచ్చేశారు.

**************************

ఇల్లూడ్చిన తర్వాత పక్కలు సర్దుతూ దిండుకింద దొరికిన కవరుతీసి ఆశ్చర్యపడుతూ తీసుకొచ్చి భర్తచేతికిచ్చింది లక్ష్మి. నాన్న చేతిరాత చూసి రామ్మూర్తి చాలా ఆశ్చర్యపడ్డాడు. ఎప్పుడో చదువుకునేటప్పుడు రాసిన ఉత్తరాలు కళ్లముందు కనిపించాయి. ఎలా వుంటున్నానో, ఏమి తింటున్నానో కుశలమడుగుతూ ఉత్తరాలు రాసేవాడు. అక్షరాలలో తప్పులున్నా రాసిన వాక్యాలు తండ్రి ఆత్మను తేటతెల్లం చేసేవి.

ఇన్నేళ్ల తర్వాత మళ్లీ అదే చేతిరాత!

వణుకుతున్న చేతులతో కాగితం మడతలు విప్పాడు.


“రామూ! పిల్లల్ని కనడం, పెంచడం బరువుకాదు… బాధ్యత! చిన్నప్పుడు పిల్లలు చేసే అల్లరి విసుగనిపించినా అందులో కూడా ఆనందాన్ని వెతుక్కునే పిచ్చిజన్మలు తల్లిదండ్రులవి. అటువంటి తల్లిదండ్రులను వృద్ధాప్యంలో, అనారోగ్యంలో ఆదరించడం కొడుకులు బరువుగా భావించకూడదు. అక్కడున్నన్ని రోజులూ విసుగుతోనో, భారంగానో ముసలాళ్లని భరించావు. ఆస్పత్రినుంచి సరాసరి ఇంటికే పంపిస్తావనుకున్నాను. కన్నందుకు కొన్నాళ్లు నీ ఇంట్లో ఉంచుకుని తండ్రి రుణం తీర్చుకున్నావు. అందుకు నా జన్మ ధన్యమైనట్లే. ఇంటికొచ్చాక ఎలా బతకాలో తెలియలేదు. చనిపోవడానికి ధైర్యం చాలలేదు, ఒక్కగానొక్క కొడుకుని అనాథని చేసి వెళ్లడం భావ్యంకాదనిపించింది. బాగా ఆలోచించాక ఏదో ఒక ఆశ్రమంలో చేరి ఈ శేషజీవితాన్ని గడపాలని నిర్ణయించుకున్నాం.

‘వయోభారాన్ని దృష్టిలో వుంచుకుని, సంతానానికి వ్యవహారాల్ని అప్పగించి, భార్యతో కందమూలాలు తింటూ బతకడ’ మనే వానప్రస్థానధర్మాన్ని పాటించాలని మనపెద్దవాళ్లు ఎప్పుడో చెప్పారు. ఆ వానప్రస్థమే ఇప్పుడు ఆశ్రమాల రూపంలో వెలిసిందేమో! బంధాలను తెంచుకుంటేనే మానవజన్మకు ముక్తి. ఇప్పటి తల్లిదండ్రులకు చనిపోకముందే అటువంటి ముక్తి సంతానంద్వారా లభించడం దురదృష్టకరం. సమస్యలన్నిటికీ చనిపోవడం, పారిపోవడం పరిష్కారం కాదనిపించింది. ఆర్థిక ఒడిదుడుకులకు ఆత్మీయతల మహావృక్షాలు ఎలా నేలమట్టమవుతాయో మన విషయంలో రుజువయింది. అందుకే ఎప్పటికి నయమవుతుందో తెలియని నా అనారోగ్యం నాకెలాగూ భారంగానే వుంది. అది నీకు శాపంలా మారకూడదనే ఈ నిర్ణయం తీసుకున్నాము… పిల్లలు జాగ్రత్త… సెలవు!”.

రెండు కన్నీటిబొట్లు అప్రయత్నంగా కాగితంమీద పడి కళ్ళు మసకబారాయి.






Dr. Murali Thiruvengadam
MBBS, FRACGP
Principal GP, Conjoint Lecturer
Western Sydney University
Fluent in:
Hindi, Tamil, Telugu, Malayalam
RRMC RAILWAY ROAD MEDICAL CENTRE
QUALITY COMMUNITY CARE
P: (02)88891383 | F: (02)86254326
Bulk Billing
OPEN 7 DAYS
New Medical Centre at
Quakers Hill
Mon - Fri: 8.00am - 8.30pm
Sat: 8.00am - 6.00pm
Sun: 8.00am - 12.00pm
G02 / 25 Railway Road
Quakers Hill, NSW-2763
88891383
Fax: 86254326
www.railwayroadmedical.com.au

# వాహిని ఈ మాసపు ప్రశ్నావళి

**'వాహిని'** మాసపత్రికలో ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చినవారిలో **ఒకరికి** **Just Cakes** వారిచే $25 విలువ గల Gift Voucher కానుకగా అందించబడుతుంది. సమాధానాలు Vahini@sydneytelugu.org e-mail కు నవంబర్ 30 వ తేదీలోగా పంపగలరు.

## మీకు నచ్చిన రెండు తెలుగు సామెతలు పంపండి




**'సరిహద్దుగాంధీ' అని ఎవరిని పిలుస్తారు?**

జవాబు: ఖాన్ అబ్దుల్ గఫర్ ఖాన్ గారిని సరిహద్దు గాంధీ అని పిలుస్తారు... వారు స్వాతంత్ర సమరంలో గాంధీ, నెహ్రూలతో కలిసి పాల్గొన్నారు... స్వాతంత్రం తరువాత వారు పాకిస్తాన్ లో జీవితం కొనసాగించారు...
భారత విభజనకు తీవ్రంగా వ్యతిరేకించిన వ్యక్తి.

జవాబు:

- **శ్రీమతి జానకి వనం, హైద్రాబాద్**
- **శ్రీ ప్రదీప్ కుమార్ పెంకె, సిడ్నీ**
- **శ్రీమతి జయభద్ర దువ్వూరి, హైద్రాబాద్**
- **శ్రీనివాస్ బైరెడ్డి, సిడ్నీ**

**విజేత: శ్రీనివాస్ బైరెడ్డి**

❖❖❖❖❖

# వాహిని పాఠకుల స్పందన

ఈ నెల వాహిని సంపాదకులకు ముందుగా కృతజ్ఞతలు... వాహినిలో నేను వ్రాసిన "బాధ్యత కొందరికేనా" కథ ప్రచురించినందుకు నా హృదయపూర్వక ధన్యవాదాలు...

గాన గంధర్వుడు బాలుగారి ముఖ చిత్రం నవ్వులు వెదజల్లుతున్నా, మా హృదయాలలో తడియారని కన్నీటి సంద్రం ఉప్పొంగింది... ఎన్నో పాటలు, కార్యక్రమాలు వీక్షించిన మాకు బాలుగారు ఇక లేరు అన్నది జీర్ణించుకోలేకపోతున్నాము...

మన వాహినిలో వచ్చిన ప్రతి శీర్షిక బాలుగారికి నివాళిగా అనిపించింది... ప్రముఖుల స్పందన, ముఖ్యంగా వంశీ రామరాజుగారి అనుభవాలు ఎన్నో ఎన్నెన్నో క్రొత్త విషయాలు తెలియజేసాయి...

పెయ్యేటి శ్రీదేవిగారి "బాలు మళ్ళీ జన్మించాడు" కథ చాలా బాగుంది... స్వర్గ లోకంలో బాలుగారిని ఆదరించిన తీరు, అక్కడ ఘంటసాలగారి ఆహ్వానం బాగుంది... ఆఖరికి మళ్ళీ బాలుని భూలోకం పంపిన తీరు, శ్రీదేవిగారిది ఊహ అయినా మనసుకు నచ్చింది...

పెయ్యేటి రంగారావుగారి "సాంఖ్య యోగము" గురించి, వారిచ్చిన వివరణ బాగుంది... అర్జునుడికి ఆత్మ స్థైర్యాన్ని కలిగించేలా సాంఖ్య యోగములో వివరించారు... ఎన్నో విషయాలు తెలుసుకుంటున్నాము...

తెలుగు భాష గొప్పదనం వివరించే బాలుగారు దూరమవటం మన తెలుగు భాషకు తీరని లోటు... విజయగారి అక్షర రూపం బాగుంది...

నవదుర్గలపై వివరణ బాగుంది... ఇంగ్లీషు మోజులో మన తల్లి భాషను మరచిపోతున్న నేటి తరానికి తాతయ్య నేర్పిన తెలుగు పద్యం బాగుంది...

డి కామేశ్వరిగారి "మహిమ" ఎంతో ఉత్కంఠతతో సాగుతుంది... సర్వాంగ సుందరంగా అలంకరించిన 'వాహిని' తన ప్రతిభ చాటుకుంది...

**శ్రీమతి షామీరు జానకీ దేవి, హైద్రాబాద్**

ఉత్తమ పాఠకురాలు శ్రీమతి షామీరు జానకీ దేవి గారికి వాహిని మాసపత్రిక ధన్యవాదాలు తెలియచేస్తోంది. క్రమం తప్పకుండా వాహిని మాసపత్రికపై చక్కని సమీక్ష ఇస్తున్నారు.

వీరు వాహిని వెలువడగానే డౌన్లోడ్ చేసుకుని, ప్రింట్ చేసుకుని చదువుతారు.

ప్రతినెల మీ స్పందన ద్వారా చక్కని అనుబంధం కొనసాగిస్తున్నారు. జానకిగారు భారతీయ స్టేట్ బ్యాంక్ లో బాధ్యతలు నిర్వర్తించి, ఇపుడు విశ్రాంత జీవనం గడుపుతున్నారు. మీలాంటి అత్యుత్తమ పాఠకురాలు మా పత్రికకు ఎంతైనా అవసరం

❖❖❖❖❖

.


SRI LAKSHMI SUPERMARKET
SLS
WEEKEND DEALS
Friday
Saturday &
Sunday Only
FRUIT & VEG
SPICES & LENTILS
FROZEN FOODS
UTENSILS
SNACK
FLAVOURS
RICE
Visit our store for
Weekly specials
WIDE RANGE OF GROCERIES,
INDIAN, SRILANKAN, NEPALESE,
PAKISTAN & BANGLADESH
86 Station Street,
Wentworthville NSW 2145

శ్రీమతి డి. కామేశ్వరి, హైద్రాబాద్



"ఇదిగో ఇలాగే డబ్బంతా తగలేసుకుంది. ఒళ్లు గుల్ల చేసుకుంటోంది. తాగకుండా ఉండలేదు. అంతలా అలవాటయింది. డబ్బు చేతిలో లేకపోతే ఎంతకైనా దిగజారి, అందరినీ అడుగుతుంది. మొదట్లో ఏదో పోనీలే బ్యాడ్ డేస్ నడుస్తున్నాయి కదా అని అడిగినప్పుడల్లా ఉన్నదానిలో ఇచ్చేవాళ్లం. తీర్చడం అనేది ఎప్పుడూ లేదు. రోజురోజుకీ తాగుడు ఎక్కువయింది. మేం మాత్రం ఎన్నిసార్లు ఇస్తాం. లేదంటే తిట్టేది, అరిచేది. అవసరానికి ఆదుకోని మీరేం స్నేహితులు అంటూ ఏడిచేది. ఈ గోల రోజురోజుకీ ఎక్కువయింది. పొమ్మంటే పోదు. ఎక్కడికి పోతాను అంటుంది దిగులుగా. ఇదంతా న్యూసెన్స్ అయి పోయింది. తన ఉచ్ఛస్థితి కళ్లారా చూసినవాళ్లం. ఇప్పుడీ స్థితిలో తనని రోడ్డున లాగిపడేయులేం కదా ..."

రూమ్‌లోకి వెళ్ళాక, మహిమ సీమ పక్కనే కూర్చొని, అడిగింది. "ఇప్పుడు తనకేం సంపాదన లేదా" ?

"నా మొహం సంపాదన. ఎవరో ఒకరో ఇద్దరో ఎప్పుడో చిన్న చిన్న యాడ్స్‌కి పిలుస్తుంటారు. ఓ ఐదువందలు చేతిలో పెట్టి పంపిస్తారు" ?

"మరి భోజనం ... ఇంటద్దె ..." ? సందేహం వెలిబుచ్చింది మహిమ.

"చెప్పాగా ... చేతిలో డబ్బుంటే ఎప్పుడో ఓసారి కాస్త కూస్త ఇస్తుంది. రూము ఖాళీ ఉంటే రూములో పడుకుంటుంది. లేకపోతే ఈ హాల్లో పరుపేసుకు పడుకుంటుంది. వెలిగిన రోజుల్లో ... మా అందరికీ ఎన్నెన్ని ప్రెజంట్లు, బర్త్‌డే గిఫ్ట్‌లు, హోటళ్ళలో పార్టీలు, మంచి మంచి డ్రెస్సులు ... ఏవేవో కొనిచ్చేది. అందుకే నిర్దయగా పొమ్మనలేకపోతున్నాం. "మాతోపాటే తింటుంది. ఖర్చు అందరం షేర్ చేసుకుంటాం. ఏం చెయ్యమంటావు? తోటి అమ్మాయి ... చూస్తే బాధగా ఉంటుంది".

"వాళ్ల ఊరు వెళ్లిపోవచ్చు గదా ..."

"ఊర్లో ఎవరున్నారు. వాళ్ల అమ్మ అన్నయ్య దగ్గర ఉంటుంది. వదినగారు ప్రీతి సంగతి తెలిశాక లోపలికి రానీదు ... తల్లి నిస్సహాయంగా ఉండిపోయింది".

"అంతలా ఎలా ..." రేణుక టీ పట్టుకురావడం చూసి ఆగిపోయింది మహిమ. టీ తాగి, కాస్త స్నాక్స్ తింటుండగా, "సీమా, పోనీ మన ఆఫీసులో ఏదన్నా చిన్న జాబ్ ..."

"ఏయ్ ... నీకేమైనా మతిపోయిందా ? ఆమెను అసలు ఆఫీసులో అడుగు పెట్టనీయరు. అసలు తను ఇక్కడున్నట్టు వాళ్లకి తెలిస్తే ఏం చేస్తారో ... ప్లీజ్ ఎవరి దగ్గరా ఈ ప్రసక్తి తేవద్దు ..."

"అసలేం జరిగింది ? సీమా ... రియల్లీ ... నాకు చాలా బాధగా ఉంది. చెప్పవా" ?

సీమ బద్ధకంగా ఆవులిస్తూ "ఇంకోసారి చెబుతాలే. కాసేపు పడుకోనివ్వు ..." అంది అటు తిరిగి. మహిమ నిరాశగా తనూ పక్కమీద వాలింది.

✻ ✻ ✻

మీనన్ మహిమ పోస్టు చూడడం పూర్తిచేసి ... "మొదటిదే బాగుంది. రెండోది నీవన్నట్టు నెగెటివ్ అప్రోచ్. వాళ్లు శుభంగా షోరూమ్ ప్రారంభిస్తున్నప్పుడు పాజిటివ్ అప్రోచ్ బాగుంటుంది. రిచ్‌గా యాడ్ తీస్తారు. అయినా చీరల గురించి ఇంతకంటే ఏం చెప్పగలం ? ఇంకేదన్నా తట్టిందా" ? ఆలోచిస్తూ అడిగాడు.

"లేదు సర్. ఎంత ఆలోచించినా, నాలుగైదు రాసినా, ఇదే బాగుంది అనిపించింది".

"ఓకే ! విశాల్ గారిని కూడా చూడనీ, ఆయన ఏం చెప్తాడో విన్నాక ఓకే చేద్దాం. ఇదిగో ఈ రెండు ఆర్డర్లు తీసుకెళ్లి వర్క్‌చేయి" మరో రెండు ఆర్డర్ల ఫైలు ఇచ్చాడు. మహిమ సీటులోకి వచ్చి కూర్చుంది. ఫైలు ఓపెన్ చేసి చూసింది. ఒకటి కొత్తగా మార్కెట్‌లోకి రాబోయే సబ్బు, రెండోది కొత్త వంట నూనె. రెండింటికి కాప్షన్ కావాలి, ప్రకటనకి. ఇవి కూడా విజువల్స్ కాని ప్రకటనకి ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలి. ఏమిటో ఇన్ని రకాల సబ్బులు ... మార్కెట్‌లో

ఎన్ని నిలదొక్కుకుంటాయో తెలియదు. జనం అలవాటుపడిన వస్తువుని అస్తమానం చాలామంది మార్చరు. కొందరు అదేపనిగా కొత్త ప్రోడక్ట్ రాగానే మార్చేస్తుంటారు. చాలామంది టూత్‌పేస్ట్‌లాంటివి మారిస్తే నోట్లో పుళ్లు పడతాయని భయపడడం తను వింది. ఆలోచిస్తూ కంప్యూటర్‌లో కొత్త ఐడియాల కోసం వెతుకుతుంటే విశాల్ దగ్గర్నుంచి రమ్మన్న ఫోను వచ్చింది.

"ప్లీజ్ బి సీటెడ్! పెళ్ళిసీను, పెళ్ళికొడుకు తన్మయత్వంతో చూడడం ఆ సమయంలో సహజంగా జరుగుతుందా ?" కాస్త సందేహంగా అడిగాడు.

"అంటే ... మామూలుగా వరుడు చూసీచూడనట్టు అమ్మాయిని, చీరని చూసి చాలా బాగుందనుకుంటాడు. నిజజీవితంలో అరక్షణంలో అతని మెదడుకి ఆ సీను సంకేతం పంపించేస్తుంది. కానీ, తెరమీద ఆ సీను పడ్తుంది. ఇలా ఒక్కసారి ఫోకస్ చేసి, కెమెరా పక్కకి వెళ్ళిపోతే మెసేజ్ అందదు చూసేవారికి..."

విశాల్ విశాలనేత్రాలతో చకితుడైనట్టు చూస్తుండిపోయాడు. ఈ అమ్మాయి ఎంత లోతుగా ఒక సీను అబ్జర్వ్ చేసి, ప్రెజెంట్ చేసిందో అర్థమై మహిమవి మామూలు ఆలోచనలు కావు, తీసిపారేసే ఆలోచనలు అసలే కావనుకున్నాడు. అరక్షణంలో మహిమ పట్ల అతని అంచనాలు పెరిగిపోయాయి. అతనికి తెలియ కుండానే ఆరాధనభావం, గౌరవం, ఆసక్తి లాంటి భావాలన్నీ అతన్ని చుట్టు ముట్టాయి.

"సార్, ఈ యాడ్ ఎక్కువగా కెమెరా పనితనం మీద ఆధారపడుతుంది. షాపులోని ప్రతి కోణాన్ని రిచ్‌గా చూపించాలి. చీరల అందాలకి, అమ్మాయిల అలంకారాలకి ప్రేక్షకులు ఎక్కువగా ఆకర్షితులవుతారు తప్ప, ఈ సంభాషణల పట్ల అంత పట్టించుకోరని నా విశ్వాసం. విజువల్స్ ఉన్నప్పుడు కెమెరా మాట్లాడాలి కానీ, రైటర్ స్క్రిప్టు కాదు. అయినా ఈ సీను సగటు ప్రేక్షకుడికి సులువుగా అర్థం కావడానికి ఆ డైలాగులు చాలని నా భావన. మాటలకు విలువ తక్కువిచ్చి కెమెరాకి ఎక్కువ పని చెపితే సీను పండుతుంది. కెమెరా మూమెంట్స్, షాట్స్

అవన్నీ డైరెక్టర్, కెమెరామేన్‌ల ప్రతిభ, పనితనం మీద ఆధారపడి ఉంటాయి" అనర్గళంగా చెప్పుకుపోతోంది మహిమ.

విశాల్ తేరుకుని, "ఎస్ ! మహిమా ... రియల్లీ యూ ఇంప్రెస్‌డ్ మీ. నాకర్థమైంది మీ భావం. మీరు చెప్పింది కరెక్ట్ ! ఈ యాడ్‌కి కెమెరా షాట్స్ హైలైట్ కావాలి".

"సర్, అవసరమైతే షూటింగ్ జరిగే చోటుకి వెళ్లి కెమెరా ప్లేస్‌మెంట్స్‌కి సహాయం చేయగలను. నేను నా ఊహల్లో ఎలా అనుకున్నానో డైరెక్టర్, కెమెరామేన్‌లకి, కావాలంటే సలహా చెప్పగలను".

"ఓ ! మీకు ఈ ఫీల్డ్ కూడా తెలుసా ..." ఆశ్చర్యంగా అడిగాడు.

"ఆ ... ముద్రాలో ఉన్నప్పుడు, పనేమీ లేకపోతే, నేను స్క్రిప్టు ఇచ్చిన షూటింగ్ చూస్తుండేదాన్ని. ఈ కెమెరా యాంగిల్ ఇలా ఉంటే బాగుండేది ... ఆ షాట్ అలా తీస్తే బాగుండేది ... అనిపించేది. కానీ ట్రైనింగ్ పీరియడ్‌లో నా అభిప్రాయాలు డైరెక్టర్‌కి చెప్పడం మర్యాద కాదు. అపార్థం చేసుకుంటారు గదా. కాని అలాంటి షూటింగులన్నీ కుతూహలంగా చూడడం వల్ల నాకు కొంత అనుభవం వచ్చింది" మహిమ నమ్రతగా అంది.

"ఓ ! అయితే కొన్నాళ్లకి డైరెక్ట్ చేసేస్తానని ఆ ఫీల్డ్‌లోకి వెళ్లిపోతారేమో ..." నవ్వుతూ అన్నాడు విశాల్. "ఓకే ! ఇది ఓకే చేద్దాం. షూటింగ్ ఆరంభమయ్యాక మీకు కావాలంటే డైరెక్టర్‌తో చెప్పి పర్మిషన్ ఇప్పిస్తాను".

"థాంక్స్ సర్ ! ఇట్ విల్ బి ప్లెజర్ ఫర్ మి ..."

"సర్, ఫైనల్ చేశాక, షూటింగ్‌కు ముందే డైరెక్టర్‌తో ఒకసారి మాట్లాడితే మంచిది. వాళ్లు షాట్ డివిజన్ ప్లాన్ చేశాక మార్చమనడం బాగుండదు. ఏదన్నా చెప్పాలంటే ముందే చెప్పాలి ..."

"ఓకే ! డైరెక్టర్ నిర్ణయం జరిగాక, ఓసారి మీ ఇద్దరూ కలిసి స్క్రీన్‌ప్లే చూసుకోండి. హ్యాపీ ..." అన్నాడు విశాల్ నవ్వుతూ.

మహిమ నిజంగా చాలా ఆనందంగా "థాంక్యూ సర్! ఐయామ్ గ్రేట్‌ఫుల్ టు యూ" అంటూ బయటికి వెళ్ళి సీటువైపు నడుస్తుంటే గాలిలో తేలిపోతున్నట్లని పించింది.

"ఏమిటి అంత హ్యాపీగా ఉన్నావు. సెలెక్ట్ చేశారా విశాల్ సార్..." అనుపమ నవ్వుతూ అంది. "అనుపమ, గిరీష్... కంగ్రాట్ మీ" అంది. అనుపమ చేయి పట్టుకుని జరిగిందంతా చెప్పగానే ... "ఏయ్ రెండు రోజులకే బాస్ మనసు దోచేశావు. మేమిక్కడ ఏణ్ణర్థం నించి పనిచేస్తున్నాం" అలిగినట్టు అంది.

"టాలెంటమ్మా! టాలెంట్ ఉంటే ఎవరూ పైకి లాగక్కరలేదు. మహిమ దూసుకు వెళ్ళిపోతుందంటే ... అది ఆమెలో ఉన్న క్రియేటివిటి ప్లస్ అంకితభావం. కంప్యూటర్ ముందు కూర్చుంటే ఆమె కళ్లు ఇటు అటు చూడవు. మనం అంత సిన్సియర్‌గా చేస్తున్నామా ... ఉద్యోగాన్ని ఉద్యోగంలా చూస్తున్నాం" గిరీష్ నిజాయితీగా అన్నాడు.

"అవునులే ... అందరం ఒకలా ఎలా ఆలోచించగలం. అందరి గీతలు ఒకలా ఉండవు. అందరి రాతలు ఒకలా ఉండవు" అంటూ నుదుటి గీతలని చూపిస్తున్నట్టు యాక్ట్ చేసింది అనుపమ. అంతా నవ్వారు.

"ఏయ్, మరీ అంత పొగడ్తలొద్దు. కాని ఒకటి చెప్పు. ఇప్పుడు ఈ స్క్రిప్టుకి ఎంత అమౌంట్ అవుతుందన్నది. ఎంత బిల్లింగ్ చెయ్యాలి, డైరెక్టర్, ప్రొడ్యూసర్, నటీనటులను ఎవరు సెలక్ట్ చేస్తారు ..."

"అబ్బో అన్నింటికి తలో డిపార్ట్‌మెంటు. కస్టమర్ ఆర్డర్ వచ్చాక ముందు అది ప్రకటనా, విజువల్సా, షార్ట్ ఫిలిమా అని ఏ ఆర్డరులో చూసినా, ముందు క్రియేటివ్ డిపార్ట్‌మెంటే ప్రకటన తయారుచేస్తుంది. తరువాత యాడ్ డివిజన్‌కి, విజువల్స్ అయితే విజువల్ డివిజన్‌కి పంపిస్తారు. ఉత్త ప్రకటన అంటే వార్తా పత్రికల కోసమైతే, ఆర్టిస్టుల చేత బొమ్మ వేయించి, ప్రకటన రాయిస్తారు. కొన్ని ప్రకటనలకి ఆర్టిస్ట్‌లు ఫోటోలతో ... అంటే సినీతారలు, క్రికెట్ తారలు,

మోడల్స్ లాంటి వారితో కాప్షన్ చెప్పిస్తూ ఫోటోలతో ప్రకటనలుంటాయి. డబ్బిచ్చేవాడికి కావల్సిన విధంగా, వారి పేమెంట్‌ని బట్టి, బడ్జెట్‌ని బట్టి ప్రకటన కేటగిరీలుంటాయి. విజువల్స్‌కి రేటెక్కువ ఉంటుంది. స్క్రిప్టు ప్రకారం ఆర్టిస్టులెంతమంది ? లొకేషన్ అవుట్‌డోరా, ఇన్‌డోరా ? ఎన్ని సీన్లు ? సింగిల్ షాట్, మ్యూజిక్ బ్యాక్‌గ్రౌండ్ చాలా ? పాట ఉండాలా ? ఇవన్నీ చూసి ఆర్టిస్టులని, డైరెక్టర్‌ని బుక్ చేసుకోవడం, షూటింగ్‌కి కావల్సిన కెమెరాలు, లైట్లు, వాళ్లందరికి పేమెంట్స్ ... ఈ వ్యవహారాలన్ని చూసుకోవడానికి ఒక్కొక్క యాడ్ ఒక్కో ప్రొడ్యూసర్‌కి అప్పుచెబుతారు. ప్రొడ్యూసర్ మొత్తం ఖర్చును ఎస్టిమేట్ చేసి, ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్‌కి పంపిస్తారు. అంటే ఒక యాడ్ రావాలంటి ముందు క్రియేటివ్ డిపార్ట్‌మెంట్‌కి పంపిస్తారు.వారు పరీక్ష చేసి, బిల్లు తయారుచేసి అది కస్టమర్‌కి పంపి, బేరసారాలు జరిగాక పని మొదలుపెట్టాలి. పేమెంట్ కూడా ఒక్కొక్క కంపెనీ ఒక్కో విధంగా తీసుకుంటుంది. సాధారణంగా అందరూ ఆరంభానికి ముందు సగం, తరువాత ప్రోగ్రెస్‌ని బట్టి పాతిక పర్సెంట్, పూర్తి అయి ఓకే చేశాక మిగతా ఫుల్ అమౌంట్ పే చేస్తారు. వాళ్లిచ్చిన టైం లిమిట్‌లో పని పూర్తి చేసి ఇచ్చాక కొన్ని ప్రోడక్ట్స్ అడ్వర్టైజింగ్ బాధ్యతను యాడ్ ఏజెన్సీలకే, అంటే పత్రికలకి పంపడం, టీ.వి.లకి, సినిమా థియేటర్లకి, కాంట్రాక్టులో ఎలా ఉంటే అలా డిస్ప్లే చేసే బాధ్యత కూడా వీరికే అప్పగిస్తారు. సాధారణంగా యాడ్ ఏజెన్సీలే ఈ ప్రకటనల సంగతి చూసు కుంటాయి".

"సపోజ్ ... మనం తయారుచేసిన యాడ్ కస్టమర్‌కి నచ్చకపోతే" ? మహిమ సందేహం.

'ఆ మర్చిపోయాను ... ప్రకటన స్క్రిప్టు తయారయ్యాక, అంగీకారం కోసం కస్టమర్‌కి పంపుతారు. వారు సరేనంటే ప్రొడక్షన్‌కి వెడుతుంది. మార్పులు సూచిస్తే మళ్లీ క్రియేటివ్ డిపార్ట్‌మెంట్ మార్చాల్సి ఉంటుంది. ఒకసారి అగ్రిమెంటు పూర్తయ్యాక ఇంక మార్చడం ఉండదు. యాడ్ పని పూర్తయ్యాక మరోసారి కస్టమర్‌కి పంపి అతను పూర్తిగా సంతృప్తి చెందాకే మొత్తం

చెల్లించాల్సిన డబ్బు చెల్లిస్తారు. పేమెంట్ మొత్తం అయ్యేవరకు ప్రకటనలకి పంపరు".

"ఒక ప్రకటన బయటికి రావడానికి ఇంత తతంగం, తెరవెనక, తెరముందు ఇంతమంది పనిచెయ్యాలన్నమాట ..."

"ఇది కేవలం ఆఫీస్ స్టాఫ్. ప్రొడక్షన్ వారంతా కాంట్రాక్ట్ వాళ్లే. నటీనటులు, కెమెరా స్టాఫ్, మ్యూజిక్, స్టేజీ ప్రాపర్టీస్ ... అన్నీ ఎప్పటికప్పుడు ఎవరు దొరికితే వారిని బుక్ చేస్తారు. వీళ్లు కాక ఇంటీరియర్ డెకొరేటర్స్, ఎలక్ట్రీషియన్స్, కార్పెంటర్స్ ... చిన్న చిన్న యాడ్‌లకి, అంటే వంటింట్లో, బాత్‌రూముల్లో, ఓ డెంటిస్ట్ క్లినిక్, బెడ్‌రూముల్లో షూట్ చేయడానికి అప్పటికప్పుడు సెట్స్ వేస్తుంటారు. మనం చిన్న చిన్న యాడ్‌లలో చూసే డెంటిస్ట్ క్లినిక్కు, బాత్‌రూమ్ క్లీనింగ్ మెటీరియల్ యాడ్స్, వంటింటి పొడులు, పచ్చళ్ళ ప్రకటనలు అన్నింటికి సెట్స్ వేసి షూట్ చేస్తారు. ఎందుకంటే అవుట్‌డోర్, ఇళ్లల్లో షూటింగులకి ప్రయాసతో పాటు ఖర్చు ఎక్కువవుతుందని. ఫిఫ్త్‌ఫ్లోర్‌లో చూశావుగా ... అంతా షూటింగులకి, సెట్స్‌కి వాడతారు. ఎవరెవరు ఎక్కడ పనిచేస్తున్నారో కూడా అందరికీ తెలియదు. ఎవరి డిపార్ట్‌మెంట్ వారిదే. మొత్తం అంతా మేనేజ్ చేసేది ఛైర్మన్ అవినాష్‌జైన్. ఆయన కొడుకులు వినోద్, విశాల్ డైరెక్టర్లు, అసిస్టెంట్స్, సెక్రటరీలు ... ఓ రెండేళ్ల నుంచీ చూస్తున్నా, నాకు కూడా పూర్తిగా తెలియదు అన్నింటి గురించి".

"వినోద్ అన్న ఆయన కనపడలేదే ? విశాల్ గారిని చూశాను ..."

అనుపమ అదోలా నవ్వి ... "మనకు ఆయన కనపడడు, మనం ఆయనకి కనపడం. మనం ఆయనకి కనపడకపోవడం మంచిది ..." అదోలా నవ్వి అ,ది. "అతనిది విజువల్స్ సెక్షన్. ప్రొడక్షన్, డైరెక్టర్‌లు, నటీనటులు, ప్రొడ్యూసర్లు ... ఫైనల్ ప్రోడక్ట్ తయారై వెళ్ళాల్సింది అక్కడినుంచే. సాధారణంగా మన క్రియేటివ్ సెక్షన్ నుంచి స్క్రిప్టు పంపించాక మన పని అయిపోతుంది.

అప్పుడప్పుడు కస్టమర్‌కి నచ్చనివి మార్చి రాయాల్సి ఉంటుంది. వినోద్ గారితో మనకు డైరెక్ట్ కాంటాక్ట్ ఉండదు".

'ఓ ఐసీ ! తెలుసుకోవాల్సినవి చాలా విషయాలు ఉన్నాయిక్కడ. ఇంట్రెస్టింగ్ ఫీల్డ్" అంది మహిమ. ఆ తరువాత ఎవరి పనుల్లో వారు నిమగ్నమయ్యారు.

✳ ✳ ✳

ఆరతి ఆరోజు చాలా సంబరంగా, హుషారుగా బ్యాగు ఊపుకుంటూ వచ్చింది. అందరు డైనింగ్ టేబిల్ దగ్గర భోజనం కోసం కూర్చున్నప్పుడు ... "హాయ్ గర్ల్స్ ! అయామ్ వెరీ హ్యాపీ హ్యాపీ" అంది బ్యాగును టేబిల్ మీద పడేసి ఊరిస్తున్నట్టు.

"ఏం తల్లీ ! ఏదన్నా యాడ్‌లో యాక్ట్ చేసే ఛాన్సు ఇంకోటి వచ్చిందా" ? సీమ అంది.

మహిమ కుతూహలంగా చూసింది.

"ఓ యస్ ! గెస్ ... ఏం పాత్ర ..." ఊరించింది.

"ఏముంది ఏ సబ్బో చేత్తో పట్టుకుని ఫోజిస్తూ ... 'మాసబ్బునే వాడండి' అని చెప్పడం" మంగళ నవ్వుతూ అంది ఆటపట్టిస్తూ.

"ఏయ్ పో ... చీప్ ఆలోచనలు మీవి. ఈసారి మిలమిల మెరిసిపోయే పెళ్ళికూతురు వేషం. ఖరీదయిన పట్టుచీర, ఒంటినిండా ధగధగలాడే నగలు, అద్భుతమైన మేకప్‌తో రిచ్‌గా గొప్పింటి పెళ్ళికూతుర్ని చూస్తారు. పెళ్ళికూతురిగా నేను సెలక్ట్ అయ్యాను. పెద్ద చీరల షోరూమ్ షూటింగ్" అంటూ నడుం మీద చెయ్యిపెట్టి ఫోజిస్తూ అంది.

"ఎంతసేపు ? పది సెకన్ల సీనా ... ? చీరల ప్రకటన అయి ఉంటుంది" స్రవంతి కవ్వించింది.

"ఏయ్ ... రెండు నిమిషాల సీను. పెళ్ళి స్టేజి ... పెళ్ళికొడుకు, పెళ్ళికూతురు వరమాల మార్చుకునే సీను ..." గొప్పగా అంది ఆరతి.

'ఏమిటి పెళ్ళి సీనా ... ? అబ్బాయి అమ్మాయి వంక, చీరవంక అలా మైమరచి చూస్తాడు ... అంతేనా, అదేనా సీను ? ఉద్విగ్నంగా అంది మహిమ.

"ఏయ్ ... నీకెలా తెలుసు ..." తెల్లబోతూ అడిగింది ఆరతి.

"నేనే స్క్రిప్టు తయారుచేశాను. అప్పుడే దాని మీద వర్క్ మొదలుపెట్టేశారా?" ఆరాటంగా అంది మహిమ.

"నువ్వు రాశావా ? రియల్లీ ... ! ఏయ్ థాంక్స్ మహిమా ! నాకోసమే రాసినట్టున్నావు. ఇవాళ ఆ యాడ్‌కి ఏక్ట్ చెయ్యడానికి అగ్రిమెంటు రాయించు కున్నారు. థాంక్యూ ..." మహిమ చేతులు పట్టుకు ఊపింది.

"భలేదానివే. రాయడం నా డ్యూటీ. అది నీకు దొరకడం నీ లక్. థాంక్స్ నాకెందుకు. నీ బాస్‌కి చెప్పు. డైరెక్టర్ ఎవరు ? షూటింగ్ ఎప్పుడు" ?

"అవన్నీ నాకేం తెలుస్తాయి. నా పాత్ర వరకు నాకు చెప్పారు. మిగతా దంతా పని ఆరంభించినప్పుడు తెలుస్తుంది. ఏయ్ లెటజ్ సెలబ్రేట్ ... ఐస్‌క్రీమ్ ఆర్డర్ చేస్తాను" అంది ఆరతి సంబరంగా.

"ఓకే గ్రేట్ ! రేణూ డిన్నర్ పట్రా ఆకలేస్తోంది" అమ్మాయిలంతా అరిచారు.

"ఇదివరకు ఎన్ని యాడ్స్‌లో నటించావు". మహిమ ఆరా తీసింది చపాతీ తింటూ.

"ఎక్కడ ... నేను ఫీల్డ్‌లోకి వచ్చే ఏడాదిన్నర అయింది. చిన్న చిన్న ఫోటో యాడ్స్ రెండు మూడు, ఒకటి రెండు చిన్న యాడ్స్ తప్ప, ఇంత రిచ్ ప్రకటన, అదీ రెండు నిమిషాల ప్రకటనలలో ఇదే మొదటిసారి. ఒకసారి ఒక ఫ్యాషన్ షోలో పాల్గొన్నాను. రన్నరప్‌గా బహుమతి వచ్చింది. ఈ ఛాన్స్‌తో నా అదృష్టం తిరిగి సినిమా ఛాన్స్‌లు వస్తే ... అది నా కల మహిమ" ఎమోషనల్‌గా అంది ఆరతి.

"తప్పకుండా నెరవేరుతుంది. అందం, టాలెంట్ ఉంది. జాగ్రత్తగా ప్లాన్ చేసుకుంటే సక్సెస్ తప్పకుండా వస్తుంది" నమ్మబలికింది.

డిన్నర్ తరువాత ఐస్‌క్రీమ్ ట్రీట్ అందరూ ఎంజాయ్ చేస్తుండగా ప్రీతి వచ్చింది. "హాయ్ ఎవ్రీబడీ ... ఏమిటి ఐస్‌క్రీమ్ పార్టీ. వావ్ ... నాది వేరే పెట్టండి. తరువాత తింటా ... ఇంతకీ ఈ సెలబ్రేషన్ దేనికి" ? అంది కుర్చీలో వాలిపోయి.

"ఆరతికి మంచి యాడ్ ఫిలింలో నటించే ఆఫర్ వచ్చింది" సీమ అంది.

"ఓ, ఐసీ, కంగ్రాట్స్ ఆరతి ... ఏ ప్రోడక్ట్ ..." అంది.

"ఏదో చీరల షోరూమ్, గ్రాండ్ ఓపెనింగ్, పెళ్ళి షాట్ ... పెళ్ళికూతురి వేషం" అంది ఆరతి.

"కంగ్రాట్స్ వన్స్ ఎగైన్. ఇదిగో ఇలా షూటింగ్‌లప్పుడు జాగ్రత్తగా ఉండు. ఆ వినోద్‌గాడి కంటబడకు వీలయినంత వరకు. చూశాడంటే, కాస్త ఎర్రగా బుర్రగా ఉంటే పట్టేస్తాడు. వాడి పొగడ్తలకి పడిపోకు. బీ కేర్‌ఫుల్" అని చెబుతూ, "ఓకే ! మీరంతా తినేశారా ! లంచ్ కూడా తినలేదు, ఐదొందలు చేతిలో పెట్టాడు. మన డేస్ బాగులేనప్పుడు ... అదే దక్కుడు అని సంతోషించాలి" తనలో తనే అనుకుంటున్నట్లు మాట్లాడుతూ అన్నం తినసాగింది.

ప్రీతి మాటలు, ధోరణి మహిమకి ముందునుంచీ వింతగానే ఉన్నాయి. సీమ కూడా సరిగా చెప్పలేదు. ఇంకోసారి అడగాలి ... అనుకుంది. గుడ్‌నైట్ చెప్పుకుని ఎవరి గదుల్లోకి వాళ్లు వెళ్లారు.

"సీమ ... ఈ ప్రీతి సంగతి చాలా ఆశ్చర్యంగా ఉంది నాకు. సగం చెప్పి వదిలేశావు ఆరోజు ..." అంది మహిమ కుతూహలంగా.

"ఓకే. రేపు ఆదివారం. సెలవు కాబట్టి తొందరగా లేవక్కరలేదు గదా. చెప్పడానికి చాలా ఉంది కథ. కాని ప్రీతి కథ విని ప్రతి ఆడపిల్లా జాగ్రత్తగా

ఉండాలని మేమందరం కొత్తగా వచ్చిన అమ్మాయిలకి చెప్తుటాం. తనూ పాపం తన చేతులు కాలినట్టు ఇంకో అమ్మాయి కాల్చుకోకూడదని ఎప్పటికప్పుడు హెచ్చరికలు చేస్తూ జాగ్రత్తలు చెప్తుంటుంది. అవునూ ... నువ్వు హిందీలో "ఫేషన్" అనే సినిమా చూశావా ? మన ప్రీతి కథ అలాంటిదే ఇంచుమించు".

"చూడలేదే ... నాకిన్నాళ్ళు చదువు, ట్రైనింగ్‌తో బిజీలైఫ్ అయిపోయి సినిమాలు చూసే తీరికే లేకపోయింది".

తరువాత సీమ చెప్పిన మాటలు, ప్రీతి వాళ్లతో చెప్పిన కథ, ప్రీతి జీవితం ఎలా నాశనం అంటుందో వింటుందో...మహిమకి సినిమా చూస్తున్నట్టే అనిపించింది.

✲ ✲ ✲

"హాయ్ ప్రీతీ, మై డార్లింగ్ ... హ్యాపీ ... నా ప్రామిస్ నిలబెట్టుకున్నాను కదా ... నౌ యు బిలీవ్ మీ" గోముగా అడిగాడు ప్రీతి వెంట్రుకలు సరిచేస్తూ. మాటలు రానట్టు. చేతులు మెడచుట్టూ వేసి అతని గుండెల్లో మొహం దాచుకుంది ప్రీతి.

"థాంక్‌యూ డార్లింగ్ ! నా కలను ఇన్నాళ్లకి నిజం చేశావు. యు మేడ్ మి ఎ స్టార్ ! అయామ్ సో హ్యాపి ! ఇవాళ అందనంత ఎత్తుకి ఎదిగిపోయానన్న ఫీలింగు ... రెండేళ్ల నా కష్టం, ఎదురుచూపులు ఫలించాయి. నీ సపోర్ట్ లేకుండా నేను ఈ స్థాయికి ఎదగడమన్నది కలగానే మిగిలేది ..." కళ్లు చెమ్మగిల్లుతుండగా అంది.

"డోన్ట్ బి సిల్లీ ! నీలో అందం, ఆకర్షణ, నటన అన్నవి లేకపోతే నేనెంత ప్రయత్నించినా సక్సెస్ అవలేవు. ఇప్పుడు చూడు ఇక నీ వెంట అందరూ ఎలా పడతారో. ఫ్యాషన్ వరల్డ్ ఏదీ శాశ్వతం కాదు ప్రీతి. ఈ క్షణం నిచ్చెన పైమెట్టుమీద ఉంటావు. ఆ స్థానం నిలుపుకోడానికి అనేక దారులలో వెళ్లాలి.

అందరినీ ఆకర్షిస్తూ, మాటల్లో తెలివి, ఆత్మవిశ్వాసం, మంచితనం, వినయం అన్నీ కనబరుస్తూ, అందం మెరుగుపరుచుకోడానికి ఆరోగ్య సూత్రాలు పాటిస్తూ ... యోగాలు, ఎక్సర్‌సైజులు, ఫేషియల్స్, బ్యూటీ ట్రీట్‌మెంట్లు అన్నీ జీవితంలో భాగం అవ్వాలి. పేరొచ్చింది కదాని ప్రతి చెత్తా ఒప్పుకోకు. డిగ్నిఫైడ్‌గా కనపడాలి".

"ఒకే డార్లింగ్ ! నా వెనక నీవుండగా నాకేం భయం" కౌగిలి మరింత బిగించింది.

"ఏమో ! రేపు పెద్ద స్టార్‌వి అయిపోతే, నా అవసరం తీరిపోవచ్చు. అప్పుడు నేను నీ వెంట పడాలేమో. నీ దర్శనం కోసం పడిగాపులు పడాలేమో ..."

"ఏయ్ ... అలా మాట్లాడకు, నాకు కోపం వస్తుంది" బుంగమూతి పెట్టింది.

"చిన్న పాపాయిలా ఏమిటా అలక" ఆ బుంగమూతికి ముద్దు పెట్టాడు.

"ప్రీతి, నిజంగా, నీవు నా జీవితంలోకి రాకపోతే ఎంత నిస్సారంగా జీవితం గడిచేదో. జీవితంలో ఛార్మ్ లేదు అన్న నైరాశ్యాన్ని పటాపంచలు చేశావు. నా జీవితంలోకి వెలుగులా, వరదలా వచ్చేసి చుట్టుముట్టేశావు. నీ ప్రేమలో పడి ఎటో కొట్టుకుపోయాను. చుట్టూ ప్రపంచం ఉన్నదన్నదే మర్చిపోయాను. ప్రేమ అంటే ఇలాంటి అనుభూతి అని ఎరగని నాకు కొత్త లోకాన్ని చూపావు" ఆర్తిగా, ఆరాధనగా ఆమెని చుట్టేసి అన్నాడు.

"ఓ అనామికగా, కలలు మాత్రమే కనగలిగే మామూలు అమ్మాయిలో ఏం చూశావో, ఏం మంత్రం వేశావో, నేనెందుకు నచ్చానో, ఏదీ ఆలోచించే శక్తి కోల్పోయినట్లు చేసి వశపరచుకున్నావు. నీవు మంత్రగాడివి. ఒకటే భయం నాకు. ఇది కల అని, కరిగిపోతుందన్న భయం మాత్రం వదలడం లేదు. నిన్ను శాశ్వతంగా నా దగ్గర ఉంచేసుకోవాలంటే ... ఎలా డియర్ ? చెప్పు నేనేం చెయ్యాలో ..." ఆర్తిగా అంది ప్రీతి.

"అది సాధ్యం కాదని మనిద్దరికి తెలుసు. మరుక్షణం మనది కాదు.

ఉన్న క్షణంలో ఆనందం అనుభవించకుండా జరగనిదాని గురించి ఆలోచించి ఉన్నది చేజార్చుకోవద్దు. ప్రీతి, నన్ను ఈ అనుభూతినించి దూరం చెయ్యకు. ఇక్కడున్నంతసేపు మనిద్దరం తప్ప ఏ ఆలోచన చొరబడనీయకు" తమకంగా అల్లుకుపోయాడు.

ప్రీతి నిట్టూర్చింది. ఆ విషయం తనకీ తెలుసు. కానీ, తను కోరుకున్న ఈ క్షణాలు తనెప్పటికీ ఉంచుకోవాలంటే ఏంచెయ్యాలో మాత్రం తెలియడం లేదు ఆమెకి.

❊ ❊ ❊

ప్రీతి తండ్రి బ్యాంక్ ఉద్యోగి. తల్లి స్కూలు టీచరు. ఇద్దరిది కులాంతర వివాహం అవడంతో ఇటువారు, అటువారు దూరం అయ్యారు. ప్రీతి పుట్టాక ఇంక పిల్లలు వద్దనుకున్నారు. ప్రీతిని ఉన్నంతలో బాగానే పెంచి చదివించసాగారు. వయసొచ్చేసరికి ప్రీతి, తల్లి అందం పుణికిపుచ్చుకుని మిసమిసలాడే టీనేజ్ గర్ల్, కాలేజ్ గర్ల్‌గా మగపిల్లలందరినీ తన చుట్టూ తిప్పుకుంటూ, వాళ్ల పొగడ్తలకి మురిసిపోతూ, తన అందం చూసి వెంటపడుతున్న అందరిని ఆకర్షిస్తూ, తనో రాకుమారిగానో, ఓ సినీతారగానో ఊహించుకుంటూ, చుట్టూ ఉన్న అమ్మాయిలని చిన్నచూపు చూస్తూ, తనుండాల్సింది ఇలాంటి చోటున కాదని, ఎలాగైనా సినిమాలలో పెద్ద నటి అవ్వాలని, కావాలని, ప్రకటనల రంగంలో చిన్న ఉద్యోగం సంపాదించుకుని, చిన్న చిన్న యాడ్స్‌లో నటిస్తూ ఏనాటి కన్నా తనకి గుర్తింపు వచ్చి, పెద్ద స్టార్ అవ్వాలని కలలు కనే సమయంలో ... వినోద్ కంటపడింది.

ఓ రోజు చిన్న ప్రకటన జరుగుతోంది. చిన్న టూత్‌పేస్ట్ ప్రకటన. హౌస్‌వైఫ్‌గా నటించే సీను. షూటింగ్ జరుగుతుండగా వినోద్ ఇంటికి వెళ్ళబోతుంటే లిఫ్ట్ దగ్గర షూటింగ్ పూర్తిచేసి బయటికి వచ్చి లిఫ్ట్ వైపు వెడుతున్న

ప్రీతి కనబడింది. చూపు తిప్పుకోకుండా అటే చూస్తుండిపోయాడు. లిఫ్ట్ తలుపులు మూసుకున్న తరువాత స్టూడియో వైపు వెళ్లాడు. పేకప్ చేస్తున్న స్టాఫ్ అంతా వినయంగా నమస్కారాలు చేశారు. డైరెక్టర్ ప్రమోద్ ఎదురొచ్చి విష్ చేశాడు.

"ఏం షూటింగ్ జరిగిందిక్కడ" ?

"చిన్న టూత్‌పేస్ట్ యాడ్ సార్" అన్నాడు ప్రమోద్.

"ఎవరో కొత్త అమ్మాయిలా కనిపించింది. దీన్లో యాక్ట్ చేసిందా ? పేరు ఏమిటి ?" యధాలాపంగా అడిగినట్టు అడిగాడు.

"ప్రీతి అని కొత్తగా వచ్చింది. మనం ఇచ్చిన ప్రకటనకి అప్లికేషన్ పెట్టింది. ఇంటర్వ్యూలో సెలెక్ట్ అయింది. ఓ రెండు స్టిల్ యాడ్స్‌లో నటించింది".

"ఫొటోజెనిక్ ఫేస్‌లా ఉంది. యాక్షన్ ఎలా ఉంది" ? ఆరా తీశాడు.

"స్టార్ పొటెన్సీ ఉంది సార్. ఫ్రీగా చెప్పింది. ఈజీగా చేసింది. మనం కాంట్రాక్ట్ బేసిస్ మీద బుక్ చేసుకోవచ్చు" ప్రమోద్ అన్నాడు.

"ఓకే లెటజ్ సీ ... ఇంకొక రెండు చెయ్యనీ, ఆలోచిద్దాం" అని బయటికి వెళ్లాడు. అతని కుడిభుజం ... డ్రైవర్ కం అడ్వయిజర్, ఇన్‌ఫార్మర్ లాంటి పాత్రలు పోషించే అన్వర్‌తో లిఫ్ట్‌లో ... "ఆరా తీయి ఆ అమ్మాయి సంగతులన్నీ" అన్నాడు అర్థవంతంగా చూస్తూ.

'జీ సాబ్' ఒక్కమాట నమ్రతగా అన్నాడు. మర్నాడు సాయంత్రానికల్లా ప్రీతి పుట్టుపూర్వోత్తరాలన్నీ రాబట్టేశాడు అన్వర్.

ప్రీతి మధ్యతరగతి అమ్మాయి. చదువు కంటే కూడా, తన అందాన్ని నమ్ముకుని పెద్ద సినీతార, కనీసం టీ.వి. తారయినా అయిపోవాలని ఆరాటపడే అమ్మాయి. దానికోసం రకరకాల ఫొటోలు తీయించుకుని అడ్వర్టయిజింగ్ కంపెనీలకి, సినీ, టీ.వి. ప్రొడ్యూసర్లకి పంపిస్తూ, చెయ్యని ప్రయత్నాలు లేవు. ఎలాగో బి.ఎ. అయితే గట్టెక్కింది. మన కంపెనీకి పంపిన అప్లికేషన్‌కి

ఇంటర్వ్యూకి పిలిస్తే వచ్చి సెలెక్ట్ అయి, చిన్న యాడ్స్ చేసింది. మామూలు మధ్యతరగతి అమ్మాయిల మనస్తత్వం యాడ్ వరల్డ్ గాలానికి చిక్కుకుంటుందన్నది అతనికి బాగా తెలుసు.

మర్నాడు ఆఫీసుకి రాగానే ప్రొడక్షన్ మేనేజర్‌ని పిలిచి చాలా మామూలుగా, షూటింగ్‌కి తయారుగా ఉన్న ప్రోడక్ట్ గురించి ఆరాతీశాడు. ఒక ఫేషియల్ క్రీమ్ యాడ్ షూట్ చెయ్యాల్సి ఉంది అన్నాడతను.

"నిన్న ఎవరో ప్రీతి అన్న అమ్మాయి లిఫ్ట్ దగ్గర కనిపించింది. చాలా ఫొటోజెనిక్‌గా ఉందనిపించింది. ప్రమోద్‌ని వివరాలు అడిగాను. చెప్పాడు. ఫేషియల్ క్రీముకి హీరోయిన్‌ని సెలెక్ట్ చేశారా ?' ఆరా తీశాడు.

"ఇంకా లేదు సార్. చూస్తున్నాం. ఇద్దరు ముగ్గురు కొత్త ఫేస్‌లున్నారు".

"అయితే, ఈ అమ్మాయిని ట్రై చేయండి. ఆ అమ్మాయిలో స్పార్క్ ఉంది. స్టార్ పొటెన్సీ కనిపించింది" అన్నాడు చాలా మామూలుగా.

"ఓకే సార్ ! యాజ్ యూ విష్" అని వెళ్లిపోయాడు మేనేజర్.

ఇదేమీ తెలియని ప్రీతి వెంటవెంటనే మరో ఆఫర్ వచ్చినందుకు పొంగి పోయింది. అదంతా తన అందం, నటన వల్లే అనుకుని ఊహాలోకంలో తేలి పోయింది.

ఫేషియల్ క్రీమ్ షూట్ అయ్యాక ఫైనల్ ప్రోడక్ట్ విజువల్స్ చూస్తే వినోద్‌కి తన అంచనా తప్పుకాదని, ప్రీతిని ట్రైన్ చేసే సక్సెస్‌ఫుల్ స్టార్ అవుతుందన్న నమ్మకం కలిగింది. వెంటనే పనికి ఉపక్రమించాడు. ప్రీతిని తన ఆఫీసు రూముకి పిలిపించాడు. ప్రీతి ఈ ఎదురుచూడని ఆహ్వానానికి తబ్బిబ్బు అవుతూ, కాస్త భయం, ఆరాటంతో తడబడుతూ ... లోపలికి వెళ్ళింది. కంపెనీ డైరెక్టర్ నుంచి పిలుపు రావడం అంటే మాటలు కాదు అని అందరూ అంటూండగా వింది. ఇప్పుడు తనకి ఇలా పిలుపు రావడం ..." కమిన్ మిస్ ప్రీతి ! అలా కూర్చోండి. బి కంఫర్టబుల్. నిన్న మీరు నటించిన ఫేషియల్

క్రీమ్ యాడ్ చూశాను. అయామ్ ఇంప్రెస్‌డ్ విత్ ఇట్" మొదటి బాణం వదిలాడు వినోద్ జైన్. ఆశ్చర్యంతో, ఆనందంతో తబ్బిబ్బు అవుతూ "థాంక్ యూ సర్! ఇట్స్ ఏ గ్రేట్ కాంప్లిమెంట్ ఫర్ మి !" అంతకంటే ఏం మాట్లాడాలో అర్థం కాలేదు ప్రీతికి.

"మిమ్మల్ని ఆ యాడ్‌లో చూస్తే మంచి ఫొటోజెనిక్ ఫేస్ అని, యాక్టింగ్ టాలెంట్ ఉందన్నది అర్థం అయింది. అంచేత మిమ్మల్ని మా కంపెనీ ఆర్టిస్ట్‌గా కాంట్రాక్ట్ తీసుకుందామని నిర్ణయించాను. ఐ హోప్, మీకు అభ్యంతరం లేకపోతే ... అగ్రిమెంట్ రాసుకుందాం" రెండో బాణం వదిలాడు.

ప్రీతి నమ్మలేనట్టు చూసింది. కాంట్రాక్టు అంటే ఆమెకి తెలుసు. మొదటి సారి యాడ్‌లో నటించినప్పుడు కొన్ని వివరాలు సేకరించింది. ఈ కంపెనీతో కాంట్రాక్ట్ అంటే ఇంకో కంపెనీ అవకాశాలు వచ్చినా నటించకూడదు. ఇక్కడ వీరు చేసే ప్రకటనలకి అవకాశాన్ని బట్టి, అవసరాన్ని బట్టి ఇచ్చిన పాత్రల్లో నటించాలి. కాంట్రాక్టు అంటే నెలజీతం ప్రకారం పనిచెయ్యాలి అని తెలుసుకుంది. ఇంత పెద్ద పేరున్న కంపెనీలో అవకాశం దొరకడం అదృష్టం. ఇక్కడ పనిచేస్తే పేరుకి పేరూ, నెలకి జీతమూ ... కొన్నాళ్ళు చేశాక కావలిస్తే, పెద్ద అవకాశాలు వస్తే, కాంట్రాక్ట్ అయ్యాక వదిలేసుకోవచ్చు. ప్రీతి ఆలోచనలు ఎక్కడికో వెళ్ళిపోయాయి. ఇప్పుడు గుర్తింపేలేని తనకు ఇది పెద్ద అదృష్టం.

మొహం సంతోషంగా వెలిగిపోతుండగా, "థాంక్స్ సార్ మెనీ థాంక్స్ సార్. మీ కంపెనీలో పనిచేయడం నా అదృష్టం ..." గబగబ అంది. వినోద్‌కి అర్థమైంది ఆమె ఆరాటం. తను కూడా మరీ తొందరపడకూడదు. అంతా ప్రొసీజర్ ప్రకారమే జరుగుతోందని అందరూ అనుకోవాలి.

"దెన్ ఓకే ! మేమిచ్చిన ఫారాలు చదువుకుని సంతకం పెట్టండి. లీగల్ వివరాలు మా ప్రొడక్షన్ మేనేజర్ వివరిస్తారు ..." అంటూ ప్రొడక్షన్ మేనేజర్ సుధాకర్ వంక చూశాడు.

**(సశేషం)**

❖❖❖❖❖



# కామేశ్వరి



Computed according to Druk Siddhantham with Chitra Paksha Ayanamsa. Tidhi and Nakshtra times are finishing and Varjyam times are start to finish - Standard or Daylight Saving Time (AEST/NZDT) as applicable in Australia.

## నవంబర్ 2020

శ్రీ శార్వరి నిజ ఆశ్వయుజ బ పాడ్యమి నుండి కార్తీక శు పూర్ణిమ వరకు

శు – శుద్ధ; బ – బహుళ; వ – వర్జ్యం; పూ – పూర్వ; ఉ – ఉత్తర; రా - రాహు కాలం; పూర్తి అనగా తిథి/నక్షత్రం 00:00 నుండి మరుసటి రోజు 00:00 గంటల వరకు - 24 గంటల వ్యాప్తి. ఆస్ట్రేలియా లోని సిడ్నీ మెల్బోర్న్ కాల మానాలకు వర్తిస్తుంది.

పంచాంగ కర్తలు: నేతి శివరామకృష్ణ శాస్త్రి (సిడ్నీ) & కర్రా భాస్కర శర్మ (మెల్బోర్న్)

| | | | | | |
|---|---|---|---|---|---|
| ఆది<br>రా - 16:30 to 18:30 | 1 నిజ ఆశ్వయుజ<br>శు పూర్ణిమ 1:45<br>బ పాడ్యమి 4:17<br>భరణి 2:24<br>వ 0:38 - 0:49<br>వ 12:0 - 13:36 | 8<br>బ సప్తమి 13:0<br>పుష్యమి 14:15<br>వర్జ్యం లేదు | 15<br>బ అమావాస్య 16:2<br>స్వాతి 1:42<br>విశాఖ 22:47<br>వ 6:37 - 8:2 | 22<br>శు సప్తమి 3:13<br>ధనిష్ఠ 16:35<br>వర్జ్యం లేదు | 29<br>శు చతుర్దశి 18:10<br>భరణి 8:46<br>వ 22:10 - 23:57 |
| సోమ<br>రా - 7:30 to 9:30 | 2<br>బ పాడ్యమి 4:17<br>భరణి 2:24<br>వ 15:52 - 17:39 | 9<br>బ అష్టమి 12:16<br>ఆశ్లేష 14:16<br>వ 3:3 - 4:39 | 16 కార్తీక<br>శు పాడ్యమి 12:34<br>అనురాధ 20:7<br>వ 2:21 - 3:46 | 23<br>శు అష్టమి 4:18<br>శతభిషం 18:37<br>వ 0:23 - 2:8 | 30 ● కార్తీక<br>శు పూర్ణిమ 20:24<br>కృత్తిక 11:34<br>వర్జ్యం లేదు |
| మంగళ<br>రా - 15:00 to 16:30 | 3<br>బ విదియ 6:35<br>కృత్తిక 5:20<br>వ 23:5 - 0:52 | 10<br>బ నవమి 10:51<br>మఖ 13:25<br>వ 1:51 - 3:23<br>వ 20:56 - 22:25 | 17<br>శు విదియ 9:25<br>జ్యేష్ఠ 17:56<br>వ 1:13 - 2:40 | 24<br>శు నవమి 5:59<br>పూర్వాభాద్ర 21: 2<br>వ 1:40 - 3:25 | |
| బుధ<br>రా - 12:00 to 13:30 | 4<br>బ తదియ 8:50<br>రోహిణి 7:58<br>వ 14: 6 - 15:51 | 11<br>బ దశమి 8:46<br>పుబ్బ 11:54<br>వ 18:30 - 19:58 | 18<br>శు తదియ 6:48<br>మూల 16:10<br>వ 14:41 - 16:10 | 25<br>శు దశమి 8:11<br>ఉత్తరాభాద్ర 23:49<br>వ 7:45 - 9:32 | |
| లక్ష్మి<br>రా - 13:30 to 15:00 | 5<br>బ చవితి 10:40<br>మృగశిర 10:17<br>వ 19:23 - 21:7 | 12<br>బ ఏకాదశి 6:3<br>ఉత్తర 9:55<br>వ 17:26 - 18:51 | 19<br>శు చవితి 4:40<br>పూర్వాషాఢ 15:5<br>వ 1:20 - 2:52<br>వ 23:1 - 0:36 | 26<br>శు ఏకాదశి 10:34<br>రేవతి పూర్తి<br>వ 13:22 - 15:10 | Festivals & Holidays<br>14 – Naraka Chaturdasi<br>14 – Deepavali<br>18 – Nagula Chavthi<br>29 – Karthika Poornima |
| శుక్ర<br>రా - 10:30 to 12:00 | 6<br>బ పంచమి 12:3<br>ఆరుద్ర 12:18<br>వర్జ్యం లేదు | 13<br>బ ద్వాదశి 2:53<br>బ త్రయోదశి 23:24<br>హస్త 7:23<br>వ 14:26 - 15:51 | 20<br>శు పంచమి 3:26<br>ఉత్తరాషాఢ 14:52<br>వ 18:57 - 20:35 | 27<br>శు ద్వాదశి 13:10<br>రేవతి 2:54<br>వర్జ్యం లేదు | Sydney<br>Sun Rise Set<br>1 5:55 19:22<br>8 5:49 19:28<br>15 5:44 19:35<br>22 5:40 19:42<br>29 5:38 19:48 |
| శని<br>రా - 09:00 to 10:30 | 7<br>బ షష్ఠి 12:54<br>పునర్వసు 13:36<br>వ 0:57 - 2:38<br>వ 21:49 - 23:28 | 14 ●<br>బ చతుర్దశి 19:47<br>చిత్ర 4:33<br>వ 9:29 - 10:53 | 21<br>శు షష్ఠి 2:50<br>శ్రవణం 15:21<br>వ 19:33 - 21:14 | 28<br>శు త్రయోదశి 15:45<br>అశ్విని 5:52<br>వ 1:23 - 3:10<br>వ 16:38 - 18:25 | Melbourne<br>Sun Rise Set<br>1 6:13 19:54<br>8 6:06 20:02<br>15 6:00 20:10<br>22 5:55 20:17<br>29 5:52 20:24 |

padma priye padmini padma haste padmalaye padma dalayathakshe |
vishnu priye vishnu manonukule twathpada padmam mayisannidhaswa ||

## పాట నేర్చుకుందామా/పాడుకుందామా

చిత్రం: సీతామాలక్ష్మి

రచన: దేవులపల్లి కృష్ణశాస్త్రి

సంగీతం: కె.వి.మహదేవన్

గానం: ఎస్.పి. బాలసుబ్రహ్మణ్యం, పి. సుశీల

మావిచిగురు తినగానే.. ఏ ఏ ఏ కోవిల పలికేనా??

మావిచిగురు తినగానే.. ఏ ఏ ఏ కోవిల పలికేనా??

కోవిల గొంతు వినగానే.. మావిచిగురు తొడిగేనా?

కోవిల గొంతు వినగానే.. మావిచిగురు తొడిగేనా?

ఏమో..ఏమనునో గానీ..ఆమని..ఈవని!!

ఆ..ఆ మావిచిగురు తినగానే.. ఏ ఏ ఏ కోవిల పలికేనా.. ఆ..ఆ..ఆ..

తెమ్మెరతో తారాటలా.. తుమ్మెదతో సయ్యాటల..

అ ఆ..తెమ్మెరతో తారాటలా.. తుమ్మెదతో సయ్యాటల!!

తారాటల..సయ్యాటల..

సయ్యాటల..తారాటల..

వన్నెలే కాదు, వగలే కాదు,ఎన్ని నేర్చినది మొన్నటి పువ్వు??

వన్నెలే కాదు, వగలే కాదు,ఎన్ని నేర్చినది మొన్నటి పువ్వు??

బింకాలు.. బిడియాలు.. బొంకాలు..బోడుములు..

ఏమో..ఎవ్వరిదోగానీ ఈ విరి?? గడసరి!!

ఆ..ఆ..ఆ మావిచిగురు తినగానే.. ఏ ఏ ఏ కోవిల పలికేనా.. ఆ..ఆ..ఆ..

కోవిల పలికేనా??

ఒకరి ఒళ్ళు ఉయ్యాల.. వేరొకరి గుండె జంపాల..

ఉయ్యాల..జంపాల..జంపాల..ఉయ్యాల..

ఒకరి ఒళ్ళు ఉయ్యాల.. వేరొకరి గుండె జంపాల..

ఒకరి పెదవి పగడాలో..వేరొకరి కనుల దివిటీలో..

ఒకరి పెదవి పగడాలో..వేరొకరి కనుల దివిటీలో!!

పలకరింతలో.. పులకరింతలో

పలకరింతలో.. పులకరింతలో

ఏమో..ఏమగునోగానీ ఈ కథ..మన కథ!!

మావిచిగురు తినగానే.. ఏ ఏ ఏ కోవిల పలికేనా??

కోవిల గొంతు వినగానే.. మావిచిగురు తొడిగేనా?

ఏమో..ఏమనునో గానీ..ఆమని..ఈవని!!

మావిచిగురు తినగానే.. ఏ ఏ ఏ కోవిల పలికేనా.. ఆ..ఆ..ఆ.. కోవిల పలికేనా??

https://www.youtube.com/watch?v=beuhz9-rIXI

**INDAUS Celebrating 15 years of excellence**

We Provide Services Related To:

- General Skilled Migration Visas
- Family Visas
- Employer Based - Skilled Visas
- Long Term Business Visas
- Visitor Visas
- Student Services and Visas
- MRT - Migration Review Tribunal

## INDAUS IMMIGRATION

Home to all your migration needs...

**You enroll for professional year through us and we do 485 Visa for FREE**

**Good Scholarships & discounts for professional year program**

**Want to Know More Call Sree on 0416 799 306**

**What we do for Students**

**Student Visa Extensions**

**University & Course Change**

**Temporary Visas ( Post Study Work)**

***Sydney (Branch Office)***

Strathfield Plaza
Suite 7, Level 7, 11 The Boulevard
Strathfield NSW - 2135

***Melbourne (HQ)***

Suite 14, Level 11
401 Docklands Drive
Docklands VIC 3008

***Hyderabad, India***

Office
F.No. 303, Star G.B.R P.R.K. Enclave,
Dharam Karam Road, Ameerpet,
Hyderabad 500016 INDIA

Phone: +91 72070 44933

www.indausimmigration.com **Call 1300 699 306** info@indausimmigration.com

# మోడర్న్ బేతాళ కథ

చాందినీ బళ్ళా, సిడ్నీ

కృష్ణ చతుర్దశి నాడు నల్లని వస్త్రాలు ధరించి, ఖడ్గం చేత బట్టి, ఊరి చివర ఉన్న మర్రి చెట్టు వద్ద నుండి దక్షిణ దిశగా వెళ్ళి చెట్టుకు వేలాడుతున్న శవాన్ని భుజంపై వేసుకుని వెళ్ళసాగాడు.

శవంలో ఉన్న బేతాళుడు “రాజా! పాపం చాలా బరువు మోస్తున్నావు. నీకు ఆ శ్రమ తెలియకుండా ఉండటానికి ఒక చిన్న కథ చెబుతాను, విను” అంటూ విక్రమార్కుడికి ఈ విధంగా కథ చెప్పడం ప్రారంభించాడు.

"అనగనగా ఒక ఊరు, ఆ ఊరి శివార్లలో ఒక దట్టమైన అడవి, చీకటి పడితే అటు చూడటానికి కూడా భయం వేస్తుంది, అలాంటి చోట రాత్రి పుట ఏవో శబ్దాలు, నవ్వులు వినపడుతున్నాయి అని బాటసారులు కొందరు చెప్పగా, అసలే మూఢ నమ్మకాలపై విశ్వాసం ఉంచిన ఊరి జనం మరింత భయపడసాగారు.

ఊరి చివర వరకు వచ్చింది, తమ ఇంట్లోకి రాలేదా అని సాయంత్రం అవగానే తలుపులు గడియ పెట్టుకుని బిక్కు బిక్కు మంటూ గడపసాగారు..

ఈ మాట ఆ నోటా ఈ నోటా పడి చదువుకున్న వీర భద్రుడు చెవిలో పడింది.

అతను అనాధ, జ్ఞానవంతుడు, ధైర్యవంతుడు.

అదేమిటో కనుక్కోవాలని ఉత్సాహం, ఆతృత కలిగాయి, ఎందరు చెప్తున్నా వినకుండా అతను ఆ రాత్రి ఒక లైటు ఉన్న ఫోన్ తీసుకుని బయలు దేరి అక్కడకు వెళ్ళాడు.

నెమ్మదిగా అడవి సమీపించసాగింది, మర్రి చెట్టు ఊడలు గాలికి ఊగుతూ ఉన్నాయి, మధ్య మధ్యలో గుడ్ల గూబలు "ఔ, ఔ" అంటూ ఉన్నాయి, ఎక్కడో నక్క కూతలు, వేట కుక్కల అరుపులు, ఏడుపులు వినిపిస్తున్నాయి.

చంద్రుడు మబ్బుల వెనుక దాక్కున్నాడు, గాలికి కదిలే చెట్లు మనుషుల్లా, వాటి ఆకులు గుస గుసలాడుతున్నట్టు కనిపించసాగాయి.

తన నీడ కూడా తనకి భయం వేసేలా ఉంది ఆ ప్రాంతం..అందరూ చూచాయగా చెప్తున్న చోటికి వస్తుండగా దారి నిండా చచ్చిపడిన పాములు, అక్కడక్కడా మాంసం ముద్దలు, అలాగే చిరిగిన బట్టలు..ఇదంతా చూసి వీర భద్రుడు ఆలోచిస్తుండగా ఒక్కసారే పెద్దగా చెవులు చిల్లులు పడేలా నవ్వు శబ్దం..తన వైపే వస్తున్నట్టు..

ఒక్కసారే వొళ్ళు జలదరించింది వీరభద్రానికి..తల ఎత్తి చూసే లోగా ఢాం..

**************

మర్నాడు తెల్లవారు ఝామున అందరూ ఎదురు చూస్తూ రకరకాలుగా మాట్లాడుకోవడం మొదలు పెట్టారు, "చనిపోయి ఉంటాడు అని, వెళ్లొద్దు అన్నా వినలేదు అని, దెయ్యం తినేసింది అని ఇలా ఎన్నో విధాలుగా అనుకుంటుండగా దూరంగా వీరభద్రం కనపడ్డాడు.

"ఓ రాజా, అందరూ భయపడినట్టుగా అక్కడ నిజంగా దెయ్యం ఉందా?

అక్కడ అంతు చిక్కని రహస్యం ఏమిటి?"

ఇలా ప్రశ్నలు సంధించాడు బేతాళుడు "ఈ ప్రశ్నకి సమాధానం తెలిసీ చెప్పకపోతే నీ తల పగిలిపోతుంది" అన్నాడు.

"వీరభద్రం చదువుకున్న జ్ఞానవంతుడు కావడంతో అది దెయ్యం కాదని అతని నమ్మకం, పాముల కళేబరాలు, మాంసపు ముక్కలు తినడం, తల పైకి ఎత్తి చూడటం అంటే గాలిలో ఎగిరే పక్షి అయ్యి ఉంటుంది. మిగతా వారు శబ్దం వినగానే భయంతో ముందే పారిపోవడం వలన అదేమిటో తెలుసుకోలేక పోయారు, చినిగిన బట్టలు చూస్తే అది వలస పక్షి అయి ఉంటుంది, పదార్థం అనుకుని ఎత్తుకు వచ్చినట్టుంది,

ఏ విదేశీయుడు తెచ్చినపుడో తప్పించుకుని ఎగిరి పోయినట్టుంది, అక్కడ వాలింది..ఇక ఆఖరున వచ్చిన పెద్ద శబ్దం ఊరి నుండి ఎవరో ఫోన్ చేసి ఉంటారు, అంత నిశ్శబ్దంలో రింగ్టోన్ గట్టిగా వినపడి ఉంటుంది.. ఇదంతా గూగుల్ లో పక్షి గురించి ఎప్పుడో చదివిన వీరభద్రం రహస్యాన్ని ఛేధించాడు,మిగతా ఊరి వాళ్ళకి చదవటం రాక తెలుసుకోలేక పోయారు ఫోన్లు ఉన్నా సరే, నీకు మాత్రమే తెలుసా ఇటు వంటివి, సాంకేతిక పరిజ్ఞానం నాకు ఉంది, నేను చదివా ఇలాంటివి " అని నవ్వుతూ అన్నాడు విక్రమార్కుడు.

ఇలా విక్రమార్కుడు మౌనం వీడి మాట్లాడగానే నవ్వుతూ భుజం పై నుండి వెళ్ళి చెట్టుపై వాలాడు బేతాళుడు.

ఈ రోజు కూడా తను బేతాళుడిని తీసుకు వెళ్ళలేదని అందుకు నిరాశగా వెళ్ళి కారు స్టార్టు చేశాడు విక్రమార్కుడు.

నీతి : దెయ్యం, భూతం కన్నా అన్నింటికన్నా పెద్ద భయం "భయమే"..ఇక పల్లెటూరిలో ఫోన్, నెట్ అనుకుంటున్నారా, ఎక్కడికి వెళ్ళినా మీతోనే మేము అనే నెట్వర్క్ ఉన్నాయి మరి!!

ఇది ఆస్ట్రేలియా లో నేను చూసిన "కూక బరా" (kookaburra) అనే పక్షి జీవన విధానం ఆధారంగా రాసిన కథ..మొదట్లో నాకు దాని నవ్వు చాలా భయం వేసిందండోయ్!!

ఇది కల్పిత కథ మాత్రమే....

బేతాళుడు, విక్రమార్కుడి గురించి మాత్రం చందమామ వారి కథల నుండి తీసుకున్నాను. ఎవరిని అయినా నొప్పిస్తే మన్నించండి.






SYDNEY TELUGU ASSOCIATION


Apex
Dental Centre
Gentle, caring, quality dentistry
FREE Initial Consultation*
✓ General & preventative care
✓ Complete family care
✓ Cosmetic dentistry
✓ Gum disease and bad breath
✓ Crowns & Bridges
✓ Implants
✓ Full and partial dentures
* For non health fund members and no gap for health fund members.
We have Hindi, Telugu, Kannada, Marathi, Gujrati speaking dentists
FOUR CONVENIENT LOCATIONS
BAULKHAM HILLS
Suite 110, 10 Century Cct
Tel: 8850 4525
LIVERPOOL
Suite 4,61 Moore St
Tel: 9602 7815
QUAKERS HILL
206 Farnham Rd
Tel: 9626 5553
WENTWORTHVILLE
31/15-17 Lane St
Tel: 98964949
CALL TODAY FOR AN APPOINTMENT 1300 APEX DENTAL
www.apexdentalcentre.com.au

❖❖❖❖❖

తెలుగు బడి

Telugu Association Sydney

TeluguBadi

# తెలుగు బడికి ఆహ్వానం

## Welcome to Telugu Language School

**We provide:**

- Caring teachers
- Personal attention
- Attractive learning activities
- Outcomes based teaching

**A great opportunity for your child to learn Telugu.**

Enrol in your nearest school today for 2020 starting on Sun, 2-Feb-2020.

**Our Schools:**

- Strathfield South PS
- Hambledon PS (Quakers Hill)
- Darcy Rd PS (Wentworthville)
- Eastwood PS
- Beaumont Hills PS (Kellyville)

**When:** Every Sunday from 10 am to 12 noon (during school terms)

For details,
Visit: www.sydneytelugu.org
Call: 0402 169 963
Email: school@sydneytelugu.org

*-



# బాలవాహిని

డా॥ మీగడ రామలింగస్వామి — భారతాదిత్యులు

## 2. జవహర్‌లాల్ నెహ్రూ



*పరిపాలన దక్షుడవై*
*భరతావని నేలినట్టి*
*తొలి భారత ప్రధానీ!*
*రాజకీయ మర్మజ్ఞా*
*నెహ్రూజీ! వందనం!*
*అభివందన చందనం!*

★ జననం :- 1889 నవంబర్ 14 అలహాబాద్ (ఉత్తరప్రదేశ్)
★ సంపన్న కుటుంబం.
★ బ్రిటన్‌లో చదువు (1905లో వెళ్ళారు).
★ 1910లో కేంబ్రిడ్జిలో డిగ్రీ ఆనర్స్ చేశారు.
★ 1912 బారెట్లా ముగించుకొని భారత్ వచ్చారు.
★ 1920లో గాంధీ భావాలకు ఆకర్షితులయ్యారు.
★ స్వాతంత్ర్య సమరంలో ప్రధానపాత్ర పోషణ. కఠిన కారాగారవాసం ఎన్నోమార్లు చేశారు.
★ 1947 ఆగస్టు 15 తొలి భారత ప్రధాని.
★ చనిపోయే వరకూ వారే ప్రధాని.
★ శాంతి మంత్రం జపం వల్ల చైనా చేతిలో చావుదెబ్బ తిన్నారు.
★ ఆ అవమానం క్రుంగదీసింది.
★ పిల్లలంటే ప్రేమ. అందుకే చిల్డ్రన్స్‌డేని అతని పుట్టినరోజున జరుపుతాం.
★ జైల్లోనే 'డిస్కవరీ ఆఫ్ ఇండియా' గ్రంథం రాశారు.
★ కుమార్తె ఇందిరకు రాసిన ఉత్తరాలే 'గ్లింప్లెస్ ఆఫ్ వరల్డ్ హిస్టరీ' గ్రంథం అయింది.
★ 1955లో భారతరత్న.
★ నిర్యాణం :- 1964 మే 27, న్యూఢిల్లీ.

**సూక్తి :- తనయునేవేళ సాకుము, తప్పకుండ!**

7

❖❖❖❖❖


Swagath
Biryani House
(02) 8810 6690
http://www.swagath.com.au
46 Station Street
Wentworthville
NSW 2145


Venkat Kantipudi, B.Com, MPA, FIPA, FTIA
HOME LOANS
INVESTMENT & SMSF LOANS
TAX RETURNS & ACCOUNTING
Mortagage Broker & Tax Agent
Suite 11/55 Phillip St, Parramatta, NSW
Phone: 02 9633 2536 Mob: 0421 374 365
Email: venkat@associatedaccounting.com.au


BIRYANI HOUSE
PARADISE
Biryani House
BIRYANI HOUSE
14 George Street North Strathfield
Open 7 Days for Lunch and Dinner
Call us : 0297635282

❖❖❖❖❖

08:00 - 10:00 AM Sydney Time on Sat
02:30 - 04:30 AM India time
16:00 - 18:00 Hrs New York Time (Day -1 or Fri)
[ For India/US +1 Hour during Australia Winter Time]

Listen to Radio on 2TripleO FM 98.5 or DAB 985 or

You can also listen on PC/ internet, the URL is:
https://2tripleo.com.au/en-au/
http://s7.viastreaming.net/8500/m/

The program can also be listened over phone-audio by dialling: **+61 2 8080 5650**

via **TuneIn** App on **Android | iPhone**

**తెలుగువాణి – ఆస్ట్రేలియా స్వరవాహిని**
**2TripleO FM98.5 MHz**
**DAB 985**

**Saturdays 08:00 – 10:00AM Sydney Time**

27 సంవత్సరాలుగా సిడ్నీ తెలుగువారిని ప్రతి శనివారం ఉదయం 08:00 - 10:00 గంటల వరకు, మంచి మంచి అంశాలతో అలరిస్తూ, 25 ప్రసారకుల స్వచ్ఛంధ సేవలతో  రేడియో కార్యక్రమాలను అందిస్తున్న తెలుగువాణి కార్యక్రమాలను
2TripleO FM 98.5 అలవరసాలపై
**వినండి. వినిపించండి. వింటూ ఉండండి.**
ప్రసారకులుగా కార్యక్రమాలు అందించాలనే ఆసక్తి ఉన్న వారు;
కారక్రమాలకు ఆర్ధికంగా ప్రోత్సాహం అందించ తలచుకున్న వారు;
వ్యాపార ప్రకటనలను ఇవ్వదలచుకొన్న వారు;
మా కార్యక్రమాలపై అభిప్రాయాలను తెలియచేయాలనుకొనేవారు – సంప్రదించండి:

శ్రీ సారధి మోటమఱ్ఱి, 0430 022 130 or vani@sydneytelugu.org

**https://www.facebook.com/TeluguVaniSydney**

❖❖❖❖❖




❖❖❖❖❖